www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



10

సూపర్ బిలియనీర్లలో అంబానీ, అదానీ

రూ.36.45 లక్షల కోట్లతో ఎలాన్ మస్క్ టాప్

ముకేశ్ అంబానీ రూ.7.88 లక్షల కోట్లతో 17 వ స్థానం

గౌతమ్ అదానీ రూ.5.27 లక్షల కోట్లతో 22 వ స్థానం

శుక్రవారం | 28-2-2025 | పేజీలు: 12 + 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 314 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 3.16 తదుపరి విదియ; నక్షత్రం: శతభిషం మ. 1.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 7.27-8.54; దుర్ముహూర్తం: ఉ. 8.57-9.44 మ. 12.51-1.37; అమృతఘడియలు: ఉ.7.05-8.32; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ.3.24 లక్షల కోట్లతో నేడే రాష్ట్ర బడ్జెట్!

సూపర్ సిక్స్, ఇతర హామీలకు ప్రాధాన్యం!

కూటమి వచ్చాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్

అసెంబ్లీలో పయ్యావుల, మండలిలో కొల్లు

వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న అచ్చెన్న

పుస్తకాలకు స్వస్తి.. అంతా ట్యాబ్‌లలోనే!



అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత... తొలి పూర్తిస్థాయి బడ్జెట్ రూపుదిద్దుకుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను శుక్రవారం ఉదయం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్‌ను రూపొందించినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను నవంబరులో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2.94 లక్షల కోట్ల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో పోల్చితే ఇది 10 శాతం ఎక్కువ. అటు అభివృద్ధి, ఇటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. మరీ ముఖ్యంగా... తల్లికి వందనం,

మిగతా 11వ పేజీలో...

ఉగాది నుంచి 'పీ4'!

పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యంగా కార్యక్రమం

అర్హులైన పేదలను గుర్తిస్తున్న ప్రభుత్వం

ఆర్థికంగా మెరుగ్గా ఉన్న కుటుంబాలతో సాయం

ఎల్లుండి నాటికి 10 జిల్లాల్లో సర్వే పూర్తి

8 నుంచి 18 వరకూ మరో 16 జిల్లాల్లో సర్వే

4 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు

పైలట్‌గా 5,869 కుటుంబాలకు లబ్ధి: చంద్రబాబు

ఆగస్టుకు 5 లక్షల కుటుంబాలు పథకం పరిధిలోకి

11

• పోసాని బూతులు



బ్రోకర్, లోఫర్, సైకో, వెధవ, ల.. కొడకా, రాజకీయాలు వదిలేసి ఏ చావైనా చావు.. మీ అమ్మను, భార్యను కూడా తిడతా..

- నటుడు, రచయిత

పోసాని నోటి వెంట జారిన బూతుల్లో కొన్ని

• రోత పత్రిక సూక్తులు

పోసాని ఏనాడో చేసిన సాధారణ వ్యాఖ్యల ఆధారంగా కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడింది. ఆయన అరెస్ట్ అక్రమం..

- జగన్ పత్రికలో పోసానికి మద్దతుగా వ్యాఖ్యలు

• జగన్ నీతులు



దేవుడు అంతా చూస్తున్నాడు. ధైర్యంగా ఉండండి. మేం అందరం తోడుగా ఉంటాం. రాష్ట్రంలో నిరంకుశ పాలన ఎక్కువ రోజులు కొనసాగదు..

- పోసాని భార్యకు ఫోన్‌లో జగన్ భరోసా

బూతులు.. నీతులు!

'రెడ్‌బుక్ రాజ్యాంగం'.. జగన్ పదే పదే కలవరిస్తున్న పదం! తాను అధికారంలో ఉన్న ఐదేళ్లూ అన్ని రకాల హక్కులకూ పాతరేసి, నోరెత్తితే అరెస్టులు చేసి, ఫేస్‌బుక్‌లో పోస్టులు ఫార్వర్డ్ చేసినందుకే హింసించి, అర్ధరాత్రి గోడలు దూకి మరీ విపక్ష నేతలను అరెస్టు చేయించి, ఆపరేషన్లు చేయించుకున్న వాళ్లనూ ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు రహదారి మార్గంలో తీసుకెళ్లి నరకం చూపించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అంటూ వాపోతున్నారు. తన ఐదేళ్ల హయాంలో చేసిన అరాచకాలన్నీ మరిచిపోయి... 'మళ్లీ వస్తాం. అన్నీ నోట్ చేసుకుంటున్నాం. బట్టలూడదీసి నిలబెడతాం' అని కూడా హెచ్చరిస్తున్నారు. అంటే... అధికారంలో ఉంటే అరాచకం రాజ్యమేలాలి! విపక్షంలో ఉంటే మాత్రం ధర్మం నాలుగు పాదాలా నడవాలి! ఇదీ... జగనిజం!

సీఎంగా ఉండగా రాజ్యాంగానికి తూట్లు

అధికారం పోగానే 'రెడ్‌బుక్' అంటూ గగ్గోలు

జగన్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా వేధింపుల పర్వం

కోడెల బలవన్మరణానికి కారణమెవరు?

సోషల్ మీడియా పోస్టులపై దేశద్రోహం కేసులు

అర్ధరాత్రుళ్లు గోడలు, గేట్లు దూకి అరెస్టులు

వృద్ధులు, రోగులనూ బలవంతంగా లాక్కెళ్లడమే!

ఇప్పుడు పోసాని అరెస్టుపై వాపోతున్న వైసీపీ

కీలక కేసుల్లో ఇప్పటికీ చర్యలు లేవు

ముందస్తు బెయిళ్లతో బయటే నిందితులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి పాతరోజుల్లోకి వెళదాం! 2019లో అధికారంలోకి వచ్చీ రాగానే జగన్ ఏం చేశారో గుర్తుతెచ్చుకుందాం! పదవిలో కూర్చున్నది మొదలు... కక్ష సాధింపులు! తొలి ఆరు నెలల్లోనే... ఆత్మహత్య చేసుకునే స్థాయిలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు వేధింపులు! అధికారం అంతానికి వచ్చేసరికి... చంద్రబాబు అరెస్టు! మధ్యలో...

మిగతా 12వ పేజీలో...



బూతుల్ని సుద్దులంటారా?

పోసానికి జగన్ మద్దతు.. ఆయన సతీమణికి ఫోన్

నాడు బాబు, పవన్, లోకేశ్‌పై పోసాని దారుణ దూషణలు

మహిళలపై హేయ వ్యాఖ్యలు.. ఖండించని జగన్

కానుకగా ఎఫ్‌డీసీ పదవి.. అరెస్ట్ చేయగానే గగ్గోలు

12

నన్ను అరెస్టు చేశారు రాజా!

స్టేషన్ ముందు పోసాని సినిమా డైలాగ్

ఎవరు చెబితే వాళ్లను తిట్టారు?

స్క్రిప్ట్ ఎవరిది? ఎవరెవరి హస్తం ఉంది?

పోసానిపై విచారణ బృందం ప్రశ్నల వర్షం

అప్పటి వీడియోలను చూపించగా 'లవ్ యూ రాజా' అంటూ వ్యాఖ్యలు

రైల్వేకోడూరు కోర్టులో హాజరు

'కిడ్నాప్'కు వాడిన కార్లు ఎక్కడివి?

అరెస్టు తర్వాత మీ ఫోన్లు ఎక్కడ?

వంశీపై పోలీసుల ప్రశ్నలవర్షం

కొన్నింటికే జవాబు ఇచ్చిన వంశీ

తిరిగి కస్టడీకి కోరాలని నిర్ణయం



5న విచారణకు రండి



మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు బెజవాడ పోలీసుల నోటీసులు

పోక్సో కేసులో బాధితుల పేర్ల వెల్లడిపై గత ఏడాది ఫిర్యాదు

పోటెత్తిన టీచర్లు

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో 92.4% ఓటింగ్

కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో 69.57%, 69.50% పోలింగ్



ఉండవల్లిలో ఓటు వేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. రాత్రి కడపటి వార్తలు అందే సమయానికి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 69.57 శాతం, ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 69.50 శాతం, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 92.4 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. తుది వివరాలు వస్తే పోలింగ్ శాతం ఒకింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. సీఎం చంద్రబాబు, లోకేశ్, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోలింగ్ మొదటి నుంచీ రికార్డు స్థాయిలోనే జరిగింది. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో మధ్యాహ్నం వరకూ పోలింగ్ మందకొడిగా సాగినా... తరువాత పుంజుకుంది.

స్వల్ప ఘటనలు... బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో టీడీపీ, పీడీఎఫ్ శ్రేణులు ఘర్షణకు దిగాయి. పోలింగ్ సమయం ముగిశాక ఏజెంట్లు లోనికి వెళ్లడంపై ఇరువర్గాలు వాదులాటకు దిగాయి. ఇదే సమయంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు, పీడీఎఫ్ మద్దతు దారుడిపై

మిగతా 11వ పేజీలో...



కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు మరింత కోత?

ప్రస్తుతం ఉన్న 41 శాతం వాటాను 40 శాతానికి తగ్గించే యోచన

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు

అక్టోబరులో ఆర్థికసంఘం ప్రతిపాదన!

4.8% ఆర్థికలోటు అంచనాలే కారణం

ఆచరణలోకి వస్తే.. కేంద్రానికి ఏటా రూ.35 వేల కోట్ల మిగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్రం, బీజేపీయేతర రాష్ట్రాల మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో.. మోదీ సర్కారు మరో కోతకు సిద్ధమైందా? కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 41% నుంచి 40శాతానికి తగ్గించి, 1% మేర కోత విధించనుందా? ఆర్థిక సంఘం ఆ మేరకు సిఫారసు చేస్తే.. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందా? ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం దశలవారీగా చర్యలు తీసుకోనుందా? ఈ ప్రశ్నలకు ఔనని చెబుతూ రాయిటర్స్ వార్తాసంస్థ ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. మూడు వేర్వేరు విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ.. కేంద్రం తీసుకోబోయే చర్యలను గురించి వివరించింది. తాజా బడ్జెట్ ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు జీడీపీలో 4.8శాతంగా ఉంది. రాష్ట్రాల ద్రవ్యలోటు కేంద్ర జీడీపీలో 3.2శాతంగా ఉంది. ఈ లోటును తగ్గించేందుకు పన్నువాటాలో

మిగతా 2వ పేజీలో...

'ఆరోగ్యం' బాగోలేదు

ప్రభుత్వ ఐవీఆర్‌ఎస్ సర్వేలో ఆరోగ్య శాఖపై అసంతృప్తి

ఆరు అంశాల్లో అభిప్రాయ సేకరణ

అన్నింటిలోనూ అత్తెసరు మార్కులే

కొనసాగుతున్న అవినీతి.. అందుబాటులో లేని వైద్యులు

రోగులు, సహాయకుల పట్ల దురుసు ప్రవర్తన

డాక్టర్ రాసిన మందులు ఇవ్వడం లేదని రోగుల ఫిర్యాదు

3



100 రోజులు.. 1,596 మి.యూనిట్లు

రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి

అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు

6

ఇచ్చిపుచ్చుకోండి!



సాగర్‌లో మిగిలిన నీటిని పొదుపుగా వాడుకోండి

2 రాష్ట్రాలకు కృష్ణా బోర్డు చైర్మన్ సూచన

వినియోగంపై 15 రోజులకోసారి ఈఎన్‌సీ స్థాయిలో సమీక్ష

హైదరాబాద్ జలసౌధలో కేఆర్ఎంబీ భేటీ

ఏపీ ఎక్కువ నీటిని వాడుకుందన్న తెలంగాణ

ఖండించిన ఏపీ.. గతం గతః అని సర్దిచెప్పిన అతుల్ జైన్

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో మిగిలి ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సర్దుకుంటూ వాడుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. గురువారం హైదరాబాద్ జలసౌధలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో సాగర్, హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను సాగు, తాగునీటి అవసరాలకు వాడుకోవడంపై కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్, జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు.. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆ రాష్ట్ర ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ రమేశ్ బాబు, ఎస్ఈ విజయ్‌కుమార్ హాజరయ్యారు. 'నీటి వాడకంపై ఈఎన్‌సీ స్థాయిలో 15 రోజులకోసారి సమీక్షించుకోండి. కార్యదర్శుల స్థాయిలో నెల రోజులకోసారి చర్చించుకోవాలి. ఆ తర్వాత

మిగతా 6వ పేజీలో...

'ఆక్యుపేషన్' పొందాకే భవనాల్లోకి..

నిర్మాణం పూర్తయ్యే వరకు బిల్డింగ్ ప్లాన్ ప్రదర్శించాలి

నిర్మాణంలో తేడాలున్నా ఓసీ ఇస్తే చర్యలు

అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

3

నాన్-లోకల్ కోటా ఎత్తివేత

తెలంగాణలో ఇకపై ఉన్నత విద్య సీట్లన్నీ స్థానికులకే

15% నాన్-లోకల్ నాలుగు కేటగిరీలకు పంపిణీ

ప్రభుత్వోద్యోగుల పిల్లలకూ వర్తింపు

ఏపీ పునర్విభజన చట్టం

పదేళ్ల గడువు పూర్తయిన నేపథ్యంలో టీ-జీవో

11

ఉదయాన్నే బార్లు బార్లా!



కొన్నిచోట్ల 24 గంటలూ అమ్మకాలు

విచ్చలవిడిగా పనివేళల ఉల్లంఘన

పట్టించుకోని టాస్క్‌ఫోర్స్ విభాగం

మద్యం షాపులకు, ప్రభుత్వానికి నష్టం

12

స్టీరింగ్, సిగ్నల్ ఒక్కరికే

ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకే పీటీడీ కమిషనర్ పోస్టు

ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం



పాలనా వ్యవహారాల్లో ఇబ్బందులు తొలగించేందుకు నిర్ణయం

11

చంద్రుడిపైకి డ్రోన్

నీటి జాడల అన్వేషణ కోసం అమెరికా కంపెనీ ప్రయోగం




» జాబిల్లి దక్షిణ ధ్రువం మీద మార్చి 6న దిగనున్న ల్యాండర్ అథీనా

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: చందమామ మీద నీళ్లున్నాయా?.. ఈ ప్రశ్న దశాబ్దాలుగా అంతరిక్ష శాస్త్రవేత్తలకు సవాల్ విసురుతూనే ఉంది. దీనికి సమాధానం కనుక్కోవటానికి అనేక ప్రయత్నాలు, పరిశోధనలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. దీంట్లో భాగంగానే, తాజాగా ఓ అమెరికా కంపెనీ డ్రోన్‌తో కూడిన ల్యాండర్‌ను చంద్రుడి మీదికి పంపించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో సూర్యరశ్మి పొడ లేకుండా, ఎల్లప్పుడూ నీడలోనే ఉండే ప్రాంతంలో దిగే ఈ ల్యాండర్.. అక్కడ నీటి ఆనవాళ్లపై సమాచారాన్ని అందించనుంది. ఇన్‌ట్యూటివ్ మెషిన్స్ అనే కంపెనీ రూపొందించిన ఈ ల్యూనార్ ల్యాండర్ పేరు అథీనా. నాసాకు చెందిన కెనడీ స్పేస్ సెంటర్ నుంచి దీనిని స్పేస్ ఎక్స్ సంస్థ బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. మార్చి 6వ తేదీన చంద్రుడిపై అథీనా దిగనుంది.

అక్కడ చీకటి లోయలు అనేకం

అథీనా పొడవు 15 అడుగులు. దీంట్లో మూడు అడుగుల పొడవున్న డ్రోన్ ఉంది. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌కు ఆద్యుడిగా భావించే గ్రేస్ హోపర్ పేరు మీద ఈ డ్రోన్‌కు గ్రేస్ అని పేరు పెట్టారు. చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి 160కి.మీ.ల దూరంలో ఉండే ప్రాంతంలో అథీనా దిగాలనేది నిర్దేశిత లక్ష్యం. ఆ ప్రాంతానికి కేవలం 400 మీటర్ల దూరంలో శాశ్వతంగా నీడలో ఉండే 65 అడుగుల లోతైన భారీ లోయ ఉంది. చంద్రుడి ఉత్తర, దక్షిణధ్రువాల్లో సూర్యరశ్మి సోకని ఇటువంటి భారీ లోయలు అనేకం ఉన్నాయి. ఈ లోయల నిండా నీరు గడ్డకట్టి మంచు రూపంలో ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అదే నిజమైతే.. ఆ మంచు నుంచి.. భవిష్యత్తులో చంద్రుడి మీదకు వెళ్లే వ్యోమగాములు తాగటానికి అవసరమైన నీటి ని, పీల్చుకోవటానికి గాలిని, ఇంకా వీలైతే రాకెట్ల ఇంధనాన్ని కూడా తయారు చేయాలన్నది శాస్త్రవేత్తల స్వప్నం. అంతరిక్ష ప్రయోగాలనే మలుపు తిప్పే పరిశోధన ఇది. దీనికోసం అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా ఇన్‌ట్యూటివ్ మెషిన్స్ చేపట్టిన ప్రయోగం కోసం ఆ కంపెనీకి నాసా 6.2 కోట్ల డాలర్లను చెల్లించింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే చంద్రుడి దక్షిణ ధ్రువం మీద దిగే అథీనా నుంచి గ్రేస్ విడివడి అక్కడి చీకటి లోయపై పరిశోధనలు జరుపుతుంది. అత్యంత శక్తిమంతమైన కెమెరాలు, లేజర్ల సాయంతో గ్రేస్ అక్కడి పరిస్థితులను రికార్డు చేస్తుంది. హంగరీ, జర్మనీ అంతరిక్ష పరిశోధన సంస్థలకు చెందిన కొన్ని పరికరాలనూ గ్రేస్‌కు అనుసంధానించారు. సదరు పరికరాలు లోయలో తవ్వకాలు జరిపి మంచు ఆనవాళ్ల కోసం అన్వేషిస్తాయి. చంద్రుడి చీకటి లోయల్లోకి వెళ్లి మరీ పరిశోధనలు జరపటం ఇదే తొలిసారి.

లోకం తీరు



ఉద్యోగాలు తీసేశారు.. జోక్యం చేసుకోండి

» ప్రధాని కార్యాలయానికి ఇన్ఫోసిస్ ట్రైనీల వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: తమకు న్యాయం చేయాలంటూ ఇన్ఫోసిస్ మైసూరు క్యాంపస్‌లో ఉద్యోగాలు కోల్పోయిన ట్రైనీలు ప్రధాని కార్యాలయాన్ని (పీఎంవో) ఆశ్రయించారు. బలవంతంగా తొలిగించిన తమ ఉద్యోగాలు తిరిగి ఇప్పించేందుకు జోక్యం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సామూహిక తొలగింపులు లేకుండా చూడాలని 100 మందికిపైగా ట్రైనీలు ఇటీవల పీఎంవోను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ కర్ణాటక లేబర్ కమిషనర్‌కు 25వ తేదీన రెండోసారి నోటీసు పంపింది. ఇన్ఫోసిస్ నుంచి సామూహికంగా ఉద్యోగుల తొలగింపుపై విచారణ చేయాలని ఆ నోటీసులో కోరింది. కార్మిక చట్టాల ప్రకారం ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఐటీ ఉద్యోగుల సంక్షేమాన్ని చూసే నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్‌కు కూడా ఆ నోటీసులు పంపింది. ఫిబ్రవరి7న మైసూరు క్యాంపస్ నుంచి సుమారు 700మంది ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. అంతర్గత మదింపులో వారు విఫలమవడంతోనే తొలగించామని ఆ సంస్థ సమర్థించుకుంది.

గూగుల్ క్లౌడ్ విభాగంలో ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. తాజాగా క్లౌడ్ విభాగంలో కొందరు ఉద్యోగులను తొలగించారని బ్లూమ్‌బర్గ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. జనవరి నుంచి ఇప్పటి వరకు ఎందరిని తొలగించారనే విషయంపై స్పష్టమైన సమాచారం బయటకు రాలేదు. అయితే ఇలా తరచూ లేఆఫ్‌లు, అస్థిరమైన నిర్ణయాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ అమెరికా, కెనడాకు చెందిన గూగుల్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. తొలగింపు సమయంలో మంచి ప్యాకేజీ కోసం కొందరు డిమాండ్ చేశారు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం కీలక రంగాల్లో పెట్టుబడులు పెంచే క్రమంలో కొన్ని మార్పులు చేస్తున్నామని ఈ లేఆఫ్‌ను సంస్థ అధికారి ఒకరు సమర్థించుకున్నారు. కాగా, ఓపెన్‌ఏఐతో పోటీ మొదలైన తర్వాత గతేడాది డిసెంబరులో గూగుల్ మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో 10 శాతం కోతపెట్టింది. వ్యయాల తగ్గింపులో భాగంగా 2023 జనవరిలో 12 వేల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయారు.

నకిలీ ఓటర్లతో ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపు

» బీజేపీపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ

కోల్‌కతా, ఫిబ్రవరి27: బీజేపీతోపాటు ఎన్నికల కమిషన్ (ఈసీ)పై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసీ మద్దతుతో ఇతర రాష్ట్రాలకు చెందిన నకిలీ ఓటర్లను ఎన్నికల జాబితాలో చేర్చినట్టు ఆమె పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి బీజేపీ ఈ వ్యూహాన్ని అనుసరించినట్టు చెప్పారు. గురువారంనాడిక్కడ నేతాజీ ఇండోర్ స్టేడియంలో టీఎంసీ రాష్ట్ర సదస్సులో పాల్గొన్న సందర్భంగా మమత మాట్లాడారు. హరియాణా, గుజరాత్ నుంచి నకిలీ ఓటర్లను చేర్చడం ద్వారా ఢిల్లీ, మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించిందన్నారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే చేయాలని వారు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ నియామకం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాను సరిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోకుంటే ఎన్నికల కమిషన్ కార్యాలయం ముందు తమ పార్టీ ధర్నా నిర్వహిస్తుందని మమత హెచ్చరించారు. కాగా 2026లో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకుగాను 215కు పైగా సీట్లను సాధించాలని మమత లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

గుంతల హైవేపై టోల్ వసూలు సరికాదు

» చార్జీలో 20 శాతమే వసూలు చేయాలి

» జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: జాతీయ రహదారుల్లో(ఎన్‌హెచ్) టోల్ వసూలపై జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు విస్తృత మార్పునకు, ప్రజా ప్రయోజనాలకు కేంద్రంగా నిలుస్తుంది. ఎన్‌హెచ్ 44లో రహదారి దారుణంగా దెబ్బతిన్న, నిర్మాణంలో ఉన్న ప్రాంతంలో టోల్ చార్జీని తగ్గించుకోవాలని జాతీయ రహదారుల సంస్థను ధర్మాసనం ఆదేశించింది. ఎన్‌హెచ్ 44లో రహదారి దుస్థితిని ప్రస్తావించి, టోల్ చార్జీలను మినహాయించాలని కోరుతూ సుగంధ సాహ్నీ అనే మహిళ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తాషి రబ్సాన్, జస్టిస్ ఎంఏ చౌదరితో కూడిన బెంచ్ ఈ పిల్ విచారణ సందర్భంగా ఎన్‌హెచ్ సంస్థ రహదారి అధ్వాన్నంగా ఉందని అంగీకరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. అనంతరం ధర్మాసనం తీర్పు ఇస్తూ.. 'రహదారి దారుణంగా ఉన్నప్పుడు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారినప్పుడు వారి నుంచి రుసుము వసూలు చేయడం అన్యాయం. కనుక పఠాన్‌కోట్-ఉధంపూర్ మధ్య లఖన్‌పూర్, బన్ టోల్ ప్లాజాల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న దాంట్లో 20శాతమే వసూలు చేయాలి. ఈ ఆదేశాలు రోడ్డు బాగయ్యే వరకూ వర్తిస్తాయి' అని పేర్కొంది.

భారత్‌లో ఎక్కడా ఇల్లు, భూముల్లేవు

» కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా

బెంగళూరు/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యలహంక ప్రాంతంలోని అటవీ భూములను కాంట్రాక్టు ముగిసినా అప్పగించలేదని తనపై లోకాయుక్తకు అందిన ఫిర్యాదుపై కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా ఎక్స్‌లో స్పందించారు. దేశంలో ఎక్కడా తనకు సొంత ఇల్లు, భూములు, షేర్లు లేవన్నారు. బెంగళూరు పరిధిలో 12.35 ఎకరాల భూమి తన పేరిట ఉందని పత్రికల్లో వచ్చిన కథనాలకు వివరణ ఇవ్వదలచానని పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వానికి అనుబంధంగా, సలహాదారుడిగా తాను పనిచేశానని, అయినా ఎలాంటి జీతం తీసుకోలేదని చెప్పారు. కాగా ఐఐటీ రాంచీ విద్యార్థులతో వర్చువల్‌గా ప్రసంగిస్తుండగా.. ఎవరో హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు ప్రదర్శించారంటూ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలను కేంద్ర విద్యాశాఖ కొట్టిపారేసింది.

గేట్ 2025 ప్రాథమిక 'కీ' విడుదల

» మార్చి 19న తుది ఫలితాల వెల్లడి

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్ 2025) పరీక్ష ప్రాథమిక 'కీ'ని ఐఐటీ రూర్కీ గురువారం విడుదల చేసింది. దీనిని https://gate2025.iitr.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. గేట్‌లోని 30 టెస్ట్ పేపర్ల కోసం ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో ఈ పరీక్ష జరిగింది. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను ఫిబ్రవరి 27 నుంచి మార్చి1 వరకు తెలియజేయవచ్చని ఐఐటీ రూర్కీ పేర్కొంది. అభ్యంతరం తెలిపిన ప్రతి ప్రశ్నకు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తుది ఫలితాలను మార్చి 19న వెల్లడిస్తారు. విద్యార్థులు తమ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ, మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. స్కోర్ కార్డ్‌లను మార్చి 28 నుంచి మే 31 వరకు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇగ్నో బీఎడ్, బీఎస్సీ నర్సింగ్ రిజిస్ట్రేషన్లకు నేడే ఆఖరు

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్), బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(నర్సింగ్) అడ్మిషన్ల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) రిజిస్ట్రేషన్ల గడువు శుక్రవారంతో ముగియనుంది. ఆసక్తి గల అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ignou.ac.inలో రిజిస్టర్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన ఎంట్రెన్స్ పరీక్ష మార్చి 16న నిర్వహించనున్నారు.

అసౌకర్యం కలిగితే క్షమించండి

» ఐక్యతా మహాయజ్ఞం.. మహా కుంభమేళా

» మేనేజ్‌మెంట్, ప్లానింగ్ నిపుణులకు ఇదో అధ్యయనాంశం

» ప్రపంచంలో దీనికి సమానమైన ఉదాహరణ మరోటి లేదు: మోదీ



కుంభమేళా ముగియడంతో పరిసరాల్లో చీపురుతో శుభ్రం చేస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 45రోజుల పాటు సాగిన మహా కుంభమేళా ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో కుంభమేళాను 'ఐక్యతా మహాయజ్ఞం'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. శతాబ్దాల అణచివేతకు ముగింపు, కొత్త శకం ఆవిర్భావానికి ఇది గుర్తు అని పేర్కొన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులు అసౌకర్యానికి గురైతే క్షమించాలని కోరారు. కుంభమేళా గురించి ప్రధాని గురువారం తన బ్లాగులో రాశారు. 'మహా కుంభమేళా ముగిసింది. ఐక్యత మహా యజ్ఞం పూర్తయింది. ఒక జాతి మేల్కొన్నప్పుడు, వందల సంవత్సరాల నాటి బానిస మనస్తత్వ సంకెళ్లను విచ్ఛిన్నం చేసి, కొత్త చైతన్యంతో శ్వాస తీసుకోవడం ప్రారంభించినప్పుడు.. జనవరి 13నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఐక్యత మహాకుంభ్‌లో మనం చూసిన దృశ్యమే కనిపిస్తుంది' అని మోదీ పేర్కొన్నారు. 'ఈ కుంభమేళా ఐక్యతకు ప్రతీక. గత 45 రోజులుగా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రతిరోజూ సంగమ తీరానికి తరలి వచ్చారు. పవిత్ర త్రివేణీ సంగమంలో స్నానం చేయాలన్న భావోద్వేగాల ప్రభంజనం భక్తుల్లో పెరుగుతూనే ఉంది. గంగా, యమున, సరస్వతి నదుల సంగమం ప్రతి భక్తుడిలోనూ ఉత్సాహాన్ని, శక్తిని నింపుతోంది. కుంభమేళా నేటి ఆధునిక యుగంలో ప్రణాళికలు, విధానాల రూపకల్పన నిపుణులతో పాటు మేనేజ్‌మెంట్ నిపుణులకు ఒక కొత్త అధ్యయన అంశంగా మారింది. ఇంత గొప్ప కార్యక్రమాన్ని మొత్తం ప్రపంచంలో దేనితోనూ పోల్చలేం. దీనికి సమానమైన ఉదాహరణ మరొకటి లేదు' అని మోదీ రాసుకొచ్చారు. 'సంగమ తీరానికి ఇన్ని కోట్లమంది ప్రజలు ఎలా వచ్చారా అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ కోట్లాది మందికి ఎవరూ అధికారికంగా ఆహ్వానాలు పంపలేదు. అయినా కుంభమేళాకు వచ్చిన ప్రజలు పవిత్ర సంగమంలో పుణ్య స్నానాలు చేశారు, అమెరికా జనాభా కంటే దాదాపు రెట్టింపు మంది పుణ్య స్నానాలు ఆచరించారు. భవిష్యత్తులో దీనినుంచి ప్రేరణ పొంది ఇదే విశ్వాసం, ఐక్యతతో ముందుకు సాగాలి' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహా కుంభమేళాను విజయవంతం చేసినందుకు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని, ప్రయాగ్‌రాజ్ ప్రజలను ప్రధాని ప్రశంసించారు.

ప్రపంచ స్థాయి కార్యక్రమం: సీఎం యోగి

మహా కుంభమేళాను విజయవంతంగా నిర్వహించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. ఇదో ప్రపంచ స్థాయి కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ప్రధాని దార్శనికత, దూరదృష్టి తమకు సహాయపడ్డాయని తెలిపారు.

కావాలంటే ప్రధాని మోదీ డిగ్రీని కోర్టుకు చూపిస్తాం

» అభ్యంతరాలు ఏమీ లేవు.. ఢిల్లీ హైకోర్టులో సొలిసిటర్ జనరల్ వాదనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చదివిన డిగ్రీకి సంబంధించి గురువారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి 1978లో ఆయన బి.ఎ. పాసయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను కోర్టుకు చూపించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ఆ సర్టిఫికెట్‌ను ఎవరైనా చూడవచ్చంటూ కేంద్ర సమాచార కమిషన్ (సి.ఈ.సి) జారీ చేసిన ఆదేశాలను మాత్రం తిరస్కరించాలని కోరారు. మోదీతో సహా 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పాసయిన బి.ఎ. విద్యార్థుల డిగ్రీల ఫలితాలను చూడవచ్చని 2016లో అప్పటి కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీఐ కార్యకర్త నీరజ్ కుమార్ దాఖలు చేసిన దరఖాస్తుపై ఈ ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలు అమలు కాకుండా 2017 జనవరి 24న ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. దీనిపై మళ్లీ న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా చేశారు.

'సర్పంచ్' భర్తలకు దండన!

» భార్యల స్థానంలో పెత్తనం చేస్తే శిక్షలు, జరిమానాలు!

» కేంద్ర పంచాయతీరాజ్ సలహా కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: చాలా గ్రామాల్లో మహిళా సాధికారత వట్టిమాటగానే ఉంది. పలువురు మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికైనా వారు నామమాత్రమే. వారిని అడ్డుపెట్టుకుని వారి భర్తలు, ఇతర కుటుంబ సభ్యులు పెత్తనం సాగిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలని.. ప్రచ్ఛన్న నాయకత్వం చలాయిస్తున్న భర్తలను శిక్షించాలని, వారికి జరిమానాలు విధించాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నియమించిన సలహా కమిటీ సిఫారసు చేసింది. 'పంచాయతీరాజ్ వ్యవస్థ, సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం, పాత్రల పరివర్తన.. ప్రచ్ఛన్న నాయకత్వ నిర్మూలన' అన్న శీర్షికన ఈ మేరకు పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్‌కు తాజాగా నివేదిక సమర్పించింది. భార్యల బదులు పెత్తనం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్లు పెట్టాలని.. రహస్యంగా అందే కంప్లయింట్లపై విచారణకు మహిళలతో వాచ్ డాగ్ కమిటీలను వేయాలని సూచించింది. 2023 జూలైలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ శాఖ ఈ సలహా కమిటీని ఏర్పాటు చేసింది. 14 రాష్ట్రాలతో నిర్వహించిన నాలుగు విస్తృత ప్రాంతీయ వర్క్‌షాపుల్లో వ్యక్తమైన అభిప్రాయాలతో కమిటీ నివేదిక రూపొందించింది. ఈ అంశంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని.. సంప్రదింపులు, అమలు కోసం రాష్ట్రాలతో దానిని పంచుకుంటామని వివేక్ భరద్వాజ్ తెలిపారు. భార్యల స్థానంలో ప్రచ్ఛన్న నాయకత్వం నెరిపేవారిపై చట్టబద్ధంగా శిక్షలు, జరిమానాలు విధించే అంశంపై రాష్ట్రాల కార్యదర్శులతో ఓ కమిటీని నియమించాలని యోచిస్తున్నట్లు చెప్పారు.

ఐదేళ్ల బాలిక తలను గోడకేసి బాది.. అత్యాచారం

» మధ్యప్రదేశ్‌లోని శివపురిలో 17 ఏళ్ల బాలుడి అఘాయిత్యం

భోపాల్, ఫిబ్రవరి 27: మధ్యప్రదేశ్ గ్వాలియర్ సమీపంలోని శివపురిలో ఐదేళ్ల బాలిక దారుణ అత్యాచారానికి గురైంది. పొరుగింట్లోని 17 ఏళ్ల బాలుడు, పాపను టెర్రస్ పైకి తీసుకెళ్లి.. ఆమె తలను పలుమార్లు గోడకేసి కొట్టి.. అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రెండుగంటల పాటు చిన్నారి కోసం వెతికిన తల్లిదండ్రులు.. పంటిగాట్లు, గోర్లతో రక్కిన గీతలు సహా ఒంటినిండా తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అచేతనావస్థలో పడివున్న బాధితురాలిని గుర్తించారు. ఐదురోజుల క్రితం ఈ ఘటన జరిగింది. బాధిత బాలికను గ్వాలియర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి మర్మాంగం వద్ద 28 కుట్లు వేశారు. కడుపులో పెద్దపేగు వద్ద తీవ్రగాయం కావడంతో కోలోస్టోమి శస్త్రచికిత్స చేశారు. అయినా బాలిక పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఆమె స్పృహలోనే ఉన్నప్పటికీ మాట్లాడలేకపోతోందని చెప్పారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనకు పాల్పడినప్పుడు నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడికి మరణశిక్ష విధించాలని.. రోడ్డుమీద నిల్చోబెట్టి తుపాకీతో కాల్చేయాలని బాలిక తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.200 తేడా ఉందని 93 కోట్ల ఖాతాను నిలిపేస్తారా?

బ్యాంకు ఖాతాల స్తంభనపై జాగ్రత్తలు అవసరం

దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ హైకోర్టు సూచనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సైబర్ నేరాలపై దర్యాప్తులో భాగంగా నిందితులు, అనుమానితుల బ్యాంకు ఖాతాలను సంపూర్ణంగా స్తంభింపజేసే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ హైకోర్టు సూచించింది. హేతుబద్ధత లేకుండా ఖాతాలను నిలిపివేస్తే జీవితాలే తారుమారవుతాయని పేర్కొంది. ఖాతాల్లో కేవలం రూ.200 మేర తేడా ఉందన్న కారణంతో రూ.93 కోట్ల ఖాతాను పూర్తిగా స్తంభింపజేయడాన్ని తప్పుపడు తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుపై న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ జైన్ ఆదేశాలు ఇస్తూ "తగిన కారణాలు చూపకుండా, బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడమే పరిష్కారమార్గమని అనుకుంటే.. అది సంబంధిత ఖాతాదారుల ఆర్థిక స్థితిగతుల్లో ఉపద్రవం సృష్టిస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఖాతాను మొత్తంగా స్తంభింపజేసే బదులు వివాదంలో ఉన్న మొత్తాన్ని ధరావతు రూపంలో పక్కనపెడితే ఖాతాదార్లకు ఇబ్బంది ఉండదని అభిప్రాయపడ్డారు. కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులకు కూడా సొమ్ము భద్రంగా ఉందన్న నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి తరహాలో పలు కేసులు వస్తున్నందున బ్యాంకు ఖాతాల స్తంభనపై ఏకరూప విధానాన్ని రూపొందించాలని కేంద్ర హోం శాఖను ఆదేశించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఇతర భాగస్వాములతో చర్చలు జరిపి మార్గదర్శకాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను రూపొందించాలని సూచించారు. ప్రస్తుత కేసులో పిటిషనర్ ఎలాంటి సైబర్ కేసులో నిందితుడుగానీ, అనుమానితుడుగానీ కాదని, కానీ మొత్తం ఖాతాను స్తంభింపజేశారని తెలిపారు. నేరంతో ఎలాంటి సంబంధం లేకపోయినా, అనుకోకుండా లబ్ధి పొంది ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈయూపై 25% సుంకం విధిస్తాం

అమెరికాను దెబ్బ తీయడానికే కూటమి.. ఉక్రెయిన్ నాటో సభ్యత్వాన్ని మరచిపోవాలి

మూడేళ్ల యుద్ధానికి అసలు కారణం అదే

మంత్రివర్గ సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 27: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి దిగుమతుల మీద 25 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. ప్రపంచ వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికే యూరోపియన్ యూనియన్ కూటమి ఏర్పడిందంటూ మండిపడ్డారు. బుధవారం ఆయన తన మంత్రివర్గ సభ్యులతో తొలిసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, కెనడా, మెక్సికోల మీద విధించిన 25 శాతం సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈయూ దేశాలు అమెరికాను తేలిగ్గా తీసుకుంటున్నాయన్నారు. అవి అమెరికా వాహనాలను, వ్యవసాయ ఉత్పత్తులను ఏదో ఒక సాకుతో తీసుకోవడం లేదని చెప్పారు. అమెరికా మాత్రం ఎలాంటి షరతులు లేకుండా యూరప్ ఉత్పత్తులను స్వీకరిస్తోందని అన్నారు. అమెరికా మిత్రులు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాల వల్ల అమెరికా భారీ వాణిజ్య లోటును ఎదుర్కొంటోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి అమెరికాకు తయారీ రంగంలో 14 లక్షల కోట్ల రూపాయల లోటు ఉంటే సేవారంగంలో యూరోపియన్ యూనియన్ 9.5 లక్షల కోట్ల లోటును అమెరికా నుంచి ఎదుర్కొంటోంది. ఈయూ ప్రధానంగా రసాయనాలు, ఔషధాలను అమెరికాకు సరఫరా చేస్తుంటే, అమెరికా ప్రధానంగా సాఫ్ట్‌వేర్‌ను, ఇతర బిజినెస్ సొల్యూషన్లను యూరప్ దేశాలకు సరఫరా చేస్తోంది. ట్రంప్ ప్రకటనతో ఈయూ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. ప్రధానంగా కార్ల షేర్లు పడిపోయాయి.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం తనతో సమావేశం కానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. నాటో సభ్యత్వం విషయంలో ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాలని ట్రంప్ స్పష్టం చేశారు. అసలు ఉక్రెయిన్ నాటో సభ్యత్వం ఆకాంక్షల వల్లే సమస్య ఇక్కడిదాకా వచ్చిందని వ్యాఖ్యానించారు. త్వరలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం జరుగుతుందని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే పరిష్కారాన్ని ఆ సమావేశంలో కనుగొంటామన్నారు. చైనా బలప్రయోగంతో తైవాన్‌ను విలీనం చేసుకుంటే అమెరికా అనుమతిస్తుందా? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ట్రంప్ నిరాకరించారు. చైనాతో సత్సంబంధాలను కోరుకుంటున్నట్లు చెప్పారు.

గోల్డ్ కార్డుతో అమెరికా సంస్థల్లో భారతీయులకు ఉద్యోగాలు

అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీ పొందిన భారత్ సహా ఇతర విదేశీ విద్యార్థులకు యూఎస్‌ఏలోని కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేందుకు కూడా గోల్డ్‌కార్డు ఉపయోగపడుతుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. రూ.43.5 కోట్లు చెల్లించి గోల్డ్ కార్డు కొనుగోలు చేసిన వారికి అమెరికా శాశ్వత పౌరసత్వం ఇస్తామని ట్రంప్ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతమున్న ఈబీ-5 వీసా స్థానంలో గోల్డ్ కార్డును తీసుకొస్తామని తెలిపారు. అయితే, ఈబీ-5లో ఉన్న ఉద్యోగాల కల్పన అవకాశాలు గోల్డ్ కార్డులో ఎలా ఉంటాయనే దానిని వివరించలేదు. ఈ అంశంపై గురువారం ఆయన స్పష్టత ఇచ్చారు. "భారత్, జపాన్, చైనా తదితర దేశాలకు చెందిన వారు హార్వర్డ్, వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రముఖ సంస్థల నుంచి డిగ్రీలు తీసుకుంటున్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందుతున్నారు. కానీ, ప్రస్తుతమున్న నిబంధనల వల్ల వారు అమెరికాలో ఎంతకాలం ఉంటారనే విషయంలో అనిశ్చితి నెలకొని అవకాశాలు కోల్పోయి స్వదేశాలకు వెళ్లిపోతున్నారు. ఎంతో మేధస్సు కలిగిన వారంతా తమ దేశాల్లో వ్యాపారాలు ప్రారంభించి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. అయితే, అలాంటి విద్యార్థులు తమ వద్ద పని చేయాలని అనుకునే కంపెనీలు గోల్డ్ కార్డు కొనుగోలు చేసి వారికి ఉద్యోగాలు ఇవ్వవచ్చు" అని ట్రంప్ పేర్కొన్నారు. రెండు వారాల్లో గోల్డ్ కార్డు విక్రయాలను ప్రారంభిస్తామని ట్రంప్ ఇదివరకే ప్రకటించారు.

కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు మరింత కోత?

(మొదటి పేజీ తరువాయి)

కోతకు కేంద్రం సిద్ధమైనట్లు రాయిటర్స్ కథనం స్పష్టం చేసింది. 1980లో 20శాతంగా ఉన్న రాష్ట్రాల వాటా క్రమంగా 41శాతానికి పెరిగిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందులో 1% కోతకు సన్నాహాలు చేస్తోందని పేర్కొంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వానికి సుమారుగా రూ.35 వేల కోట్లు విగులుతాయని, ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరంలో వసూలయ్యే పన్నులను బట్టి ఇది ఇంకా ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేసింది.

వ్యూహాత్మకంగా ముందుకు

పన్ను వాటా కోతకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు రాయిటర్స్ పేర్కొంది. తొలుత(బహుశా మార్చి నెలాఖరులోగా) మోదీ నేతృత్వంలో జరగనున్న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1% పన్ను వాటా కోతకు ఆమోదం తెలపనున్నట్లు వెల్లడించింది. వెంటనే ఆ ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక సంఘానికి పంపుతుందని వివరించింది. అన్ని వర్గాలతో చర్చించిన తర్వాత.. అక్టోబరు 31లోపు కేంద్ర ఆర్థిక సంఘం 1% పన్ను వాటా కోతను అధికారికంగా సిఫారసు చేస్తుందని తెలిపింది. అయితే.. కేంద్ర క్యాబినెట్ ప్రతిపాదనను ఆర్థిక సంఘం అలాగే సిఫారసు చేయాలని లేదు. పన్ను వాటాను పెంచడం లేదా.. ఇంకా తగ్గించడం ఆర్థిక సంఘం చేతుల్లో ఉంటుంది. నిజానికి జీడీపీలో రాష్ట్రాలు 60% వాటాను అందిస్తున్నాయని, 2017 జూలై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. రాష్ట్రాలకు సొంతంగా పన్నులను పెంచుకునే అవకాశాలు లేకుండా పోయాయయని రాయిటర్స్ వివరించింది. కొవిడ్ సమయంలోనూ కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను విధించిందని, వాటిల్లో ఏమాత్రం వాటా దక్కకుండా.. రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని వివరించింది.

రాష్ట్రాలతో మరింత దూరం?

కేంద్ర ప్రభుత్వ తీరుపై బీజేపీయేతర రాష్ట్రాలు ఇప్పటికే గుర్రుగా ఉన్నాయి. 1% పన్ను కోత జరిగితే.. కేంద్రం-రాష్ట్రాల మధ్య దూరం మరింత పెరిగే ప్రమాదముందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే.. కేంద్ర ఆర్థిక సంఘం ప్రగతిశీలతను సాధించడమే శిక్షగా తమకు అన్యాయం చేస్తూ.. జనాభా పేరుతో ఉత్తరాదికి నిధులను తరలిస్తోందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హిందీ భాష విషయంలో తమిళనాడులోని స్టాలిన్ సర్కారు.. పన్నుల వాటా, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారంటూ పశ్చిమబెంగాల్ సహా.. దక్షిణాది రాష్ట్రాలు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే..!





శ్రీశైలంలో అశేష భక్త జనవాహిని మధ్య కొనసాగుతున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వారి రథోత్సవం, ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం

కన్నుల పండువగా మల్లన్న రథోత్సవం

వైభవంగా తెప్పోత్సవం.. హాజరైన అశేష భక్త జనం

శ్రీశైలం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న రథంపై విహరిస్తూ భక్తజనులను కరుణించారు. గురువారం సాయంత్రం శ్రీగిరి క్షేత్రవీధులలో అశేష భక్త జనం నడుమ స్వామిఅమ్మవార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో వెండిపల్లకిపై తోడ్కొని వచ్చారు. నంద్యాల కలెక్టర్ రాజకుమారి, ఈవో శ్రీనివాసరావు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో ఆలయ అర్చకులు రథానికి రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకరించిన రథంపై అధిష్ఠింపజేసి సాత్విక బలిగా కొబ్బరికాయలను, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం రథోత్సవం సాగింది. రాత్రి ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువుకు శుక్రవారం పూర్ణాహుతి, ధ్వజావరోహణ చేయనున్నారు.

ఘనంగా.. గౌరీ శంకరుల రథోత్సవం



శ్రీకాళహస్తిలో అశేష భక్తజనం మధ్య రథాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి క్షేత్రంలో గౌరీ శంకరుల రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయంలోని అలంకార మండపంలో సర్వాలంకార భూషితులైన శంకరుడు, ఆయన దేవేరి గౌరీదేవి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య తేరు వీధిలోని రథాల వద్దకు వేంచేశారు. తేరువీధిలోని ఆలయ మండపంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం పరమశివుడిని పెద్ద రథంపై, ఉమాదేవిని చిన్న రథంపై అధిష్ఠింపచేశారు. పూజల అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. చతుర్మాడ వీధుల్లో స్వామిఅమ్మవార్ల రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పట్టణవాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. ఇక రాత్రి నారద పుష్కరిణిలో తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. తెప్పలపై ఊరేగుతున్న జ్ఞానప్రసూనాంబ, శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకునేందుకు వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. వేకువ జామున ముక్కంటి ఆలయంలో లింగోద్భవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బీపీసీఎల్ రిఫైనరీకి భూసేకరణ విరమించుకోవాలి

» ప్రభుత్వాన్ని కోరిన మానవ హక్కుల వేదిక

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలో బీపీసీఎల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కోసం చేపడుతున్న భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మానవ హక్కుల వేదిక కోరింది. కొత్తపల్లిపాలెం, టెంకాయచెట్లపాలెం, భట్టిసోమయ్య పట్టిపాలెం, అలగాయపాలెం, చౌకిచెర్లపల్లిపాలెం, పెద్దపట్టపుపాలెం, బాలకోటయ్య యానాది సంఘం తదితర గ్రామాల్లో తాము పర్యటించామని మానవ హక్కుల వేదిక ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, కార్యదర్శి జి.రోహిత్, ఉభయరాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్.కృష్ణ, రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మోహన్‌రావు, మత్స్యకార సంఘం నాయకులు పి.దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాలన్నీ కూడా బంగాళాఖాతం, జాతీయ రహదారి 16కు మధ్య ఉన్నాయని.. అక్కడ రైతులు, రైతు కూలీలు, మత్స్యకారులతో తాము మాట్లాడామని పేర్కొన్నారు. ఆ పంచాయతీల ప్రజలకు ప్రధానమైన ఆదాయ వనరు వ్యవసాయం, చేపల వేట అని తెలిపారు. బీపీసీఎల్ ప్రాజెక్టుకు పూర్తిగా వ్యతిరేకమని ఆయా గ్రామాల ప్రజలు చాలా స్పష్టంగా తెలియజేశారన్నారు. ఆ ప్రాజెక్టు కారణంగా ఉత్పన్నమయ్యే కాలుష్యం, ప్రాజెక్టు భూసేకరణ కారణంగా తమ జీవితం శాశ్వతంగా దెబ్బతింటుందని, తమ జీవనోపాధి పూర్తిగా ధ్వంసమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. బీపీసీఎల్ రిఫైనరీ కోసం తొలి విడతలో 6వేల ఎకరాలు, భవిష్యత్తులో విస్తరణ కోసం మరో 10వేల ఎకరాలు తీసుకోవాలని భావించడం ఆక్షేపణీయమన్నారు. ప్రజల జీవితాలను, వారి భవిష్యత్‌ను పణంగా పెట్టి బీపీసీఎల్‌కు భారీగా భూములు సేకరించి ఇచ్చే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఆరోగ్యం' బాగోలేదు

ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో ఆరోగ్యశాఖపై అసంతృప్తి.. ఆరు అంశాల్లో అభిప్రాయ సేకరణ

» అన్నింటిలోనూ అత్తెసరు మార్కులే
» కొనసాగుతున్న అవినీతి.. అందుబాటులో లేని వైద్యులు
» రోగులు, సహాయకుల పట్ల దురుసు ప్రవర్తన
» డాక్టర్ రాసిన మందులు ఇవ్వడం లేదని రోగుల ఫిర్యాదు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల పనితీరు మెరుగుపడడంలేదు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై ఎన్నిసార్లు ఐవీఆర్ఎస్ సర్వేలు నిర్వహించినా సంతృప్తి స్థాయిలు మాత్రం పెరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శాఖలో 90 శాతంపైన సంతృప్తి ఉండాలని బలంగా కోరుకుంటోంది. కానీ వైద్య శాఖ మాత్రం అత్తెసరు మార్కులే సాధిస్తోంది. ఆస్పత్రుల్లో సేవలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆరు అంశాలపై జనవరి చివరి వారంలో, ఫిబ్రవరి మొదటివారంలో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. ఆస్పత్రుల్లో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా..? డాక్టర్ ప్రవర్తన ఎలా ఉంది..? సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది..? డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా..? ఆస్పత్రుల్లో అవినీతి గమనించారా..? పరిశుభ్రత ఎలా ఉంది..? అన్న అంశాలపై ప్రశ్నలు వేశారు. ఈ ఆరింట్లో ఒక్కదానిలో కూడా కనీసం 80 శాతం సంతృప్తి కూడా రాలేదు. ఆస్పత్రుల్లో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా..? అన్న ప్రశ్నకు 66 శాతం ఉన్నారని, 34 శాతం లేరని తేలింది. ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రవర్తన కూడా ఆశించిన స్థాయిలో లేదు. సిబ్బంది ప్రవర్తన 63 శాతం మంది బాగుందని చెబితే.. 37 శాతం మంది రోగులు బాగోలేదని చెప్పారు. మర్కాపురం జీజీహెచ్, తిరుపతిలోని తల్లీపిల్లల ఆస్పత్రిలో సిబ్బంది దారుణంగా ప్రవర్తిస్తున్నారని ఐవీఆర్ఎస్ ద్వారా తేలింది. ప్రభుత్వాసుపత్రుల్లో మందులు ఇస్తున్నారా..? అన్న అంశంపై కూడా రోగులు సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఏ ఆస్పత్రిపైన కూడా కనీసం 70 శాతం కూడా సంతృప్తి వ్యక్తం కాలేదు. వైద్యులు రాసిన మందులు సక్రమంగా ఇవ్వడం లేదని ఐవీఆర్ఎస్ సర్వేలో 43 శాతం మంది స్పష్టంగా చెప్పారు. అయితే ఇవ్వడానికి మందులు అందుబాటులో ఉండటం లేదని సిబ్బంది చెబుతున్నారు.

అవినీతి.. అదే రీతి

ప్రభుత్వాసుపత్రుల్లో అవినీతి ఇంకా కొనసాగుతోంది. చిన్న కట్టు వేయాలన్నా ఎంతో కొంత సమర్పించాల్సి వస్తోంది. చిన్న స్థాయి సిబ్బంది నుంచి పెద్ద స్థాయి అధికారుల వరకు ప్రతిస్థాయిలో అవినీతి బయటపడుతోంది. చివరికి కొంత మంది వైద్యులు శస్త్ర చికిత్స చేసేందుకు కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వాళ్లకే మొదట శస్త్ర చికిత్స చేస్తున్నారని ఐవీఆర్ఎస్ సర్వేలో తేటతెల్లమైంది. ప్రభుత్వాసుపత్రుల్లో ఏదైనా అవినీతి గమనించారా..? అన్న అంశంపై.. అవినీతి జరుగుతోందంటూ 37 శాతం మంది స్పష్టమైన సమాధానం చెప్పారు. శ్రీకాకుళం, కాకినాడ, మచిలీపట్నం, ఏలూరు, పాడేరు, ఒంగోలు జీజీహెచ్‌ల్లో 40 శాతం మంది అవినీతి జరుగుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రుల్లో అవినీతి తగ్గించడంలో ఆరోగ్యశాఖ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. మొత్తం ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సంతృప్తి స్థాయి పెరగడం లేదు. మార్చిలో మరోసారి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించబోతోంది. ఇప్పటికే ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో తదుపరి సర్వేపై ఆరోగ్యశాఖ అధికారుల్లో గుబులు మొదలైంది.



అమరావతిలో అమరేశ్వరుని రథోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని

అంబరాన్ని తాకిన అమరేశ్వరుని రథోత్సవ సంబరం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న పల్నాడు జిల్లా అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామివార్ల రథోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్లను దివ్యరథంపై ఉంచి రథోత్సవం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ పాల్గొన్నారు. స్వామి వారి రథోత్సవం జరుగుతుండగా డ్రోన్ సహాయంతో పూలవర్షం కురిపించారు.

మహా శివలింగం



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్కే బీచ్‌లో కోటి లింగాలతో ఏర్పాటు చేసిన మహా శివలింగానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున సూర్యోదయం వేళ లేలేత కిరణాల వెలుగులో ఈ మహా శివలింగం అద్భుతంగా కనిపించింది.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు



నగరంలోని ఆర్కే బీచ్‌కు గురువారం ఉదయం భక్తులు పోటెత్తారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి జాగారం చేసినవారంతా గురువారం తెల్లవారుజామున సముద్ర స్నానానికి తరలివచ్చారు. మధ్యాహ్నానికి వేలాది మంది సముద్ర స్నానాలు చేశారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

అంధ యువతి వివాహానికి సీఎం సాయం

» 5 లక్షల చెక్కు అందించిన చంద్రబాబు



సీఎం చంద్రబాబు ఇచ్చిన చెక్కును చూపుతున్న భూపతి, నాగమణి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ అంధ యువతి తన వివాహానికి సాయం కోరగా, సీఎం చంద్రబాబు రూ.5లక్షలు అందించారు. కుప్పం మండలం రాళ్లబుదుగూరుకు చెందిన ఆర్.నాగమణి అనే యువతి పుట్టుకతోనే అంధురాలు. అయినా ఆత్మస్థైర్యం, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ వరకు చదువుకుంది. నాగమణి అంధురాలు కావడం, వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండటంతో ఆమెకు వివాహం కావడం భారంగా మారింది. ఈ నేపథ్యంలో భూపతితో పాటు నాగమణి ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి, తన వివాహానికి సాయం చేయాలని కోరింది. ఈ మేరకు గురువారం సీఎం చంద్రబాబు.. నాగమణికి రూ.5లక్షల చెక్కు అందజేశారు. అంధురాలిని వివాహం చేసుకుని, తోడ్పాటు అందించేందుకు ముందుకొచ్చిన భూపతిని సీఎం అభినందించారు. కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని ఆశిస్తున్నా

» నిమ్మకూరులో సినీనటుడు బాలయ్య సందడి



నిమ్మకూరులో ఎన్టీఆర్ బసవతారకం దంపతుల విగ్రహాలవద్ద నివాళులర్పిస్తున్న బాలయ్య

పామర్రు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'తెలుగు జాతి అభ్యున్నతికి పాటుపడ్డ మహోన్నతుడు, నా తండ్రి స్వర్గీయ ఎన్టీఆర్. ఆ మహోన్నత వ్యక్తికి ఎన్డీయే కూటమి హయాంలో భారతరత్న తప్పక వస్తుందని భావిస్తున్నా' అని సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. తన స్వగ్రామమైన నిమ్మకూరుకు గురువారం ఆయన ఆకస్మికంగా వచ్చారు. గ్రామంలోని ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన సమీప బంధువు ఇంట్లో కాసేపు గడిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ బిడ్డగా తనను ఆదరిస్తున్నవారికి రుణపడి ఉంటానన్నారు. తన సేవలను భారత ప్రభుత్వం గుర్తించి పద్మభూషణ్ అవార్డు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తామన్నారు. అభిమానుల కోరిక మేరకు వచ్చే నెలలో ఆదిత్య369 సినిమాను మరోసారి రీలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. నిమ్మకూరులో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, డొంక రోడ్ల అభివృద్ధి, తన తండ్రి స్థలంలో ఇంటి పునర్నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పడమటి శ్రీనివాసరావు, నందమూరి శివరామకృష్ణ, జయకృష్ణప్రసాద్, సూరపనేని చంద్రశేఖర్, కుదరవల్లి లక్ష్మణస్వామి, రఘురామయ్య, కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, బాలకృష్ణ ప్రోగాం ఇన్‌చార్జి పోరంకి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఈ జన్మలో కొమరవోలు రాను: బాలకృష్ణ

మచిలీపట్నం: బాలకృష్ణ నిమ్మకూరు వచ్చారని తెలుసుకున్న ఎన్టీఆర్ సతీమణి బసవతారకం స్వగ్రామం కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, వేణు మరికొందరు ఆయనను కలిశారు. బాలకృష్ణను కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరవోలు వచ్చి చాలా రోజులైందని, ఒకసారి తమ గ్రామానికి రావాలని కోరారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాలకృష్ణ 'కొమరవోలా, అదెక్కడ, ఈ జన్మలో రాను. నాతో ఫొటోలు దిగారుగా వెళ్లిపోండి' అన్నారు. దీంతో కొమరవోలు గ్రామస్తులు అవాక్కయ్యారు. బాలకృష్ణ వస్తే తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశించి, వచ్చామని, ఎవరో చేసిన తప్పు తమ గ్రామంపై పడిందని, దీంతో బాలకృష్ణ ఆగ్రహంగా ఉన్నారని గ్రామస్తులు ఆవేదన చెందారు.

'ఆక్యుపేషన్' పొందిన తర్వాతే భవనాల్లోకి..

» నిర్మాణం పూర్తయ్యే వరకు బిల్డింగ్ ప్లాన్ ప్రదర్శించాలి
» నిర్మాణంలో తేడాలున్నా ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు
» అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆక్యుపేషన్ సర్టిఫికెట్ పొందిన తర్వాతే ఆయా భవనాల్లోకి అడుగుపెట్టేలా యజమానుల వద్ద అండర్‌టేకింగ్ తీసుకోవాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ తాజా మార్గదర్శకాల్లో పేర్కొంది. భవన నిర్మాణ ప్రణాళిక మంజూరు సమయంలోనే ఈ అండర్‌టేకింగ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో అనధికార, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసే దిశగా ఆ శాఖ కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది. అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకూ ఆదేశాలిచ్చిన నేపథ్యంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ తాజా మార్గదర్శకాలను రూపొందించింది. భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకు బిల్డింగ్ ప్లాన్‌ను అక్కడ ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఈ మార్గదర్శకాల్లో సూచించింది. భవన నిర్మాణ ధ్రువీకరణ పత్రానికి అనుగుణంగా నిర్మాణం లేకపోతే నివాసయోగ్య ధ్రువీకరణ పత్రం జారీ చేయకూడదని స్పష్టం చేసింది. నిర్మాణంలో తేడాలున్నప్పటికీ ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తే సంబంధిత అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించింది. సదరు నిర్మాణాల్లో నివాసయోగ్య ధ్రువపత్రం సమర్పించిన తర్వాతే తాగునీరు, డ్రైనేజీ, కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని స్థానిక సంస్థలకు ఆదేశించింది. అక్రమ నిర్మాణాల్లో ఎలాంటి ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు జారీ చేయరాదని పేర్కొంది. నివాసయోగ్య ధ్రువపత్రం చూసిన తర్వాతే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు సదరు నిర్మాణాలపై రుణాలు మంజూరు చేయాలని సూచించింది.

డెజిగ్నేటెడ్ కమిటీ నిర్ణయంలో జోక్యం చేసుకోం

» సబ్ కా విశ్వాస్ పథకం అర్హతపై పిటిషనర్ వివరాలు ఇవ్వలేదు
» దివాకర్ రోడ్‌లైన్స్ వ్యాజ్యం కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సబ్ కా విశ్వాస్ పథకాన్ని (పన్ను వివాద పరిష్కార పథకం)-2019 దివాకర్ రోడ్‌లైన్స్‌కు వర్తింపజేసేందుకు నిరాకరిస్తూ తిరుపతి డెజిగ్నేటెడ్ కమిటీ (సెంట్రల్ ట్యాక్స్, జీఎస్టీ అదనపు కమిషనర్) తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. బస్సుల సర్వీస్ ట్యాక్స్ బకాయిల వివాదాల పరిష్కారానికి కేంద్రం తీసుకొచ్చిన ఆ పథకం కింద అర్హులమని నిరూపించేందుకు దివాకర్ రోడ్‌లైన్స్ ఎలాంటి వివరాలను కోర్టు ముందు ఉంచలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. సబ్‌కా విశ్వాస్ పథకానికి చేసుకున్న దరఖాస్తును డెజిగ్నేటెడ్ కమిటీ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ దివాకర్ రోడ్ లైన్స్ మేనేజింగ్ పార్టనర్ జేసీ ఉమారెడ్డి 2020లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల హైకోర్టు తుది విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2019లో సబ్‌కా విశ్వాస్ పథకం ప్రవేశపెట్టక ముందే సర్వీస్ ట్యాక్స్ చెల్లింపు విషయంలో జీఎస్టీ అధికారులు తమకు నోటీసులు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో పథకం తమకు వర్తిస్తుందన్నారు. సెంట్రల్ ట్యాక్స్ అధికారుల తరఫున న్యాయవాది వైఎన్ వివేకానంద వాదనలు వినిపిస్తూ... పథకం వర్తింపచేయాలంటూ పిటిషనర్ చేసుకున్న దరఖాస్తులో వాస్తవ వివరాలు వెల్లడించలేదన్నారు. ఆదాయపు పన్ను అధికారులకు, సర్వీస్ ట్యాక్స్ అధికారులకు పిటిషనర్ సమర్పించిన వివరాల్లో వ్యత్యాసం ఉందన్నారు. అందువల్ల పిటిషనర్ దరఖాస్తును డెజిగ్నేటెడ్ కమిటీ తిరస్కరించిందన్నారు.

ఎన్డీపీఎల్ లిక్కర్ కేసులో వైసీపీ కౌన్సిలర్ అరెస్ట్

» మరో నలుగురు కూడా.. 4,125 సీసాల మద్యం స్వాధీనం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలోని కొప్పర్రు చేపలచెరువులో పట్టుబడిన నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం (ఎన్డీపీఎల్) కేసులో ఎక్సైజ్ పోలీసులు గురువారం నలుగురిని అరెస్టు చేశారు. 4,125 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభుకుమార్ చెప్పారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని, వారిలో ఏ1 నిందితుడు వైసీపీ కౌన్సిలర్ బర్రె జయరాజు అని చెప్పారు. కోనాల భరత్‌రెడ్డి ద్వారా జయరాజు మద్యాన్ని రప్పించినట్లు విచారణలో తేలిందని, మద్యం సీసాలపై గోవా లేబుల్స్ ఉన్నా.. ఆ కంపెనీ గోవాలో లేదన్నారు. పరారీలో ఉన్న భరత్‌రెడ్డి చిక్కితే విషయాలు తెలుస్తాయన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పుల పాలై..

ఐటీ ఉద్యోగం మానేసి గంజాయి దందా

» ముగ్గురి అరెస్టు.. 40 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు.. స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలైన ఓ ఐటీ ఉద్యోగి అధిక ఆదాయం కోసం చేస్తున్న ఉద్యోగం మానేసి గంజాయి దందా మొదలుపెట్టాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. ఏపీకి చెందిన శ్రీనివాసులు కొంతకాలం హైదరాబాద్‌లోని ఓ ఐటీ సంస్థలో పనిచేశాడు. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడిన అతడు అధిక మొత్తంలో అప్పులు చేశాడు. అతడి బంధువుల్లో ఒకరు గంజాయి దందా చేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలుసుకుని ఆ పని మొదలు పెట్టాడు. ఒడిశాకు చెందిన బాలాహంతల్ అలియాస్ స్టీవ్, అలియాస్ రాజు, అలియాస్ రంజు గంజాయి పండించి పలు రాష్ట్రాల్లో ఉన్న పెడ్లర్లకు సరఫరా చేస్తుంటాడు. శ్రీనివాస్ అతడి వద్ద నుంచి నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తుంటాడు. డెలివరీ కోసం ఏపీకి చెందిన తన స్నేహితుడు అభిషేక్‌ను నియమించుకున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన బాలహంతల్ నుంచి గురువారం శ్రీనివాస్ గంజాయి తీసుకుంటుండగా దాడి చేసి 40 కిలోల గంజాయి, ప్యాకింగ్ సామగ్రి, కేటీఎం బైక్, 3 మొబైల్ ఫోన్లు, రూ.40,440 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 2, 3వ తేదీల్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు

» విజయవాడ సెక్షన్‌లో ఇంటర్‌లాకింగ్ పనులే కారణం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2, 3వ తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ప్రకటించింది. విజయవాడ డివిజన్ పరిధిలోని కడియం-ద్వారపూడి-అనపర్తి సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నివిత్తం 2వ తేదీన విశాఖపట్నం నుంచి లింగంపల్లి రావాల్సిన (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను, అలాగే 3వ తేదీన లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. రైళ్ల రద్దు కారణంగా టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు 100 శాతం సొమ్ము తిరిగి జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ముగిసిన మహావేడుక

దేశాన్ని నలభైఐదురోజులపాటు మరో ఊసులేకుండా ముందుకు కదిలించిన మహాకుంభమేళా ఘనంగా ముగిసింది. ఆద్యంతమూ అద్భుతంగా సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఎవరైనా అసౌకర్యానికి గురి అయివుంటే క్షమించమని కోరారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. కుంభమేళాను జాతి ఐక్యతకోసం జరిగిన మహాయజ్ఞంగా, దేశం కొత్త శక్తితో సాగుతోందనడానికి ప్రబల నిదర్శనంగా, నవశకానికి నాందిగా పలు రీతుల్లో, విశేషణాలతో ఆయన అభివర్ణించారు. ఇంతటి మహోన్నత కార్యం మోదీ కారణంగానే సుసాధ్యమైందని యోగి ఆదిత్యనాథ్ సవినయంగా ప్రశంసిస్తే, యోగి ప్రభుత్వాన్ని ప్రధాని అభినందించారు. పరస్పర సహకారంతో, సాధ్యమైనంత సవ్యంగా నిర్వహించిన బృహత్ కార్యం కనుక డబుల్ ఇంజన్ సర్కార్‌ను అభినందించవలసిందే.

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా నలభై ఐదురోజుల పాటు పుణ్యస్నానాలు నిరంతరాయంగా కొనసాగాయి. సంక్రాంతినుంచి మహాశివరాత్రివరకూ గంగా తీరం నిత్య జన ప్రవాహంతో ధగధగలాడింది. సాధారణ రోజుల్లోనే జనం కిటకిటలాడుతూంటే, పర్వదినాల్లో ఆ సందోహం లెక్కకు అందనిది. మూడు అమృతస్నానాలతో వైభవంగా సాగిన మహాకుంభమేళాలో ఆఖరురోజున మహాశివరాత్రి కూడా తోడై ఘాట్లన్నీ మహదేవుని నామస్మరణతో మారుమోగిపోయాయి. వారూ వీరని లేదు, సామాన్యులనుంచి అసామాన్యులవరకూ అందరూ మూడునదుల్లో మునకలేసి తరించారు. దేశపాలకులు, పారిశ్రామికవేత్తలు, సినీతారలు, క్రీడాకారులు అందరినీ ఒకచోటకు చేర్చింది ఈ పుణ్యస్థలి.

డబుల్ ఇంజన్ సర్కారు కుంభమేళాను రాజకీయం చేసిందనీ, సొంత ప్రచారానికి వాడుకుందని విపక్షాలు విమర్శించడం, బీజేపీ నాయకులు ఎదురుదాడిచేయడం చూస్తున్నదే. మహాకుంభ్‌లో ఎవరు ఏది కోరుకుంటే అదే దక్కుతుందనీ, రాబందులకు కళేబరాలు, పందులకు చెత్త కనిపించాయని యోగి వ్యాఖ్యానించి కసితీర్చుకున్నారు. కుంభమేళాలో మునకలు వేయనందుకు రాహుల్‌గాంధీని, ఉద్ధవ్‌ఠాక్రేను హిందూ ఓటర్లు ముంచేయాలని కోరుతున్నారు కేంద్రమంత్రి రాందాస్ అథవలే. ఈ వాదోపవాదాలను అటుంచితే, ప్రధాని వ్యాఖ్యానించినట్టుగా ఇంతటి మహాజాతరలను నిర్వహించడం అంత సులభం కాదు. లెక్కకు చిక్కనంతమంది ప్రవాహంలాగా వచ్చిపడుతున్నందున ఏర్పాట్లు ఎంత ఘనంగా ఉన్నప్పటికీ, తప్పటడుగులు పడ్డాయి, తప్పిదాలూ జరిగాయి. నిజానికి, ప్రజలు అసౌకర్యాలకు సిద్ధపడే పుణ్యస్నానాలకు తరలివచ్చారు. లేమి గురించి బాధపడకుండా ఉన్నదానికే సంతృప్తిపడ్డారు. ఈ మారు పుణ్యాన్నీ వ్యాపారాన్నీ కలగలిపి మాధ్యమాల్లో సాగించిన విపరీత ప్రచారం కోట్లాదిమందిని ప్రయాగ్‌రాజ్‌కు మళ్ళించిందన్న విమర్శలను అటుంచితే, మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఈ మహాకార్యంలో మరిచిపోలేని విషాదం. మృతులు, బాధితుల లెక్కలు రోజంతా విప్పకుండా దాచిపెట్టినందువల్ల, ఆ తరువాత చెప్పిన అధికారిక లెక్కలకు కూడా విశ్వసనీయత లేకుండా పోయింది. వందలాదిమంది మరణించారనో, మృతదేహాలను నీళ్ళలో పడేశారనో విపక్షనేతలు వ్యాఖ్యానించేందుకు అవకాశం ఏర్పడింది. తొక్కిసలాట ఘట్టానికి మీడియాలో ప్రచారం దక్కకుండా నియంత్రించడంవల్లనే యాత్రికుల ప్రవాహం నిరవధికంగా సాగిందని కొందరు నేతలు వాదించవచ్చు. అవసరం తీరింది కనుక, ఇప్పటికైనా ఆ నిజం అది ఎంత చేదుగా ఉన్నప్పటికీ, విప్పితేనే విశ్వసనీయత అన్నది మిగులుతుంది. ఈనెల 15న న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రమాదం కూడా ముందుచూపు ఉన్న పక్షంలో నివారించదగిందే. ఇక, నీటి నాణ్యతకు సంబంధించిన అధ్యయనాలు, నివేదికలమీద యూపీ ముఖ్యమంత్రి నిప్పులు చెరగడం సముచితంగా లేదు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికని పూర్తిగా కొట్టిపారేస్తూ, స్నానానికే కాదు, తాగడానికి కూడా ఆ నీళ్ళు పనికొస్తాయని యోగి వాదించారు. ఆ నివేదికను పూర్వపక్షం చేసేందుకు అనంతరం ఆయన చాలా కష్టపడ్డారు. పర్వదినాల్లో కోట్లాదిమంది మునకలేసినప్పుడు నీరు పరిశుభ్రంగా ఉండాలన్న నియమం ఏమీ లేదు. అది సహజమనీ, తాత్కాలికమని సర్దిచెబితే సరిపోతుంది. కానీ, విమర్శలకు జవాబుచెప్పుకోవాల్సిన ప్రతీ సందర్భంలోనూ తమను ప్రశ్నిస్తున్నవారంతా విదేశీశక్తులతో చేయి కలిపి మన మతాన్ని, సంస్కృతినీ కించపరుస్తున్నారన్నంత స్థాయిలో పాలకపక్షం వ్యాఖ్యానించడం అవసరం లేనిది.

శశి థరూర్ రాజకీయ ప్రస్థానం ఎటు?



> రాబోయే రెండు సంవత్సరాలలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సొంతంగా విజయం సాధించగల అవకాశమున్న ఏకైక రాష్ట్రం కేరళ. ఈ దృష్ట్యా శశి థరూర్ వంటి నవీన నాయకుడిని పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కే ప్రయోజనకరం. అయితే తప్పుడు నిర్ణయాలతో తనను తాను ఓడించుకోవడంలో కాంగ్రెస్ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనావేయగలమా?!



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'కాంగ్రెస్‌కు నా సేవలు అవసరం లేకపోతే నాకు ఇంకా బోలెడు వ్యాపకాలు, వ్యాసంగాలు ఉన్నాయి' అని శశి థరూర్ ఒక మలయాళీ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించారు. తీవ్ర భావావేశాలను పురిగొల్పే అధునాతన సామాజిక మాధ్యమాల యుగంలో వివాదాలు భగ్గుమనేందుకు ఒకే ఒక్క ట్వీట్, 20 సెకన్ల సౌండ్ బైట్ సరిపోవా? కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను చెప్పిన దానికి లేదా చెప్పని దానికి పార్టీలో వివాదాస్పదుడు అయ్యారు. వివాదాలకు కేంద్రం కావడం శశి థరూర్‌కు ఇదే మొదటిసారి కాదు. ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన థరూర్ క్రియాశీల రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తనకు గ్రంథ రచన, ఉపన్యాసాలు వెలువరించడం మొదలైన వ్యావృత్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన తీరు తెన్నులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించనున్నారా అనే అనుమానాలను రేకెత్తిస్తోంది. థరూర్ పార్టీ మారనున్నారా అన్నది పలువురి మాటామంతీలో చర్చనీయాంశమైపోయింది. కేరళ ముఖ్యమంత్రి పదవి అభ్యర్థిగా తనను ప్రకటించాలని పార్టీ నాయకత్వానికి నచ్చచెప్పడానికి థరూర్ ప్రయత్నిస్తున్న సందర్భంలో ఈ సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో భారత పురాతన రాజకీయ పక్షం నుంచి బయటకు వెళ్లిపోయిన ప్రముఖ నాయకుల జాబితా చిన్నదేమీ కాదు. వారిలో అత్యధికులు భారతీయ జనతా పార్టీ లేదా ఆ పార్టీ నాయకత్వంలోని కూటమిలో చేరారు. ప్రజాహితం కంటే అధికార పరిమళాల ఆస్వాదనే ఈనాటి రాజకీయవేత్తల పరమ లక్ష్యం కదా. ఇలా కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన వారిలో జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద, మిళింద్ దేవరా మొదలైన వారికి కాంగ్రెస్ ప్రథమ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారే అయినా పార్టీ నుంచి వెళ్లిపోవడానికే నిర్ణయించుకున్నారు. హిమంత బిశ్వశర్మ, కెప్టెన్ అమరీందర్‌సింగ్ లాంటి వారు పార్టీ అంతర్గత అధికార రాజకీయాలలో తాము తప్పుడు పక్షం వైపు ఉన్నామని గ్రహించిన తరువాత అనివార్యంగా కాంగ్రెస్ నుంచి నిష్క్రమించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు దశాబ్దాలుగా విధేయంగా ఉన్న కార్యకర్తలు, అభిమానులు అసంఖ్యాకంగా ఉన్నారు. అయితే వారంతా అప్రసిద్ధులు. కాంగ్రెస్‌కు సరైన నాయకుడు లేడని, మునిగిపోతున్న పడవలా పార్టీ తయారయిందని గ్రహించిన ఆ అనామక కార్యకర్తలు, మద్దతుదారులు నిశ్శబ్దంగా వేరే పార్టీలకు వెళ్లిపోయారు. శశి థరూర్ విషయం భిన్నమైనది. మొదటి నుంచీ ఆయన సంప్రదాయ కాంగ్రెస్‌వాది కాదు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కూడా కాదు. గాంధీ కుటుంబానికి సన్నిహితుడూ కాదు. స్వయం కృషితో కాంగ్రెస్‌లోను, ప్రజా జీవితంలోను సమున్నతంగా ఎదిగిన వ్యక్తి. సౌమ్యుడు, స్ఫుటంగా భావవ్యక్తీకరణ చేయగల ఈ మాజీ ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త భారత రాజకీయాలలో అంతకంతకూ కనుమరుగైపోతున్న ఒక విశిష్టుల కోవకు ప్రతినిధి. విద్వత్తు, విధ్యుక్త ధర్మ నిర్వహణ పట్ల అచంచల అంకితభావం, మేధో నైపుణ్యాలు పుష్కలంగా ఉన్న శశి థరూర్ స్వయం కృషితో ఎదిగిన ప్రతిభావంతుడు. ఐక్యరాజ్యసమితి సహాయ ప్రధాన కార్యదర్శి పదవిని విడనాడి క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు చాలా మంది ఆయన్ను వెటకరించారు. ఆయన రాజకీయ ఆకాంక్షలు ఫలించవని, విఫల రాజకీయవేత్తగా ఆయన త్వరలోనే రాజకీయాల నుంచి తప్పుకోవడం ఖాయమని పలువురు గట్టిగా అభిప్రాయపడ్డారు. ఆంగ్లేయుడులా ఆంగ్ల భాషను మాట్లాడగల నేర్పు, అధునాతన భావ సంపద, ఆకర్షణీయమైన వ్యక్తిగత జీవితం, వైయక్తిక విలక్షణ జీవనశైలి ఉన్న థరూర్ భారతదేశ సంప్రదాయ రాజకీయ వాతావరణంలో రాణించే అవకాశం లేదని ఎంతో మంది భావించారు.

వ్యక్తిగత జీవితంలోను, రాజకీయ జీవితంలోను తుఫానులు అన్నిటినీ తట్టుకుని తిరువనంతపురం నుంచి నాలుగుసార్లు వరుసగా లోక్‌సభకు థరూర్ ఎన్నికయ్యారు, వామపక్షాల ప్రాబల్యం, బీజేపీ అత్యంత క్రియాశీలంగా ఉన్న నియోజకవర్గం నుంచి థరూర్ వరుసగా నాలుగుసార్లు అనితర సాధ్యంగా ఎన్నికయ్యారు. ఎన్నో ప్రతికూలతలను ఎదుర్కొని ఆయన కాంగ్రెస్‌లో తన కంటూ ఒక స్థానాన్ని సాధించుకున్నారు. యథాతథ పరిస్థితులను సవాల్ చేశారు. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడడం అందుకొక నిదర్శనం. పార్టీ ప్రథమ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు లేకపోయినప్పటికీ పార్టీలో ప్రముఖంగా వెలుగొందడంలో విజయవంతమైన 'బయటి వ్యక్తులు'లో థరూర్ ఒకరన్న వాస్తవాన్ని ఎవరూ కొట్టివేయలేరు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసినపుడు ఆయన పార్టీ ప్రముఖుల నుంచి ఎటువంటి వ్యతిరేకతను ఎదుర్కొన్నారో నేను నా పుస్తకం '2024: The Election That Surprised India'లో వివరంగా రాశాను. శశి థరూర్ ప్రచార సభలకు దూరంగా ఉండాలని అన్ని రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రతినిధులను ఏఐసీసీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు ఆదేశించారు. అయినప్పటికీ థరూర్‌కు 1000కి పైగా ఓట్లు లభించడం పార్టీ శ్రేణుల్లో ఆయనకు, ఊహించిన దాని కంటే ఎక్కువ మద్దతు ఉన్నదని స్పష్టమయింది.

థరూర్‌తో సమస్యేమిటంటే ఆయన్ని ఏ 'శిబిరం'కు చెందినవాడుగా పరిగణించలేము. ఆయన మేధావి. కాంగ్రెస్ ముఠాలు, ఒకే ప్రయోజనాలున్న వ్యక్తుల బృందాలలో ఆయన ఉండలేరు. సాహిత్య ఉత్సవాలు, మేధో చర్చలలో మాత్రమే ఆయన ఉత్సాహంగా ఉండగలుగుతారు, సంపూర్ణంగా నిమగ్నమవుతారు. కాంగ్రెస్ నాయకత్వంలో మార్పునకు డిమాండ్ చేసిన జీ23లో సభ్యుడుగా ఆయన పేరు బయటకు వచ్చినప్పుడు కూడా కాంగ్రెస్‌లో తిరుగుబాటును ప్రోత్సహిస్తున్న వ్యక్తిగా ఆయన్ని చూడడం సాధ్యం కాలేదు. ఆయన వ్యవహార శైలి పూర్తిగా వైయక్తికమైనది. ఆర్థిక వ్యవహారాలలోగానీ, విదేశాంగ విధానానికి సంబంధించి గానీ మోదీ సర్కార్ నిర్ణయాలకు థరూర్ మద్దతునిచ్చిన ప్రతిసారీ, మోదీ–బీజేపీ–ఆరెస్సెస్‌పై 'యుద్ధం' చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఆయన పార్టీ విధేయతను అనుమానిస్తున్నారు. పార్టీ విధానాలకు భిన్నమైన అభిప్రాయాలను సహించే పరిణతి మన రాజకీయ వ్యవస్థలలో పూర్తిగా కొరవడింది మరి.

నిజమైన ప్రజాస్వామిక పార్టీ విధేయుల, భజనపరుల సంఘంగా పరిమితమైపోవడం సమంజసమేనా? శోచనీయమైన విషయమేమిటంటే మన రాజకీయ పార్టీలు అన్నీ అదే విధంగా ఉన్నాయి. కనుకనే థరూర్ లాంటి ఆలోచనాపరులైన నాయకులు పార్టీలో అంతర్గత విమర్శలకు గురవుతున్నారు. విడ్డూరమైన విషయమేమిటంటే అటువంటి పరిస్థితులకు తలొగ్గకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నందునే థరూర్ పార్టీకి కాకపోయినా ఓటర్‌కు ఆదరపాత్రుడు, ఆకర్షణీయమైన నాయకుడు అయ్యారు. ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పట్టణ ప్రాంత మధ్యతరగతి ప్రజల మద్దతును గణనీయంగా కోల్పోయింది. ఎంతకూ తన భావజాల పరిమితులలోనే ఉండిపోతున్న కారణంగా ఏ పార్టీకి స్థిర విధేయత చూపని ఓటర్లను ఆకట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోంది. అటువంటి ఓటర్లు మార్పును సాధించే సానుకూల ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. శశి థరూర్ నెహ్రూవియన్ లౌకికవాది. తాను నెహ్రూత్వ వాదినని ఆయన బాహాటంగా ప్రకటించారు. బీజేపీ హిందూత్వ భావనను సవాల్ చేశారు. ఆర్థిక వ్యవహారాలలో ఉదారవాద విధానాలకు మద్దతునిచ్చారు. ప్రజలలో మతపరమైన చీలికలు సృష్టించే హిందూత్వ రాజకీయాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే వామపక్షాల నిస్సార స్టాలినిస్టు విధానాలనూ విమర్శించారు.


శశి థరూర్‌లోని ఈ విలక్షణతల కారణంగానే కేరళలో కాంగ్రెస్ 'ముఖం'గా ప్రజల మనస్సుల్లో సుప్రతిష్ఠితం చేసేందుకు సరైన వ్యక్తి అని ఘంటాపథంగా చెప్పవచ్చు. అందునా ఎన్నికలలో విజయానికి సంప్రదాయక మద్దతుదారుల ఓట్లే కాకుండా అనిశ్చిత వైఖరితో ఉండే ఓటర్ల మద్దతు పొందడం కూడా కీలకంగా ఉన్న కేరళలో థరూర్ లాంటి నేత పార్టీకి సారథ్యం వహించడం చాలా ముఖ్యం. తదుపరి రెండు సంవత్సరాలలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తన సొంత శక్తి సామర్థ్యాలతో విజయం సాధించగల అవకాశమున్న రాష్ట్రం కేరళేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ దృష్ట్యా శశి థరూర్ వంటి నవీన నాయకుడిని పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కే ప్రయోజనకరం. అయితే తప్పుడు నిర్ణయాలతో తనను తాను ఓడించుకోవడంలో కాంగ్రెస్ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనావేయగలమా?! ముఖ్యమంత్రి పదవికి ఆరాటపడుతున్న నాయకులు కేరళ పీసీసీలో తక్కువేమీ కాదు. ముఠాల, వర్గాల ప్రాబల్యం, వాటి పరస్పర కలహాలు కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసే అవకాశమున్నది. వరుసగా మూడోసారి పరాజయానికి దారితీసే ఈ పరిస్థితులను చక్క దిద్దేందుకు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఏమి చేయనున్నది? ఏమి చేయాలి? వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో శశి థరూర్‌ను పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేందుకు సాహసించాలి. ఇది దుస్సాహసం కాబోదు. పార్టీలో థరూర్ అంతస్తును పెంచి, ప్రోత్సహించడం కాంగ్రెస్ ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్ర స్థాయి నాయకత్వాల విషయంలో తీసుకున్న నిర్ణయాలలో చాలా సమంజసమైనదిగా రుజువయ్యే అవకాశమున్నది.

తాజా కలం: ఇటీవల ఒక సమావేశంలో రాజకీయాలలోకి ప్రవేశించే ఆలోచన ఎందుకు చేయలేదని నన్ను ఒక స్నేహితుడు ప్రశ్నించాడు. శశి థరూర్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొనడం కంటే ప్రసారకర్తలుగా, రాజకీయాలపై పుస్తకాలు రాస్తూ ఉండడంలోనే మాలో కొంతమందిమి సంతోషంగా ఉండగలుగుతున్నామని భావిస్తున్నానని చెప్పాను. థరూర్, నేనూ దక్షిణ ముంబైలో ఒకే పాఠశాలలో చదువుకున్నాం. విశ్వజనీన దృక్పథాన్ని అలవర్చే విద్య ప్రజా జీవితంలో ఇంకెంత మాత్రం గౌరవాదరాలు పొందడం లేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సృజనాత్మకత కోల్పోయిన స్వతంత్ర భారతం!

జనాభా పరంగా అన్ని దేశాల కంటే ముందున్న మనం శాస్త్రీయ ఆవిష్కరణల విషయంలో ఎక్కడ ఉన్నాం? ఈ 77 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా మనం ఎన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించాం? ఎన్ని అసలైన కొత్త ఆవిష్కరణలు చేశాం? అనే విషయాలను ఒకసారి నిక్కచ్చిగా పరిశీలిస్తే, విజ్ఞానశాస్త్ర రంగంలో మనం సాధించిన ప్రగతిలో ఎంత డొల్లతనం ఉందో అర్థమవుతుంది. ఆధునిక భారతీయులు ఈ దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతోందని బీరాలు పలకవచ్చు, కానీ వాస్తవం దానికి దూరంగా ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం, భారతదేశంలో సివి రామన్, జగదీష్ చంద్రబోస్, ఎల్లాప్రగడ సుబ్బారావు, సత్యేంద్రనాథ్ బోస్, హోమీ బాబా, విక్రమ్ సారాభాయ్ వంటి ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తలు ఉన్నారు. తమ విలక్షణమైన ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన శాస్త్రవేత్తలు ఈ 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఎంత మంది ఉన్నారు?



నిజమే మనం నింగిలోకి చాలా రాకెట్లు పంపిస్తున్నాం. కానీ రాకెట్ టెక్నాలజీ మనం కనుక్కోలేదనే విషయం మర్చిపోకూడదు. అలానే మన సాఫ్ట్‌వేర్ నైపుణ్యం కూడా. ఇప్పుడు మనం అనుభవిస్తున్న టెక్నాలజీ కానీ, మనకున్న శాస్త్ర పరిజ్ఞానం కానీ చాలావరకు అరువు తెచ్చుకున్నదే. మనం సొంతంగా చేసిన ఆవిష్కరణలు, కనుక్కున్న సిద్ధాంతాలు ఈ ఆధునిక యుగంలో బహుతక్కువ అని చెప్పాలి. భారతదేశాన్ని విశ్వ గురువు అని చెప్తుంటారు మనవాళ్ళు. మరి అటువంటి దేశానికి ఈ ఆధునిక యుగంలో ఎందుకు ప్రతిదాన్ని పశ్చిమ దేశాల నుంచి అరువు తీసుకోవాల్సిన దుస్థితి వచ్చింది? మనలోని సృజనాత్మకత, ఆలోచనాశక్తి ఏమైపోయాయి? మనకీ భావదారిద్ర్యం ఎలా ఆవహించింది? భారతీయులు ఆలోచించాలి.

మన పూర్వికులు పరాయి పాలనలో ఉండి కూడా గొప్ప విషయాలు కనుక్కున్నారు, ప్రపంచానికి మార్గదర్శకులు అయ్యారు. కానీ స్వతంత్ర పాలనలో ఉండి కూడా మనం వారిలో ఇసుమంత కూడా సాధించలేకపోతున్నాం. ఎందుకంటే మన పూర్వికులు పరాయి పాలనలో ఉన్నా కూడా స్వతంత్రంగా ఆలోచించారు, స్వతంత్రంగా జీవించారు. మనమేమో స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా పరాయి వాళ్ళ అధీనంలోనే బతుకుతున్నాం. మన మనస్సు, ఆలోచనలు, చదువులు, వేషభాషలు... అన్నీ పూర్తిగా ఇంగ్లిష్ వాళ్ళ అధీనంలోనే నడుస్తున్నాయి. మనకంటూ స్వంత ఆలోచన, విధానం లేదు. అనుకరణలో సిద్ధహస్తులమయ్యాం. ఆవిష్కరణలో వెనుకబడ్డాం. అనుకరించేవారు ఎంత అభివృద్ధి సాధించినా ఎప్పుడూ వెనుకనే ఉంటారు.

మన దేశం శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోవాలంటే మనం ఈ కాపీ క్యాట్ సైకాలజీని, బానిస మనస్తత్వాన్ని వదిలించుకోవాలి, స్వతంత్రంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. దానికి మన పిల్లలు ముందు మాతృభాషలో విద్యను అభ్యసించాలి. పిల్లల మనోవికాసానికి, వారిలో సృజనాత్మకతను పెంపొందించటానికి మాతృ భాషలో విద్యాభ్యాసం ఎంతగానో దోహదపడుతుంది. ప్రపంచంలో అనేక చిన్న దేశాలు మాతృభాషలో విద్యాబోధన వల్లనే శాస్త్రసాంకేతిక రంగాల్లో అగ్రగాములుగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. మనం మన పూర్వికుల అసలు చరిత్రను చదవాలి. అలానే పాశ్చాత్య శాస్త్రాలతో పాటు, ప్రాచీన భారతీయ శాస్త్రాలను కూడా లోతుగా అధ్యయనం చెయ్యాలి. అప్పుడే పూర్వికుల సృజనాత్మకతను మనం తిరిగి పుణికిపుచ్చుకోగలం, స్వతంత్ర ఆలోచనలు, ఆవిష్కరణలు చేయగలం.

– డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు

వైజ్ఞానిక దృక్పథం వికసించాలి

సైన్స్ అనేది మనిషికి మిత్రుడు కాదు, శత్రువు కాదు... అయితే అది ఒక మానవ ప్రక్రియ, అందువల్ల సైన్స్ అనేదాన్ని విడిగా దర్శించకూడదు. దానికున్న మానవీయ పార్శ్వం గమనించాలి, అవగతం చేసుకోవాలి... ఇది సైన్సు ప్రాచుర్యం వల్లే సాధ్యం అవుతుంది అని దిలీప్ ఎం.సాల్వి అన్నారు.

శాస్త్ర జ్ఞానం మతానికి, ఆధ్యాత్మిక చింతనకు శత్రువు కాదు, స్వార్థమే జ్ఞానానికి ప్రబల శత్రువు అని ప్రముఖ సైన్సు తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబరావు చెప్పిన కోణంలో కూడా ఇవాళ సైన్స్‌ని వృద్ధి చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగాల మీద ఆధారపడిన సమాజాన్ని నిర్మించుకుంటూనే అసలు అవంటే ఏమిటో చాలామందికి తెలియకపోవడం ఆత్మహత్యా సదృశ్యం– అన్న కార్ల్ సాగన్ మాటల్ని, సివి రామన్ స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని శాస్త్ర, పరిశోధన రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని వికసింపజేయాలి. సైన్సు ప్రయోగాల పట్ల అభిరుచిని పెంపొందించడానికి ప్రతి పాఠశాలలో, కళాశాలలో ప్రయోగశాలను ఏర్పాటు చేసి, ప్రయోగాలు చేయడానికి అవసరమైన పరికరాలు, రసాయనాలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లను నియమించవలసి ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు ప్లస్, మైనస్ వైర్ల గురించి తెలియకపోవడం, ఐఐటీలో పట్టభద్రులైన పిల్లలు నిజ జీవితంలో సైన్సును వినియోగించుకోలేకపోవడం, పిల్లలు పుట్టకపోతే బాబాల చుట్టూ తిరిగే అజ్ఞానం, సమస్యలు వస్తే మనుషులతో మాట్లాడి పరిష్కరించుకోవాల్సిందిపోయి ఆత్మహత్యలు, హత్యలు చేసే దుర్మార్గమైన స్థితి ఏర్పడుతోంది. ఇవన్నీ లేని ఒక సమాజాన్ని రూపొందించాలంటే అది సైన్స్‌ని అభివృద్ధి చేయడం ద్వారా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. అందుకు జాతీయ సైన్స్ దినోత్సవం దోహదపడవలసి ఉన్నది. సివి రామన్ అన్నట్లే.. 'ఐయామ్ ద మాస్టర్ ఆఫ్ మై ఫెయిల్యూర్, ఇఫ్ ఐ నెవర్ ఫేల్, హౌ విల్ ఐ ఎవర్ లర్న్' స్ఫూర్తితో శాస్త్రీయ విద్యను, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఇవాల్టి కర్తవ్యం.

– ప్రభాకర్ కస్తూరి

(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)

పూర్వవైభవం కోసం ఎదురుచూస్తున్న యానాం

భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వ తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న యానాం పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఉపాధి అవకాశాలు లేవు. పరిశ్రమలు మూతబడ్డాయి. కొత్త పరిశ్రమల స్థాపనకు దారులు మూసుకుపోయాయి. యానాం పారిశ్రామికంగా పూర్వవైభవం పొందడం అత్యవసరం.


చారిత్రకంగా పుదుచ్చేరికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. 1723లో వ్యాపారం కోసం ఫ్రెంచివారు భారతదేశంలోకి అడుగుపెట్టారు. పుదుచ్చేరిని ప్రధాన వర్తక కేంద్రంగా ఎంచుకున్నారు. అనుబంధంగా ఫ్రెంచి స్థావరాల్ని నాలుగు రాష్ట్రాలకు విస్తరించుకున్నారు. ఆ ప్రాంతాలన్నీ నదుల ఒడ్డునే ఉండేలా సముద్ర రవాణాకు అనుకూలంగా ఉండేలా వ్యాపార దృష్టితో ఏర్పాటు చేసుకున్నారు. తమిళం మాతృభాషగా గల పుదుచ్చేరీ, కారైకాల్‌లు తమిళనాడు సరిహద్దు కలిగి ఉన్నాయి. ఈ రెండింటి దూరం 150 కిలోమీటర్లు. పశ్చిమాన మలబారు తీరంలో పుదుచ్చేరికి వెయ్యి కిలోమీటర్ల దూరంలో కేరళ రాష్ట్రంలో మాహే ఉంది. మాట్లాడే భాష మలయాళం. సుదూరంగా పశ్చిమ బెంగాల్‌లోని చంద్రనాగూర్ కూడా వారి అధీనంలో ఉండేది. కానీ అక్కడ చుట్టూ ఉన్న వామపక్ష భావజాలం ప్రభావంతో ముందుగానే భారత యూనియన్‌లో విలీనం అయింది. ఇక యానాం భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతర్భాగంగా గోదావరి ఎడమ పాయ ఒడ్డున ఉంది. పుదుచ్చేరికి యానాం 850 కి.మీ దూరంలో ఉంది. పుదుచ్చేరిలో 30 శాసనసభ నియోజకవర్గాలున్నాయి (పుదుచ్చేరి–22, కారైకాల్–6, మాహే–1, యానాం–1). ఏ నియోజకవర్గంలోనూ 40 వేలకు మించి ఓటర్లు లేరు.

జాతీయోద్యమం సమయంలో ఫ్రెంచి స్థావరాల్లో విచిత్ర వాతావరణం నెలకొని ఉండేది. చుట్టూరా ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ వారిని తరిమికొట్టాలని ఉద్యమాలు, సత్యాగ్రహాలు జరుగుతుంటే ఇక్కడ నిమ్మకు నీరెత్తినట్టు ఏ రకమైన అలజడి లేదు. స్తబ్ధతగా ఉదాసీనంగా ఉండిపోయింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడేళ్ళకు గానీ స్థానిక ఉద్యమాలు చైతన్యం కాలేదు. ఎట్టకేలకు 1954 జూన్ 13 తేదీన యానాంను భారత్ స్వాధీనం చేసుకుంది. 1964 ఆగస్టు 16 తేదీ నుంచి మంత్రివర్గంతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. వివిధ భాషల, మతాల, జాతుల సంగమంగా పుదుచ్చేరీ జాతీయ సమైక్యతకు ప్రతీకగా ఉంది.

కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రజల నుంచి ఎన్నికైన ముఖ్యమంత్రి కంటే లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలెక్కువ. కేంద్రప్రభుత్వపు హోంశాఖ ఆధ్వర్యంలో పరిపాలన సాగుతుంది. యానాం అభివృద్ధి పథంలోకి దూసుకెళ్ళడానికి 1983లో పునాదులు పడ్డాయి. ఆ సంవత్సరం తెలుగువాడైన కోన ప్రభాకరరావు లెఫ్టినెంట్ గవర్నర్ అయ్యారు. అపుడు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎం.ఓ.హెచ్. ఫరూక్. ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు సానుకూలంగా స్పందించి సహాయ సహకారాలు అందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనకు పిలుపునిచ్చారు. అనేక రాయితీలు ప్రకటించారు. విద్యుత్తు, అమ్మకం పన్ను వగైరాలలో సబ్సిడీలు ఇచ్చారు. దాంతో యానాం దశ తిరిగింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వందకు పైగా పరిశ్రమలు నెలకొల్పడం ఒక చరిత్ర. 1984లో రీజెన్సీ సిరామిక్స్‌తో పాటు రెడ్డి లాబ్స్, సుచిత్ర కాంపోనెంట్స్, ఐకోమ్ లిమిటెడ్, ఎ.వి.ఆర్.జింక్, యానాం ఆయిల్స్ వంటివి ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పారు. పుదుచ్చేరిలో యానాం మైనారిటీ తెలుగు ప్రజలకు మెరుగైన జీవనోపాధికి అడుగులు పడ్డాయి. యానాం వారే కాకుండా పరిసర ఆంధ్ర ప్రాంతం వారు ఉపాధి పొందారు. యానాం ఉజ్వలంగా వెలిగింది. 2004లో యానాంలో ఉన్న పరిశ్రమల నుంచి రూ.600 కోట్ల టర్నోవర్ జరిగి ప్రభుత్వానికి రూ.75కోట్ల ఆదాయం లభించింది. తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించి గుర్తింపు పొందింది. పరిశ్రమలు దెబ్బతినడం వల్ల 2014లో ఆ ఆదాయం రెండు కోట్లకు పడిపోయింది.

యానాం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న దశలో 2005లో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన వ్యాట్ విధానంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఆర్థికంగా నష్టపోయాయి. పన్నుల భారం పట్ల పుదుచ్చేరి ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటం, కేంద్రప్రభుత్వ పునరావాస పథకాల్ని అమలుచేయకపోవడం వల్ల పరిశ్రమలు నిలదొక్కుకోలేక పోయాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కలేకపోయాయి. దానికి తోడు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కాలం చెల్లిపోగానే కొన్ని పరిశ్రమలు మూటాముల్లె సర్దుకుని వెళ్ళిపోయాయి. కొన్ని పోటీ తట్టుకోలేక పలాయనం చిత్తగించాయి. రీజెన్సీ టైల్స్ ఫాక్టరీ 1985లో ఉత్పత్తి ప్రారంభించి అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక వెలుగు వెలిగింది. రోజుకు 45000 అడుగుల ఉత్పత్తి సామర్థ్యం నుండి 4,50,000 వరకు పెరిగింది. ప్రత్యక్షంగా పరోక్షంగా పదివేల మందికి ఉపాధి లభించింది. 27 జనవరి 2012న రీజెన్సీ పరిశ్రమ విధ్వంసానికి గురై మూతపడింది.

> చంద్రబాబు నాయుడు యానాంను సోదర తెలుగు ప్రాంతంగా భావించి 80వ దశకంలో ఎన్టీఆర్‌లా అన్ని విధాలుగా సహకరించాలని పారిశ్రామికవేత్తలు, ప్రజలు కోరుకుంటున్నారు. ఎందుకంటే పుదుచ్చేరీ కేంద్ర పాలిత ప్రాంతంలో తమిళుల ప్రాబల్యం ఎక్కువ. ఎవరు అవునన్నా కాదన్నా యానాం పట్ల సవతితల్లి ప్రేమనే చూపిస్తారు.



యానాంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. యానాంకు సహజ వాయువు నిక్షేపాలు దగ్గరలో అందుబాటులో ఉన్నాయి గనుక కాలుష్యంతో పర్యావరణానికి ఎంతమాత్రం భంగం కలగదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కే.జి. బేసిన్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రోసెసింగ్ ప్లాంట్ యానాం చెంతనే ఉంది. కోనసీమ ప్రాంతాన్ని కలిపే యానాం ఎదుర్లంక వంతెన ఉంది. సహకరించే ప్రజలున్నారు. మానవవనరుల లభ్యతకు లోటు లేదు. ప్రజల్లో ఎక్కువ శాతం మంది ఇతర ప్రాంతాల నుండి వచ్చి స్థిరపడినవారే. వలసలకు ఒకప్పటి సంక్షేమ పథకాల ఆకర్షణ, ఎంసెట్ లాంటి ప్రత్యేక పరీక్షలు నిర్వహించకుండానే మంచి మార్కులు సాధిస్తే ఉన్నత విద్యావకాశాలు పొందడం, నిత్యావసర వస్తువులు అందుబాటు ధరలో ఉండటం, తక్కువ ఫీజులతో విద్యనభ్యసించటం వంటి అనేక కారణాలతో వలసలు సాగాయి.

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సిఐ), హైదరాబాద్ వారు ఒక నివేదిక తయారుజేశారు. ఆ నివేదిక పరిశ్రమల పునరుద్ధరణకు, కొత్త పరిశ్రమల స్థాపనకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించింది. అనుకూల, ప్రతికూల పరిస్థితులు, ప్రభుత్వ సహకారం, ఉపాధి కల్పన, ఆదాయ వనరులు, ప్రభుత్వ ఆదాయం మొదలైన వాటి గురించి వివరంగా నివేదికలో పొందుపర్చారు. నివేదికలోని సూచనలు అమలు చేస్తే యానాంకు పూర్వవైభవం చేకూరుతుందని పారిశ్రామికవేత్తల మాట.

చంద్రబాబు నాయుడు భావి తరాల్ని దృష్టిలో పెట్టుకుని మెరుగైన జీవనవిధానం లక్ష్యంగా పనిచేస్తారు. రాజకీయాల కంటే అభివృద్ధి, సంక్షేమం పరమావధిగా ప్రణాళికలు రచిస్తారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ రథసారథిగా కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. యానాంలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలకు గతంలో వలె సహజవాయువును కేటాయిస్తే తిరిగి ప్రాణం పోసుకుంటాయి. చంద్రబాబు నాయుడు యానాంను సోదర తెలుగు ప్రాంతంగా భావించి 80వ దశకంలో ఎన్టీఆర్‌లా అన్ని విధాలుగా సహకరించాలని పారిశ్రామికవేత్తలు, ప్రజలు కోరుకుంటున్నారు. ఎందుకంటే పుదుచ్చేరీ కేంద్ర ప్రాంతంలో తమిళుల ప్రాబల్యం ఎక్కువ. వారికున్న భాషా ప్రాంతాభిమానాలు అందరికీ ఎరుకే. ఎవరు అవునన్నా కాదన్నా యానాం పట్ల సవతితల్లి ప్రేమనే చూపిస్తారు. రెండోతరగతి పౌరులుగానే పరిగణిస్తారు. ఇది చేదు నిజం.

యానాం పరిశ్రమలకు అవసరమైన మంచినీరు, విద్యుత్ ఆంధ్ర ప్రాంతం నుండే లభిస్తోందన్న సంగతి విదితమే. అట్లాగే సానుకూలంగా స్పందించి పక్క రాష్ట్రం చేయి అందివ్వాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీతత్వం పెరిగి ఉత్పాదకరంగం అనేక ఒడుదుడుకులకు లోనవుతోంది. ఒక ప్రాంతం అభివృద్ధి పథంలో నడవాలంటే స్థానిక నాయకులు సైతం విశాలదృష్టిని అలవరచుకోవాలి. యానాం వంటి చిన్న ప్రాంతం పారిశ్రామికంగా నిలబడగలిగితే అంతిమంగా లబ్ధి పొందేది తెలుగువారే.

■ దాట్ల దేవదానం రాజు
విశ్రాంత ఉపాధ్యాయుడు



శంకరన్ స్మారకోపన్యాసం

స్కూల్ ఫర్ డెమోక్రసీ, సఫాయి కర్మచారి ఆందోళన్, సెంటర్ ఫర్ ఈక్విటీ సంస్థల సంయుక్త నిర్వహణలో ఎస్.ఆర్. శంకరన్ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేటి సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు కాట్రగడ్డ శ్రీనివాస్ హాల్, రెండవ అంతస్తు, సుందరయ్య భవన్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరుగనున్నది. ఈ సంస్మరణ సమావేశంలో హర్ష మందర్, అరుణ రాయ్, వసంత కన్నబిరాన్, ప్రొ. హరగోపాల్ ఉపన్యసిస్తారు.

– ఎస్.ఆర్. శంకరన్ స్మారక కమిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025



అతిరథ మహారథుడై..



- వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం
- కిటకిటలాడిన కెనాల్ రోడ్డు పరిసరాలు

నందీశ్వరుడు ఆనందతాండవమై నర్తించగా, బేతాళులు ప్రమద గణాలై దారి చూపగా, పాంచజన్యాలు ప్రణవనాదాలు పూరించగా రుద్రుడు రథారూఢుడై కదిలాడు. మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కెనాల్ రోడ్డులో గంగా సమేత దుర్గామల్లేశ్వరుల రథోత్సవం వైభవంగా జరిగింది.

6లో

పట్టబద్ధులై..



...లోని ఏకేటీపీ స్కూల్‌లో ఓటర్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

65.69% పోలింగ్ నమోదు

- 78,063 మందికి 51,279 మందే ఓటు
- అత్యధికంగా జగ్గయ్యపేటలో 71.55 శాతం
- అత్యల్పంగా విజయవాడ పశ్చిమలో 56.03 శాతం
- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం నుంచి రద్దీ
- కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ పరిశీలన
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు
- కృష్ణాజిల్లాలో అంతా ప్రశాంతం
- 3న గుంటూరు జిల్లాలో లెక్కింపు
- 5న ఫలితాలు వెలువడే అవకాశం



పటమట హైస్కూల్‌లో ఓటేసిన ఎంపీ కేశినేని చిన్ని

పెద్దల పోరుకు ఓటర్లు తరలివచ్చారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన తొలి సమరంలో చైతన్యం చూపించారు. చెదురుమదురు ఘటనలు మినహా గురువారం జిల్లాలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. మొత్తం 65.69 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓ మోస్తరుగానే సాగిన పోలింగ్ సాయంత్రం తర్వాత ఊపందుకుంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్య జరిగిన ప్రధాన పోరులో విజేతలెవరనేది మార్చి 5వ తేదీన తెలిసే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతపూరిత వాతావరణంలో జరిగాయి. జిల్లావ్యాప్తంగా 65.69 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం పట్టభద్ర ఓటర్లు 78,063 మంది ఉండగా, 51,279 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద చిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాలు ఖాళీగా ఉంటే, కొన్ని రద్దీగా కనిపించాయి. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ శాతం చాలా తక్కువ నమోదైంది.

మధ్యాహ్నం నుంచి పెరిగిన రద్దీ

ప్రతి రెండు గంటలకు పోలింగ్ నమోదు శాతాన్ని ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉదయం 10 గంటలకు 10.87 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 28.90 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు

మిగతా 6లో..

కృష్ణాలో 69.92 శాతం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో 69.92 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ బాలాజీ పర్యటించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. మచిలీపట్నం హిందూ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నంలోని హైనీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి కలెక్టర్ బాలాజీ సతీసమేతంగా వచ్చి ఓటు వేశారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు పలుచోట్ల పర్యటించారు. జిల్లాలో 63,114 మంది ఓటర్లు ఉండగా, 44,131 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 25,028 మంది, మహిళలు 19,103 మంది.

ఓటెత్తిన చైతన్యం



జగ్గయ్యపేటలో ఓటేసిన దివ్యాంగుడు, నగరంలోని సీవీఆర్ స్కూల్‌లో నడవలేని స్థితిలో ఓటేయడానికి వస్తూ..



పీటీ ఉషకు స్వాగతం

ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషకు గురువారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో ఇక్కడికి విచ్చేసిన ఆమెకు క్రీడా సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబును కలిసేందుకు ఉష రోడ్డు మార్గంలో వెళ్లారు. - గన్నవరం, ఆంధ్రజ్యోతి



బాలానందం

నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన స్వగ్రామమైన నిమ్మకూరులో గురువారం సందడి చేశారు. బంధువుల ఇంట్లో కొంతసేపు ఉన్న ఆయన స్థానికులతో ముచ్చటించారు. వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. అనంతరం అభిమానులతో ఫొటోలు దిగారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పించారు.

అటానమస్ లేకుండానే..

కోర్సుల ఆఫర్

- ఆంధ్రా లయోల కళాశాల నిర్వాకం
- కృష్ణా వర్సిటీ త్రిసభ్య కమిటీ నివేదిక
- లయోల యాజమాన్యానికి షోకాజ్
- వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో మరోమారు నోటీసు
- చర్యలకు ఉన్నత విద్యాశాఖకు లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అటానమస్ హోదా లేకపోయినా ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం వ్యవహారాలను సాగించిందని, దుర్వినియోగానికి పాల్పడిందని కృష్ణా యూనివర్సిటీ నియమించిన త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. దీనికి సంబంధించిన సవివర నివేదికను వర్సిటీ వీసీ శోభన్‌బాబుకు అందించింది. దీంతో ఆంధ్రా లయోల కాలేజీపై తదుపరి చర్యల కోసం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు వీసీ లేఖ రాశారు.

త్రిసభ్య కమిటీ పరిశీలనలో..

లయోల కాలేజీ యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు, కృష్ణా యూనివర్సిటీకి ఇటీవల ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆరా తీయగా, కృష్ణా యూనివర్సిటీ వీసీ త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రొఫెసర్లు ఎంవీ బసవేశ్వరరావు, వైకే సుందరకృష్ణ, పి.వీరబ్రహ్మాచారితో కూడిన కమిటీ కొద్దిరోజులుగా లయోల కాలేజీ వ్యవహారాలను పరిశీలించింది. లయోల కళాశాల నాక్ గుర్తింపు, యూజీసీ స్వయంప్రతిపత్తి ప్రస్తుత పరిస్థితి, గడువు తర్వాత లయోల కాలేజీలో నిర్వహించిన పరీక్షలు, అకడమిక్ కౌన్సిల్ సమావేశాలు, విద్యా కార్యకలాపాలను

మిగతా 6లో..

ప్లాట్ల కోసం పాట్లు..!

- జేఎన్ఎన్యూఆర్ఎం హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చినవారి పరిస్థితి ఘోరం
- దశాబ్దం గడిచినా నేటికీ అందని రిటర్నబుల్ ప్లాట్లు
- వన్‌టౌన్, గొల్లపూడి భూ యజమానుల విలవిల

6లో

స్పాట్‌లో తప్పించుకుంటాడు..!



స్పా సెంటర్ ఘనుడు భార్గవ్ కొత్తకొత్త కథలు

- ఎంపీ, ఎమ్మెల్యేలకు బంధువునంటూ మాయమాటలు
- వారి పేర్లు చెప్పి పోలీసులకు సైతం బెదిరింపులు
- బెజవాడే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా స్పా సెంటర్లు
- ఉత్తరాది నుంచి యువతులను తెప్పించి ఎర
- రోజుకు రూ.7 లక్షల వరకు ఆదాయం
- తొలుత స్పాలో భాగస్వామిగా చేరి తర్వాత కబ్జాలు
- పోలీసుల నుంచి విటులను కాపాడేందుకు కొత్త టెక్నాలజీ

'ఎమ్మెల్యే మా మామయ్య. ఎంపీ మా సమీప బంధువు..' అంటూ ప్రచారం చేసుకుంటాడు. పోలీసులకు కూడా ఆ పేర్లు చెప్పి బెదిరిస్తాడు. హైటెక్ మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్న చలసాని ప్రసన్న భార్గవ్ ఘనత ఇది. అంతేకాదు.. స్పా సెంటర్లలో భాగస్వామిగా చేరి, అక్రమంగా కబ్జాలు చేసి, ఉత్తరాది నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించడమే కాదు.. కొత్త టెక్నాలజీతో విటులను పోలీసుల నుంచి కాపాడటంలో భార్గవ్ అవలంబిస్తున్న కథలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరాది నుంచి అమ్మాయిలను విజయవాడ తీసుకురావడానికి చలసాని ప్రసన్న భార్గవ్ పెద్ద నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేసుకున్నాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న మసాజ్ సెంటర్ల గురించి తెలుసుకుని వాటి యజమానులతో పరిచయం పెంచుకుంటాడు. అందులో భాగస్వామిగా చేరి తర్వాత మొత్తం స్పా సెంటర్లు కబ్జా చేస్తాడు. తర్వాత వాటిని వ్యభిచార కేంద్రాలుగా మార్చేస్తాడు. స్పా సెంటర్ల ముసుగులో నడపడం భార్గవ్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నిసార్లు పోలీసులకు చిక్కినా కొన్నాళ్ల తర్వాత మళ్లీ అదే బాటను ఎంచుకుంటాడు. పోలీసులు దాడులు చేశాక అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. కోర్టుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసి అరెస్టు నుంచి ఉపశమనాలు పొందుతాడు. ఆ తర్వాత పేర్లు మార్చి కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తాడు. భార్గవ్ గురించి పోలీసులు కూపీ లాగుతుండగా, బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

పకడ్బందీ ప్రణాళికతో..

భార్గవ్ హైటెక్ వ్యభిచార ఛాయలు విజయవాడలోనే కాదు.. రాష్ట్రంలోని ప్రముఖ

మిగతా 6లో..

ఖరీఫ్‌లో 2,36,803 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి

కలెక్టర్ లక్ష్మీశ

6

కలెక్టర్ సుడిగాలి పర్యటన

జిల్లావ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించిన లక్ష్మీశ

కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలెక్టర్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నగరంలోని పటమట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన లక్ష్మీశ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల కేంద్రం నుంచి పోలింగ్ సరళిని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. అలాగే పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళిని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్‌యాదవ్‌తో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు.

జగ్గయ్యపేటలో పోలింగ్ కేంద్రం తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలో బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 6 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని, బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కావటంతో నెమ్మదిగా సాగుతుందన్నారు. సౌకర్యాలపై ఎక్కడా ఫిర్యాదులు లేవన్నారు.

కలెక్టర్ రాకతో ఎత్తేసిన క్యాంప్‌లు

పోలింగ్ కేంద్రానికి దగ్గరలో ఆర్ అండ్ బీ బంగ్లా సమీపంలో కూటమి, పీడీఎఫ్ అభ్యర్థి తరపున క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో కలెక్టర్ రావటంతో అధికారులు టెంట్లను తొలగించారు. ఆయన వెళ్లాక టెంట్లు లేకపోయినా నేతలు క్యాంప్‌ను కొనసాగించారు.

నందిగామలో...

నందిగామ: మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కలెక్టర్ లక్ష్మీశ నందిగామలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి ఓటర్లతో మాట్లాడారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జి.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోని పోలింగ్ సరళిని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు అందించి ఆదేశాలు జారీ చేశారు.

రిసెప్షన్ సెంటర్ పరిశీలన

కలెక్టరేట్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ లక్ష్మీశ గురువారం రాత్రి పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని స్వీకరించి భద్రపరిచే ప్రక్రియను పరిశీలించారు. చెక్ లిస్ట్ ప్రకారం సామగ్రి మొత్తం అందుతోందా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల వారీగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రతతో గుంటూరులోని ప్రధాన స్ట్రాంగ్ రూంకు శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో పంపుతామన్నారు.

ఖరీఫ్‌లో 2,36,803 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి: కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఖరీఫ్ పంటకాలంలో జిల్లాలో 2,36,803 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రభుత్వం 1,13,500 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్ణయించి, ఇప్పటికి 1,10,513.480 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్న అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఖరీఫ్ 2024-25 పంట కాలానికి సంబంధించి మార్చి 3 నుంచి మూసివేయడం జరుగుతుందన్నారు. కావున రైతులంతా ధాన్యాన్ని ఇంకా విక్రయించాల్సి ఉంటే వెంటనే సమీప కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాల్సిందిగా కలెక్టర్ కోరారు.



జగ్గయ్యపేటలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, నందిగామలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, తిరువూరులో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి, విజయవాడలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబం

దివ్యాంగ మాస్టర్ ఆదర్శం

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాళ్లు చేతులన్నీ సవ్యంగా ఉన్నవారే ఓటు వేసేందుకు వెనకాడుతున్నారు. దీంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతూ ఉంటుంది. అయితే వెల్లటూరుకు చెందిన బీవీ వెంకట రాజమోహన్ అనే దివ్యాంగ ఉపాధ్యాయుడు ఇప్పటి 5సార్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశానని చెప్పాడు. గురువారం ఆయన జి.కొండూరు పోలింగ్ బూత్‌కు కుటుంబ సభ్యులు, స్నేహితుల సాయంతో వచ్చి ఓటు వేశారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని అన్నారు. ఓటు వేయడం తనకెంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు.



జి.కొండూరు పీఎస్‌లో ఓటు వేసి వస్తున్న వెల్లటూరుకు చెందిన దివ్యాంగ ఉపాధ్యాయుడు బీవీ వెంకట రాజమోహన్



ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

● ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం నియోజకవర్గంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లు వేసినందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అధికారులకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని జాకీర్‌హుస్సేన్ కళాశాలలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో కలిసి పరిశీలించారు. దారు నాయక్, చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, మైలా సైదులు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, నూతులపాటి బాలకోటేశ్వరరావు, లంక లితీష్, పటాపంచల నరసింహారావు, చనమోలు నారాయణ, ఈమని మురళీకృష్ణ, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తున్న బస్సుపై పడిన చెట్టు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ముగిశాక గురువారం రాత్రి బ్యాలెట్ బాక్స్‌ను భద్రపరిచేందుకు బస్సులో తరలిస్తున్నండగా కళాశాల ఆవరణలోని ఓ ఎండు చెట్టు కొమ్మకు బస్ టాప్ తగలడంతో కొమ్మతో పాటు చెట్టు మొత్తం బస్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్‌లో ఉన్న సిబ్బంది త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న పోలీస్ సిబ్బంది చెట్టుకు తాడు కట్టి బస్‌పై నుంచి చెట్టును పక్కకు తప్పించారు.

సిబ్బందికి త్రుటిలో తప్పిన ప్రమాదం



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యాసాగర్ దంపతులు

గాంధీనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏ విద్యాసాగర్ గురువారం తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. గాంధీనగర్‌లోని చిట్టూరి మున్సిపల్ పాఠశాలలో తమ సతీమణి సుధారాణితో కలిసి వచ్చి ఆయన ఓటు వేశారు.

నా ఓటు ఎవరేశారు..?

● అధికారులను నిలదీసిన మహిళ
● టెండర్ ఓటుకు అనుమతిచ్చిన అధికారులు



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో 43వ నంబరు పోలింగ్ బూత్‌కు వచ్చిన గుంటుపల్లికి చెందిన పాటిబండ్ల జ్ఞానదీప్తి 331 క్రమ సంఖ్యలో ఉన్న ఆమె ఓటును వేరే వారు వేసినట్టు ఉంది. దీంతో ఆమె అధికారులను నిలదీసింది. నా ఓటు ఎవరో వేస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల సహాయాధికారి వై.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ అధికారి ఆమెకు టెండర్ ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వడంతో ఆమె ఓటు వేశారు.

స్పాట్‌లో తప్పించుకుంటాడు..!

(5వ పేజీ తరువాయి)

నగరాల్లోనూ ఉన్నాయి. ఉత్తరాది యువతులను తీసుకొచ్చి మసాజర్లగా నియమించాడు. కొద్దిరోజుల క్రితమే రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో కొత్తగా స్పా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఇవికాకుండా ఒంగోలు, నెల్లూరు నగరాల్లోని స్పా కేంద్రాల్లో భాగస్వామిగా చేరి, తర్వాత వాటిని కబ్జా చేసినట్టుగా పోలీసులకు సమాచారం అందింది. ఉత్తరాది యువతను ఏరి విజయవాడకు తీసుకురావడానికి సతీష్ అనే వ్యక్తిని ఉపయోగించుకున్నట్టు సమాచారం. అతడికి ఉత్తరాది యువతులతో సంబంధాలు ఉన్నాయి. భార్గవ్ ఏర్పాటుచేసే స్పాల్లో ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఘజియాబాద్ యువతులు ఉండటమే ఇందుకు నిదర్శనం. అలాగే, స్పా కేంద్రాలన్నీ అతడి ఆధీనంలోనే ఉన్నా వాటి అనుమతులను వేర్వేరు వ్యక్తుల పేర్లపై తీసుకుంటాడు. పోలీసులు తాజాగా దాడి చేసిన స్టూడియో 9స్పా కిషోర్ అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్టు గుర్తించారు. ఇదికాకుండా సతీష్ సోదరుడు కుమార్ పేరు మీద కొన్ని స్పా సెంటర్లను నిర్వహిస్తున్నట్టు తెలిసింది. భార్గవ్, కుమార్, సతీష్ వద్ద ఉత్తరాదికి చెందిన 10 వేల మంది యువతుల డేటా ఉన్నట్టు సమాచారం. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపిక చేసినట్టుగా ఉత్తరాది అమ్మాయిలను ఇక్కడకు తీసుకొస్తారు. స్టూడియో 9స్పాలో చిక్కిన యువతుల ఫోన్లలో డేటాను పోలీసులు పరిశీలించగా, వారంతా తమ ఆధార్‌కార్డులను భార్గవ్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపినట్టు గుర్తించారు. ఇలా ఎందుకు చేశారని పోలీసులు ప్రశ్నించగా, ఆయన స్పాల్లో పనిచేయాలంటే ఆధార్‌కార్డు ఇవ్వాలని సదరు యువతులు తెలిపారు. వెటర్నరీ కాలనీలోని స్టూడియో 9స్పా నిర్వహిస్తున్న భవనం తన సొంతమేనని భార్గవ్ పోలీసులకు తెలిపాడు. పోలీసుల విచారణలో భవనం అతడిది కాదని తేలింది. ఈ భవనానికి నెలకు రూ.లక్ష చొప్పున అద్దె కూడా చెల్లిస్తున్నారు. భార్గవ్ నిర్వహించే స్పాలో రోజుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్పాల్లో రోజుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు సంపాదిస్తున్నాడు. అలాగే, స్పాలోని అన్ని గదుల్లో ఉన్న విద్యుద్దీపాలను టూవే విధానంలో తన చాంబర్‌లో ఉన్న స్విచ్‌కు అనుసంధానం చేయించుకున్నట్టు సమాచారం. విటులు గదుల్లో సర్వీసు చేయించుకుంటున్న సమయంలో పోలీసులు వస్తే భార్గవ్ తన చాంబర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా చూస్తాడు. వెంటనే అతడి వద్ద ఉండే స్విచ్ వేసి పోలీసులు వస్తున్నట్టు సిగ్నల్ ఇస్తాడు. లైట్లు ఆన్ కాగానే విటులు గదుల నుంచి బయటకు వచ్చి పక్కనే ఉన్న భవనంపైకి పారిపోయేలా శిక్షణ ఇచ్చాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఇద్దరు విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఒక విద్యార్థిని మృతి చెందగా మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన పొనుగుమాటి నాగచైతన్య (15), సరిపల్లి విష్ణు గురువారం ఉదయం మోటార్ బైక్‌పై వెలగలేరు వైద్యశాలకు బయలుదేరారు. మార్కెట్ యార్డ్ వద్దకు రాగానే విజయవాడవైపు నుంచి ఎదురుగా వస్తున్న హైయేర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో నాగచైతన్య ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా, విష్ణుకు గాయాలయ్యాయి.

ప్లాట్ల కోసం పాట్లు..!

జేఎన్ఎన్‌యూఆర్‌ఎం హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చినవారి పరిస్థితి ఘోరం

● దశాబ్దం గడిచినా నేటికీ అందని రిటర్నబుల్ ప్లాట్లు
● వీఎంసీ, రెవెన్యూ అధికారుల చేతిలో వన్‌టౌన్, గొల్లపూడి భూ యజమానుల విలవిల

జక్కంపూడిలో జేఎన్ఎన్‌యూఆర్‌ఎం మెగా హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చిన వారికి నేటికీ ప్యాకేజీ అందని పరిస్థితి. దాదాపు దశాబ్దం గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. తమకివ్వాల్సిన ప్యాకేజీ ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వటం లేదని బాధితులు లబోదిబోమంటున్నారు.

ఆంధ్రజ్యోతి, విజయవాడ: నగరంలోని పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా ఉన్నప్పుడు నగరంలో 10వేల మందికి ఇళ్లు కల్పించేందుకు జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పథకంలో భాగంగా కార్పొరేషన్ అధికారులు జక్కంపూడిలో మెగా హౌసింగ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో భూమలిచ్చిన రైతులు, స్థలాల యజమానుల నుంచి 60:40 విధానంలో భూములు తీసుకున్నారు. ఈ టౌన్‌షిప్‌కు కాస్త ఎగువన కొత్తూరు తాడేపల్లి వెళ్లే మార్గంలోనే భూములిచ్చిన రైతులకు లే అవుట్లు వేసి వారికివ్వాల్సిన 40శాతం ప్యాకేజీలో భాగంగా ప్లాట్లు వేశారు. అప్పట్లోనే చాలామందికి ఇచ్చినా కొంతమందికి నేటికీ ఇవ్వలేదు. వీఎంసీ కమిషనర్లు, అధికారులు మారటంతో నెలకొన్న గందరగోళం వల్ల వారంతా బాధితులుగానే ఉన్నారు. వారిలో వన్‌టౌన్, గొల్లపూడి ప్రాంతానికి చెందినవారే ఎక్కువ. పెద్దసంఖ్యలో భూములిచ్చిన వారికి న్యాయం జరిగినా, గజాల లెక్కన ఇచ్చిన వారి విషయంలోనే సమస్య. వీఎంసీ అధికారుల వద్దకు వెళ్తే రెవెన్యూ వద్దకు దగ్గరకు వెళ్లమని, వారి వదద్దకు వెళ్తే వీళ్ల వద్దకు వెళ్లమని అనేక ఏళ్లుగా తిప్పిస్తున్నారు. ఏ ప్రభుత్వం కడాఅ తమ గోడు వినటం లేదని కూటమి ప్రభుత్వం అయినా ఈ సమస్యను పరిష్కరించాలని గొల్లపూడి, వన్‌టౌన్ ప్రాంతాల భూ యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పవన్‌పై నోరు పారేసుకుంటే సహించం

● దువ్వాడ వ్యాఖ్యలపై మండిపడిన జనసేన నేతలు మండలి, ఉదయభాను

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు దమ్ముంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని, లేకుంటే తమ జనసైనికులు, వీర మహిళలు రాష్ట్రంలో తిరగనివ్వరని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను హెచ్చరించారు. జగ్గయ్యపేటలోని సామినేని ఉదయభాను నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దువ్వాడ ఎమ్మెల్సీ హోదాలో శాసనమండలిలో చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేకుంటే మండలి ఛైర్మన్‌కు నోటీసు తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని ఎమ్మెల్సీ దువ్వాడతో పాటు వైసీపీ నేతలు అంటున్నారని, 2019కు ముందు ప్రతిపక్ష హోదా ఉంటే ఏం చేశారని ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందో తెలియని అజ్ఞానంలో వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు పవన్ కల్యాణ్‌పై ప్యాకేజీ మాటలు మాట్లాడారని, ఎందుకు నిరూపించుకోలేకపోయారన్నారు. కూతురు వయసున్న పరాయి మహిళతో తిరుమల వంటి పవిత్ర స్థలంలో రీల్స్ చేసిన దువ్వాడకు ఎమ్మెల్సీ ఇచ్చిన జగన్ ఏం నాయకుడని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా మాట్లాడే వైసీపీ నేతలను వదిలేది లేదని, చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జనసేన నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి ఎన్‌సీసీ సూపరింటెండెంట్ ఆత్మహత్య

విద్యాధరపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భవానీ ఐలాండ్ సమీపంలోని కృష్ణానదిలో ఎన్‌సీసీ విభాగంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ కారుమూడి విజయలక్ష్మి (60) కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. కృష్ణాజిల్లా తాడిగడప డొంకరోడ్డు గ్రీన్ సిటీ పక్కనే ఉన్న శివం ఎన్‌క్లేవ్, ప్లాట్‌నెంబరు 305లో కారుమూడి విజయలక్ష్మి నివాసం ఉంటున్నారు. భర్తతో మనస్పర్థలు రావటంతో 15ఏళ్ల క్రితం విడిపోయి కుమార్తెతో ఉంటుంది. కుమార్తె బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఈపీ భారతీనగర్‌లోని 4వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు పర్మిషన్ తీసుకుని 2.30 గంటలకు భవానీ ఐలాండ్‌కు బోటులో వెళ్లింది. సుమారు 3.30 నుంచి 4 గంటల మధ్య బోటులో ప్రయాణిస్తూ కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న భవానీపురం పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి విజయలక్ష్మి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కుమార్తెకు సమాచారం ఇచ్చారు. కుమార్తె ఇచ్చే ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది.

కోర్సుల ఆఫర్

(5వ పేజీ తరువాయి) ఈ కమిటీ పరిశీలించింది. 2021, అక్టోబరు నుంచి యూజీసీ స్వయంప్రతిపత్తి హోదాను పొందకుండానే పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆర్థిక, సాధారణ పరిపాలనా వ్యవహారాల్లో ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా గుర్తించారు. దీంతో కాలేజీ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా కమిటీ సూచించింది. ఆ సూచన మేరకు లయోల యాజమాన్యానికి షోకాజ్ నోటీసును జారీ చేసినట్టు వీసీ.. ఉన్నత విద్యాశాఖకు తెలిపారు. ఈ నోటీసుపై కాలేజీ యాజమాన్యం వివరణ ఇచ్చిందని, వాటాదారుల సంక్షేమం కోసం స్వయం ప్రతిపత్తిని కొనసాగించటానికి అనుమతించాలని అభ్యర్థించినట్టు ఆయన తెలిపారు. కళాశాల ఇచ్చిన వివరణపై మరోమారు త్రిసభ్య కమిటీ సమావేశమై తమ సిఫార్సులను అందించిందన్నారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన వివరణ తమకు సంతృప్తిని కలిగించలేదని, యూజీసీ నిబంధనల ప్రకారం అటానమస్ కల్పించాలంటే ఒక ఏడాది ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, అది జరగలేదన్నారు. దీనిపై మరోమారు లయోల కాలేజీ యాజమాన్యానికి నోటీసు ఇవ్వనున్నట్టు చెప్పారు. అటానమస్ లేకుండా కోర్సులు కొనసాగించడంపై తదుపరి చర్యల కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరామన్నారు.



శోభాయమానం

కెనాల్ రోడ్డులో ఘనంగా రథోత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహా శివరాత్రి పర్వదిన అనంతరం 150 ఏళ్లకు పైగా సంప్రదాయంగా కొనసాగుతున్న రథోత్సవాన్ని గురువారం కన్నులపండువగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అన్న సత్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రథోత్సవం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన గంగా, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులు, బుద్దవారి గుడిలోని వసంత మల్లికార్జునస్వామి, పార్వతీదేవి ఉత్సవమూర్తులు, పాత శివాలయంలోని భద్రకాళీ వీరభద్రస్వామి, భ్రమరాంబ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ఒకే వేదికపై చేర్చి రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అన్నపురాశి పోసి బలిహరణలిచ్చారు. అనంతరం విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మిగతా పోలీసు అధికారులు, పోలీసులు, భక్తజనం, నిర్వాహక కమిటీ బాధ్యులతో కలిసి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు జయజయ ధ్వానాలు పలుకుతూ రథానికి స్వాగతం పలికారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వరకు సాగి, ఆ తరువాత రథం మరల వెనుదిరిగి యథాప్రదేశానికి చేరింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని వీక్షించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, ఇంకా ఏఈవోలు, అధికారులు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఈవో నటరాజన్ షణ్ముగం, అధికారులు, అర్చకులు, వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్దువారి గుడి) ఈవో సన్యాసిరావు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి అన్న సత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రథాన్ని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, పోలీసు అధికారులు, పోలీసులు, భక్తులు లాగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. చెరకుగడలు, బెల్లం మిఠాయి, బూందీ, లడ్డూలను ప్రైవేటు వ్యాపారులు రోడ్లపై విక్రయించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వరకు సాగి, తరువాత రథం మలుపు తిరిగి యథాస్థానానికి చేరుకుంది. కోలాటాలు, నృత్యాలు, పులివేషాలు, తదితరాలు కన్నుల పండువగా సాగాయి. మేళతాళాలు, వేద పఠనాలు, రథోత్సవానికి శోభ తెచ్చాయి.

దుర్గగుడిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

● మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ● భారీగా తరలివచ్చిన భక్తుజనం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు, ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. అర్చకులు ఉదయం 8 గంటల నుంచి మండప పూజ, మూలమంత్ర హవనం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్యం నిర్వహించగా, అక్కడి నుంచి మండపారాధన, కలశారాధన, మూల మంత్ర హవనం, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది దంపతులు అధిరోహించిన పల్లకిని మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణ నడుమ ఈవో దేవదాయ శాఖ కమిషనర్, కె.రామచంద్రమోహన్ సమక్షంలో మల్లేశ్వరాలయం నుంచి కొండ దిగువ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ నుంచి కెనాల్ రోడ్డు రథం వద్దకు తీసుకువెళ్లారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, వేద పండితులు, అర్చకస్వాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టబద్దులై..

(5వ పేజీ తరువాయి)

47.11 శాతం, సాయంత్రం 4 గంటలకు 61.99 శాతం పోలింగ్ నమోదైంది. సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్నవారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించటంతో చివరికి 65.69 శాతం నమోదైంది.

నియోజకవర్గాల వారీగా ఇలా..

తిరువూరు నియోజకవర్గంలో 9,337 మంది ఓటర్లకు 6,474 మంది ఓటుహక్కు వినియోగించుకోవటంతో 69.34 శాతం పోలింగ్ నమోదైంది. నందిగామ నియోజకవర్గంలో 6,226 మంది పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోగా, 68.61 శాతం పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 7,367 మంది ఓటర్లకు 5,271 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 71.55 శాతం పోలింగ్ నమోదైంది. మైలవరం నియోజకవర్గంలో 13,490 మంది ఓటర్లకు 9,291 మంది ఓటుహక్కు వినియోగించుకోవటంతో 69 శాతం పోలింగ్ నమోదైంది. తూర్పు నియోజకవర్గంలో 8,552 మంది ఓటర్లకు 5,932 మంది ఓటుహక్కు వినియోగించుకోవటం ద్వారా 69.36 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమ నియోజకవర్గంలో 9,868 మంది ఓటర్లకు 5,529 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 56.03 శాతం పోలింగ్ నమోదైంది. సెంట్రల్ నియోజకవర్గంలో 17,072 మందికి 10,599 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 62.08 శాతం పోలింగ్ నమోదైంది.

స్వల్ప వివాదాలు

హిసార్ (హరియాణా): అర్జున అవార్డు గ్రహీత, ప్రపంచ మాజీ బాక్సింగ్ చాంపియన్ స్వీటీ బూరా వరకట్న వేధింపులు ఎదుర్కొంటోంది. తన భర్త, భారత కబడ్డీ జట్టు మాజీ కెప్టెన్ అయిన దీపక్ హూడా, అతని కుటుంబం అదనపు కట్నం కోసం తనపై దాడిచేసిందని స్వీటీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో దీపక్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. అర్జున అవార్డు గ్రహీత, ప్రొ.కబడ్డీ లీగ్‌లో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించిన దీపక్ హూడా-స్వీటీల వివాహం 2022లో జరిగింది. వీరిద్దరూ హరియాణాకు చెందినవారే. 'భర్త దీపక్ హూడా కట్నంకోసం వేధింపులకు గురి చేస్తున్నాడంటూ స్వీటీ ఈనెల 25న చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. రెండు మూడుసార్లు అతడికి నోటీసు ఇచ్చాం. కానీ అనారోగ్య కారణాలు చూపుతూ దీపక్ హాజరుకాలేదు' అని హిసార్ మహిళా పోలీస్ స్టేషన్ అధికారిణి సీమా గురువారం వెల్లడించారు. మరోవైపు భర్త దీపక్‌నుంచి విడాకులు కోరుతూ స్వీటీ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా వివాహ సమయంలో కోటి రూపాయల నగదు, ఖరీదైన ఫార్చ్యూనర్ కారు ఇచ్చామని, అయినా ఇంకా డబ్బు కోసం హింసిస్తున్నారంటూ స్వీటీ తన భర్త దీపక్, ఆడపడుచు పూనమ్‌లపై చేసిన ఫిర్యాదులో పేర్కొంది. గతేడాది ఫిబ్రవరిలో భర్తతో కలిసి స్వీటీ బీజేపీలో చేరింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో రోహ్‌తక్ జిల్లాలోని మేహమ్ నియోజకవర్గం నుంచి దీపక్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యాడు. స్వీటీ 2023 వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఇక దీపక్ 2016 దక్షిణాసియా క్రీడల్లో స్వర్ణం, 2014 ఆసియాడ్‌లో కాంస్యం సాధించిన భారత జట్టులో సభ్యుడు.

పాక్.. విజయం లేకుండానే




బంగ్లాతో మ్యాచ్ రద్దు

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో మరో మ్యాచ్ వర్షార్పణమైంది. గురువారం ఆతిథ్య పాకిస్థాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య నామమాత్రపు మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ వర్షంతో టాస్ కూడా వీలు కాకుండానే రద్దయ్యింది. దీంతో 29 ఏళ్ల తర్వాత ఆతిథ్యమిస్తున్న ఐసీసీ టోర్నీని పాక్ విజయం లేకుండానే ముగించింది. గ్రూప్ 'ఎ' నుంచి భారత్-న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్ చేరిన విషయం తెలిసిందే. రెండు ఓటములతో ఉన్న రిజ్వాన్ సేన కనీసం ఆఖరి మ్యాచ్‌లోనైనా ఓదార్పు విజయం దక్కించుకోవాలని భావించింది. కానీ వీరి ఆశలపై వరుణుడు నీళ్లు జల్లాడు. గురువారం ఉదయం నుంచే ఇక్కడ వర్షం కురుస్తుండడంతో మైదానం పూర్తిగా చిత్తడిగా మారింది. అవుట్‌ఫీల్డ్ అంతా జలమయం కావడంతో మ్యాచ్ నిర్వహణ అసాధ్యమైంది. చివరకు భారత కాలమాన ప్రకారం సాయంత్రం నాలుగు గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఫలితంగా గ్రూప్ 'ఎ'లో పాక్-బంగ్లా జట్లకు ఒక్క విజయమూ దక్కకుండా పోయింది. మరోవైపు మంగళవారం ఇదే మైదానంలో జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే.

పాకిస్థాన్‌కు రూ.2.3 కోట్ల ప్రైజ్‌మనీ

చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ దశ నుంచే నిష్క్రమించిన ఆతిథ్య పాకిస్థాన్‌కు ప్రైజ్‌మనీ రూపంలో రూ.2 కోట్ల 31 లక్షలు దక్కాయి. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ సీటీ కోసం ఐసీసీ 53 శాతం ప్రైజ్‌మనీని పెంచింది. దీంట్లో భాగంగా సెమీస్‌కు అర్హత సాధించలేకపోయిన జట్లకు రూ.కోటీ 22 లక్షలు ఇవ్వనుండగా, పార్టిసిపేషన్ ఫీజు కింద మొత్తం 8 జట్లకూ తలో రూ. కోటీ 9 లక్షలు ఇస్తారు. దీంతో పాక్‌కు మొత్తంగా రూ2 కోట్ల 31 లక్షలు అందుకోనుంది. చాంపియన్స్ ట్రోఫీ మొదలైన తర్వాత ఓ ఆతిథ్య జట్టు ఒక్క విజయమూ లేకుండా నిష్క్రమించడం ఇదే తొలిసారి.

ఎవరిదో సెమీస్ బెర్త్?


స్మిత్

నేడు ఆసీస్ X అఫ్ఘాన్ పోరు

- మ్యాచ్ రద్దయితే కంగారూలకే చాన్స్
- మ. 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

చాంపియన్స్ ట్రోఫీ


షాహిదీ

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ 'బి'లో తొలి సెమీస్ బెర్త్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆస్ట్రేలియా-అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు నాకౌట్‌కు వెళ్తుంది. ఆసీస్ ఖాతాలో మూడు పాయింట్లు ఉండగా.. ఇంగ్లండ్‌పై సంచలన విజయంతో అఫ్ఘాన్ రెండు పాయింట్లతో ఈ రేసులో నిలిచింది. అయితే వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే ఆసీస్ నాలుగు పాయింట్లతో ముందుకెళ్లే అవకాశముంటుంది. కానీ మూడు పాయింట్లతో నిలిచే అఫ్ఘాన్ దాదాపు నిష్క్రమించినట్టే. ఒకవేళ ఇంగ్లండ్ జట్టు దక్షిణాఫ్రికా (3 పాయింట్లు)పై అతి భారీ విజయం సాధిస్తే.. రన్‌రేట్ ప్రకారం అఫ్ఘాన్‌కు చాన్స్ ఉంటుంది. ప్రస్తుతానికైతే షాహిదీ సేన ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. బుధవారం అసాధారణ ఆటతీరుతో పటిష్ఠ ఇంగ్లండ్‌కు ఓటమి రుచి చూపించింది. 200 పరుగులు కూడా కష్టమే అనుకున్న చోట జద్రాన్ వీరోచిత శతకంతో ఏకంగా 300 స్కోరు దాటగలిగింది. అదే ఊపులో ఆసీస్‌ను కూడా మట్టికరిపించాలన్న ఆశయంతో ఉన్నారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో మ్యాక్స్‌వెల్ డబుల్ సెంచరీతో ఆసీస్ టీమ్ అఫ్ఘాన్‌ను చిత్తుగా ఓడించింది. నేటి మ్యాచ్‌లో ప్రతీకారం తీర్చుకుని ఈ ఫార్మాట్‌లో కంగారూలపై తొలి విజయం అందుకోవాలనుకుంటోంది. అటు ఆసీస్ జట్టు టోర్నీలో ఒక్క మ్యాచే పూర్తిగా ఆడగా, వర్షంతో సౌతాఫ్రికా మ్యాచ్ రద్దయ్యింది. కమిన్స్, స్టార్క్, హాజెల్‌వుడ్, మార్ష్ లేకపోయినా బలంగానే కనిపిస్తోంది. ఇంగ్లండ్‌పై 352 పరుగుల ఛేదనను సునాయాసంగా పూర్తి చేయగలిగింది. పైగా వారం రోజులపాటు విశ్రాంతి లభించడంతో ఆసీస్ ప్లేయర్లు తాజాగా బరిలోకి దిగబోతున్నారు. హెడ్, స్మిత్ బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. లబుషేన్, ఇన్‌గ్లి‌స్, క్యారీ, మ్యాక్స్‌వెల్‌లతో మిడిలార్డర్ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది.

'సాయ్' ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు సహకరించండి



జాతీయ క్రీడల నిర్వహణకు మద్దతివ్వండి

పీటీ ఉషతో సీఎం చంద్రబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబు భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషను కోరారు. గురువారం ఉండవల్లి నివాసంలో చంద్రబాబుతో పీటీ ఉష భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2029 జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని ఏపీకి కల్పించేందుకు సహకరించాలని కూడా సీఎం కోరారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు వంటి అంశాలను కూడా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన స్పోర్ట్స్ పాలసీపైన, రాష్ట్రంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాల కల్పనపైన ఇద్దరి నడుమ చర్చలు జరిగాయి.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ఢిల్లీ x ముంబై

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గార్డ్‌నర్ ధనాధన్

- గుజరాత్ గెలుపు
- బెంగళూరుకు వరుసగా మూడో ఓటమి


ఆష్లే గార్డ్‌నర్ (31 బంతుల్లో 58)

బెంగళూరు: ఆష్లే గార్డ్‌నర్ (31 బంతుల్లో 58) ధనాధన్ అర్ధ శతకంతో.. గుజరాత్ జెయింట్స్ మళ్లీ గెలుపు బాటపట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గెలిచింది. కాగా, మంధాన సేనకు ఇది వరుసగా మూడో ఓటమి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 125/7 స్కోరు చేసింది. దియేంద్ర డోటిన్, తనూజ కన్వర్ చెరో రెండు వికెట్లతో విజృంభించడంతో.. పవర్‌ప్లేలోపే డానీ వ్యాట్ (4), ఎలీస్ పెర్రీ (0), కెప్టెన్ స్మృతి మంధాన (10) వికెట్లను చేజార్చుకొన్న చాలెంజర్స్ 25/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, రాఘ్వి బిస్త్ (22), కనిక అహూజా (33), జార్జియా వేర్హమ్ (20 నాటౌట్), కిమ్ గార్త్ (14) తలో చేయి వేయడంతో.. టీమ్ స్కోరు కష్టంగా 120 మార్క్ దాటింది. ఛేదనలో గుజరాత్ 16.3 ఓవర్లలో 4 వికెట్లకు 126 పరుగులు చేసి గెలిచింది. గార్డ్‌నర్, లిచ్‌ఫీల్డ్ (30 నాటౌట్) నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో జెయింట్స్ సులువుగా నెగ్గింది. బెత్ మూనీ (17), హేమలత (11)ను రేణుక అవుట్ చేయగా.. హర్లీన్ డియోల్ (5), గార్డ్‌నర్‌ను వేర్హమ్ పెవిలియన్ చేర్చింది.

కేరళ 131/3

- సర్వాటే అర్ధ శతకం
- విదర్భ 379 ఆలౌట్
- రంజీ ఫైనల్


సర్వాటే

నాగ్‌పూర్: ఆదిత్య సర్వాటే (66 బ్యాటింగ్) అర్ధ శతకంతో రాణించడంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో కేరళ నిలకడగా ఆడుతోంది. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కేరళ 131/3 స్కోరు చేసింది. గురువారం ఆటముగిసే సమయానికి సర్వాటేతోపాటు కెప్టెన్ సచిన్ బేబి (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్లు రోహన్ కున్నుమ్మల్(0), అక్షయ్ చంద్రన్ (14)ను నల్కండే పెవిలియన్ చేర్చాడు. సర్వాటే.. ఇమ్రాన్ (37)తో కలసి మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నాడు. అయితే, ఇమ్రాన్‌ను యశ్ ఠాకూర్ వెనక్కిపంపాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 254/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 379 పరుగులకు ఆలౌటైంది. నిధీష్, ఈడెన్ యాపిల్ టామ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కేరళ ఇంకా 248 పరుగుల దూరంలో ఉంది.

'ఢిల్లీ' మెంటార్‌గా కేపీ



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్‌గా నియమితుడయ్యాడు. 44 ఏళ్ల కెవిన్‌కు ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించడం ఇదే తొలిసారి. 2014 సీజన్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్‌కు పీటర్సన్ సారథిగా వ్యవహరించాడు.

మ్యాచ్ రెఫరీగా వైదొలగనున్న బూన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ డేవిడ్ బూన్ ప్రస్తుతం నిర్వర్తిస్తున్న ఐసీసీ మ్యాచ్ రెఫరీ బాధ్యతలనుంచి చాంపియన్స్ ట్రోఫీ అనంతరం వైదొలగనున్నాడు. ఆపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బోర్డు డైరెక్టర్‌గా అతడు చేరనున్నాడు.

ప్రజ్ఞానందకు వరుసగా రెండో డ్రా

ప్రేగ్: ప్రేగ్ మాస్టర్స్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద మరోగేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ఎడిజ్ గురెల్ (టర్కీ)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. నల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 52 ఎత్తుల అనంతరం ప్రత్యర్థితో డ్రాకు అంగీకరించాడు. తొలి రౌండ్‌లో డేవిడ్ నవారా (చెక్)తో గేమ్‌ను కూడా భారత జీఎం డ్రా చేసుకొన్నాడు.

ఉగాది నుంచి 'పీ4'!

- పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యంగా కార్యక్రమం
- అర్హులైన పేదలను గుర్తిస్తున్న ప్రభుత్వం
- ఆర్థికంగా మెరుగ్గా ఉన్న కుటుంబాలతో సాయం
- వచ్చేనెల 2 నాటికి 10 జిల్లాల్లో సర్వే పూర్తి
- 8 నుంచి 18 వరకూ మరో 16 జిల్లాల్లో సర్వే
- 4 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు
- 5,869 కుటుంబాలకు లబ్ధి: సీఎం చంద్రబాబు
- ఆగస్టుకు 5లక్షల కుటుంబాలు పథకం పరిధిలోకి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతిపాదించిన పీ4 కార్యక్రమాన్ని ఉగాది నుంచి ప్రారంభిస్తున్నట్టు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలకు అదనంగా ఈ నూతన విధానాన్ని అమలు చేయనుంది. దీనికి సంబంధించి 'పీ4, కుటుంబ సాధికారత- ప్రయోజనాల నిర్వహణ వ్యవస్థపై సీఎం చంద్రబాబు గురువారం ఉండవల్లి నివాసంలో శాఖాపరమైన సమావేశం నిర్వహించారు. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు ఆర్థికంగా మెరుగ్గా ఉన్న కుటుంబాలు ఆర్థిక చేయూతనివ్వడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రాష్ట్రంలోని నాలుగు గ్రామాల్లో పీ4 విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, దీనిద్వారా 5,869 కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. అర్హత కలిగిన కుటుంబాలను గ్రామ, వార్డు సచివాలయాల్లోని డేటా, కుటుంబ సర్వే, గ్రామసభల ద్వారా ధ్రువీకరిస్తామని వివరించారు. 2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట భూమి ఉన్న భూ యజమానులను, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారిని, 4 చక్రాల వాహనాలు ఉన్నవారు, 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నవారు, మున్సిపల్ ఏరియాలో సొంత ఆస్తి ఉన్నవారు, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలను ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు. 40లక్షల కుటుంబాలు పీ4 విధానంలో లబ్ధిపొందేందుకు అర్హులని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది.

కొనసాగుతున్న కుటుంబ సర్వే

కుటుంబ సర్వే మొదటి దశ కింద 10 జిల్లాల్లో ఫిబ్రవరి 20 నుంచి చేపట్టిన సర్వే మార్చి 2 నాటికి పూర్తవుతుంది. 52 లక్షల కుటుంబాలకుగాను 27 లక్షల కుటుంబాల సర్వే పూర్తయింది. రెండోదశ లో మిగిలిన 16జిల్లాల్లో మార్చి 8నుంచి ప్రారంభించి 18నాటికి పూర్తి చేస్తారు. ఈ 16 జిల్లాల్లో 76 లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఈ పీ4 విధానం అమల్లోకి వచ్చినా ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల జాబితాలో ఎలాంటి మార్పులు ఉండవు. లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తయ్యాక సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫాంలో ఆ కుటుంబాల వివరాలు పొందుపరుస్తారు. ఈ కుటుంబాల మధ్య జరిగే ఆర్థిక కార్యకలాపాల్లో ఎక్కడా ప్రభుత్వ జోక్యం ఉండదు. కుటుంబాలు, వ్యక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు.



పీ4పై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారులు

దాతలను ఎలా గుర్తిస్తారు?

పీ4 పరిధిలోకి వచ్చే పేదల కుటుంబాలను గుర్తిస్తున్న ప్రభుత్వం... దాతలను ఎప్పుడు, ఎలా గుర్తిస్తుందో ఇంకా స్పష్టత లేదు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 5 లక్షల కుటుంబాలను ఈ పథకం పరిధిలోకి తేవాలని లక్ష్యం కూడా పెట్టుకున్నారు. కానీ, మొత్తం సమీక్షలో దాతల గురించి చర్చకు రాలేదని సమాచారం.

'సమృద్ధి బంధనమ్'... ఇదేం భాష?

రాష్ట్ర ప్రభుత్వంలో సమాంతర వ్యవస్థను నడిపిస్తున్న ఉత్తరాది కన్సల్టెంట్ల భాష ఓ పట్టాన అర్థం కావడం లేదు. పీ4 విధానంలో లబ్ధిదారులను, దాతల కుటుంబాలను ఒక్కచోట కలిపేందుకు ఐటీ శాఖ రూపొందించిన వేదికకు సమృద్ధి బంధనమ్ అనే పేరు పెట్టారు. తెలుగు ప్రజల కోసం రూపొందించిన పీ4 పథకంతో పాటు వేదిక పేరు కూడా జనాల్లోకి మాత్రం ఆశించినంతగా వెళ్లడం లేదని చెబుతున్నారు.

స్టీరింగ్, సిగ్నల్ ఒక్కరికే

ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకే పీటీడీ కమిషనర్ పోస్టు

- ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం
- పాలనా వ్యవహారాల్లో ఇబ్బందులు తొలగించేందుకు నిర్ణయం
- ముడుపుల వివాదానికి ముగింపు పలికేలా చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ పాలనా వ్యవహారాల్లో ఇబ్బందులు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావుకే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ (పీటీడీ) కమిషనర్ పదవిని అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆర్టీసీ స్టీరింగ్‌తో పాటు సిగ్నల్ కూడా ఒకే చేతికి వచ్చినట్లయింది. ప్రతి రోజూ 45 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరుస్తూ నెలకు రూ.500 కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీకి ఎండీ అండ్ కమిషనర్ పోస్టులు కీలకం. మూడున్నరేళ్ల ఆ పోస్టులో కొనసాగిన డీజీపీ ర్యాంకు ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమల రావు జనవరి 31న రిటైరయ్యారు. ఆయన్ను ఫిబ్రవరి 1 నుంచి ఏడాది పాటు ఆర్టీసీ ఎండీగా నియమించారు. పీటీడీ కమిషనర్ పదవి ఇవ్వలేదు. కార్పొరేషన్ పరిధిలో బస్సులు, ఆస్తులు ఉండగా.. పీటీడీ పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. దీంతో ఆర్టీసీకి ఎండీతో పాటు పీటీడీ కమిషనర్ పోస్టులో ఒక్కరే ఉంటే.. ఆపరేషన్స్‌కు, అడ్మినిస్ట్రేషన్ ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే రిటైరయిన అధికారి చేతికి అడ్మినిస్ట్రేషన్ అప్పగించడం సరికాదనే వాదనలు నేపథ్యంలో ఎండీ బాధ్యతల వరకే ద్వారకా తిరుమలరావుకు ప్రభుత్వం అప్పగించింది. అడ్మిన్ వ్యవహారాలు చూసుకోవడానికి రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేకి అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఇదే సమయంలో సూపర్ వైజర్ల నుంచి ఈడీ వరకూ సుమారు 118 మందికి పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్స్ కమిటీ(డీపీసీ) జరపాలంటే ప్రతి ఒక్కరూ స్థాయిని బట్టి కనీసం రూ. 30 వేల నుంచి రూ. లక్ష వరకూ ముడుపులు ఇవ్వాలనే ఒత్తిడి పెరిగింది. కొందరు డబ్బు ఇవ్వడానికి సిద్ధం అవగా మరికొందరు ఇవ్వలేమని, ఇంకొందరు పోస్టింగ్స్ ఇచ్చేటప్పుడు ఇస్తామని చెప్పారు. దీంతో పదోన్నతుల ఫైలు ముందుకు కదల్లేదు. విషయం బయటికి పొక్కి పత్రికల్లో వార్తలు రావడంతో ప్రభుత్వం ఆరా తీసింది. ఇదే సమయంలో.. 'స్టీరింగ్ ఒకరికి.. సిగ్నల్ మరొకరికి..' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పాలనా వ్యవహారాల్లో ఇబ్బందులు, పదోన్నతుల్లో ముడుపుల వ్యవహారాలకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెండు పదవులు ద్వారకా తిరుమలరావుకు అప్పగించింది.

రూ.3.24 లక్షల కోట్లతో

నేడే రాష్ట్ర బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

అన్నదాత సుఖీభవ పథకాలకు నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. 'సూపర్ సిక్స్'లో ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలతోపాటు సంక్షేమానికి భారీగా కేటాయింపులు ఉంటాయని... కేంద్ర సహకారంతో వీటిని అమలు చేసేలా పద్దులు రూపొందించారని తెలుస్తోంది. వచ్చే ఏడాది జూన్ 12వ తేదీ నాటికి 5 లక్షల ఇళ్లను పేదలకు కట్టించి ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరేలా అవసరమైన మేరకు నిధులు కేటాయించినట్లు సమాచారం. అమరావతి, పోలవరంతోపాటు... వెలిగొండ, వంశధార, హంద్రీనీవా ప్రాజెక్టులకు బడ్జెట్లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది.

వాస్తవిక అంచనాలతో...

కూటమి సర్కారు ఇప్పటిదాకా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే సరిపుచ్చింది. ఇప్పుడు తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. అధికారంలోకి రాగానే బడ్జెట్ రూపొందించాలని భావించినా... గత ఐదేళ్ల ఆర్థిక విధ్వంసం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టత లేకపోవడంతో అది కుదరలేదు. ఇక... కేంద్రం నుంచి వచ్చే నిధులపైనా తగిన అంచనా లేకపోవడంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదు. ఇప్పుడు... కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన కేటాయింపులు, పన్నుల్లో వాటాలపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో వాస్తవిక అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు చెబుతున్నారు. ఒకే ఏడాదిలో పూర్తిస్థాయిలో అద్భుతాలు సృష్టించలేకపోయినప్పటికీ... జరిగిన విధ్వంసాన్ని చక్కదిద్ది, అభివృద్ధిని గాడిన పెట్టి, సంక్షేమానికి పెద్ద పీట వేసేలా బడ్జెట్ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మాట.

మంత్రివర్గ సమావేశం..

శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే మంత్రివర్గ భేటీలో బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతారు. ఆ తర్వాత 10 గంటలకు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం ప్రారంభమవుతుంది. మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ప్రవేశపెడతారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తికాగానే... వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెడతారు. ఈ ఏడాది వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.50 వేల కోట్ల దాకా ఖర్చు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. అన్నదాత-సుఖీభవ, పంటల బీమా, వడ్డీ లేని - పావలా వడ్డీ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మసేద్యం, ప్రకృతి వ్యవసాయం, ఆయిల్‌పామ్, రాయితీ విత్తనాలు, ఎన్టీఆర్ జలసిరి, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి, వ్యవసాయ సాంకేతిక పథకాలకు ప్రాధాన్యత ఇచ్చి, నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

'పేపర్‌లెస్' బడ్జెట్

ఈ ఏడాది పూర్తిస్థాయి 'ఈ-బడ్జెట్'ను ప్రవేశపెడుతున్నారు. ప్రతి ఏటా బడ్జెట్ పుస్తకాలను రాత్రికి రాత్రి ప్రింట్ చేసి తెల్లవారేసరికి అసెంబ్లీకి తెచ్చేవారు. ఇప్పుడు ఈ సంప్రదాయానికి స్వస్తి పలికారు. సభ్యులందరికీ 'ట్యాబ్'లలోనే బడ్జెట్‌ను లోడ్ చేసిఇస్తారు.

ఉన్నత విద్యలో నాన్-లోకల్ కోటా ఎత్తివేత

తెలంగాణలో ఇకపై సీట్లన్నీ స్థానికులకే

- ఏపీ పునర్విభజన చట్టం పదేళ్ల గడువు పూర్తితో జీవో

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్నత విద్యకు ఇకపై నాన్-లోకల్ క్యాటగిరీ ఉండదు. ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్య కోర్సులతోపాటు.. డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫార్మ్-డి, బిజినెస్, లా, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటి వరకు ఉన్న రిజర్వేషన్లను ప్రభుత్వం సవరించింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పునర్విభజన చట్టం-2013 ప్రకారం.. రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు స్థానికులకు 85%, స్థానికేతరులకు 15% కోటా అమల్లో ఉంది. గత ఏడాది జూన్ 2తో ఆ చట్టంలో విధించిన పదేళ్ల గడువు పూర్తవ్వడంతో మొత్తం సీట్లను స్థానికులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానికేతరుల కోటాను ఎత్తివేశాక మిగిలే 15% సీట్ల భర్తీపై ప్రభుత్వం ఇప్పటికే నిపుణుల కమిటీని నియమించింది. ఉన్నత విద్యపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ కమిటీ నివేదికను అందజేసింది. 15% సీట్లను నాలుగు భాగాలుగా విభజించింది. ఇందులో రాష్ట్ర విద్యార్థులతోపాటు.. తల్లిదండ్రుల కేంద్ర సర్వీసు ఉద్యోగాల కారణంతో ఇతర రాష్ట్రాల్లోచదివిన తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలంది. అయితే.. వీరు పదేళ్లు తెలంగాణలో చదివి ఉండాలనే నిబంధనను విధించింది. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలు, ఉద్యోగుల జీవిత భాగస్వాములనూ 15% కోటాకు అర్హులుగా పరిగణించాలని సూచించింది.

యాడిట్ పెట్టండి.. ఎంత ఖర్చయినా భరిస్తాం!

- సొరంగం నుంచి బయటికెళ్లే ద్వారం ఏర్పాటు చేయండి
- అధికారులకు టీ.మంత్రి ఉత్తమ్‌కుమార్ సూచన
- సహాయక చర్యలపై మంత్రి సమీక్ష

(ఎస్ఎల్‌బీసీ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ఇన్‌లెట్ (దోమలపెంట నుంచి) 14 కిలోమీటర్ల వద్ద యాడిట్ (సొరంగం బయటికి వెళ్లే ద్వారం) పెట్టడానికి చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. అందుకు ఎంత ఖర్చయినా భరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గురువారం సహాయక చర్యలు పరిశీలించడానికి వెళ్లిన ఆయన దోమలపెంటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నేషనల్ జియో ఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)తో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)కి చెందిన నిపుణులు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని గుర్తించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారని రెవెన్యూ(విపత్తులు) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ మంత్రికి నివేదించారు. ప్రతి షిఫ్టులో 20 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఇన్‌లెట్ నుంచి 14 కిలోమీటర్ల వద్ద ఒక యాడిట్ పెడితే.. ముున్ముందు సహాయక చర్యలు, టన్నెలింగ్ పనులు, నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందని అర్వింద్‌కుమార్ గుర్తు చేయగా.. తగిన అనుమతి తీసుకొని పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. సహాయక పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. సహాయక చర్యలకు అడ్డంగా ఉన్న వస్తువులను తొలగించడానికి రైల్వే నుంచి ప్లాస్మా కటింగ్ మిషన్, బ్రోకో కటింగ్ మిషన్, అల్ట్రా థర్మిక్ కటింగ్ మిషన్లు వినియోగిస్తున్నామని మంత్రికి అధికారులు నివేదించారు. గురువారం ఉదయం వెళ్లగానే అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. మళ్లీ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వచ్చే క్రమంలో సహాయక చర్యలపై ఆరా తీశారు. సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రదేశం కచ్చితంగా ఎక్కడ ఉంది? చిక్కుకున్నవారు ఎక్కడ ఉన్నారనే వివరాలు కనుక్కోవడానికి వీలుగా గ్రౌండ్ పినట్రేటింగ్ రాడార్ యంత్రాన్ని పంపించారు. ఈ యంత్రం గురువారం రాత్రికల్లా వివరాలతో బయటికి రానుందని అధికారులు చెబుతున్నారు.

ఎస్ఎల్‌బీసీ ప్రత్యామ్నాయ ప్రణాళిక

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు ముందుకు సాగుతాయా, లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త టీబీఎం అంటే నిర్మాణ సంస్థకు భారం కావడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రాజెక్టు అంచనా వ్యయాలను పెంచాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు 18 సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దాన్ని ప్రభుత్వం ముందు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్ఏ సూచనలతో పాటు కంపెనీ చైర్మన్ పర్యటన సందర్భంగా ఇంజనీర్లు ఈ ప్రాజెక్టు పూర్తికి ఒక ప్రత్యామ్నాయ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం టన్నెల్ బోరింగ్ మిషన్ ద్వారా సొరంగం పనులు నడుస్తున్నాయి. ప్రస్తుత ప్రమాదం 13.900 కిలోమీటర్ల వద్ద జరగ్గా.. 13.500 కిలోమీటర్ వరకు బాగానే ఉన్నది. అక్కడి నుంచి 50 మీటర్లు కుడివైపునకు తిరిగి పాత లెవల్‌ను కొనసాగిస్తూ 20వ కిలోమీటర్ వద్ద పాత అలైన్‌మెంట్‌కు టన్నెల్‌ను కలపనున్నారు.



విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో ఓటు వేసేందుకు బారులుదీరిన గ్రాడ్యుయేట్లు





విజయవాడ పోరంకి జెడ్‌పీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద భారీ క్యూల్లో పట్టభద్ర ఓటర్లు, ఓటు హక్కు వినియోగించుకుంటున్న టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా

పోటెత్తిన టీచర్లు

(మొదటి పేజీ తరువాయి)

దాడికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఇరువర్గాలు శాంతించాయి. ఏ కొండూరులోని ఎంపీపీ స్కూల్ పోలింగ్ కేంద్రం దగ్గర ఉపాధ్యాయులు, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. పోలీసులు సమూహాన్ని చెల్లాచెదురు చేశారు. ఇబ్రహీంపట్నంలో పాటిబండ్ల జ్ఞాన దీప్తి అనే మహిళ తన ఓటును మరొకరు వేశారంటూ ఫిర్యాదు చేశారు. టెండర్ ఓటు అడిగారు. ఎన్నికల అధికారి టెండర్ ఓటుకు అనుమతించారు.

ఓటర్లకు డబ్బులు పంపిణీ... కలకలం రేపిన వీడియో

పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఎమ్మెల్సీ ఓటర్లకు డబ్బులు పంచుతున్న వీడియో బయటకు రావడంతో కలకలం చెలరేగింది. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడకు సమీపంలోని మునిసిపల్ కల్యాణ మండపం సమీపంలో టీడీపీ నేత ఒకరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి తరఫున ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు డబ్బులు పంచారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రయాణం ఖర్చుల పేరుతో డబ్బులు పంచుతున్న వీడియోలను పీడీఎఫ్ అభ్యర్థి మద్దతుదారులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అధికారులకూ ఫిర్యాదు చేశారు. తహశీల్దారు గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లగా... అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుతిరిగారు. టీడీపీ నేతలు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం: సీఎం

తాడేపల్లి, తెనాలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని, అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని మండల పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు హక్కును తనయుడు లోకేశ్‌తో కలిసి చంద్రబాబు వినియోగించుకున్నారు. తొలుత ఉండవల్లి నివాసం నుంచి కాన్వాయ్‌లో వచ్చిన ఆయన నిబంధనల ప్రకారం 200 మీటర్ల దూరంలో కారు దిగి మంత్రి లోకేశ్‌తో కలిసి నడుచుకుంటూ పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. రోడ్డు వెంట ఉన్న ఇళ్లలోని వారిని ఆప్యాయంగా పలకరించుకుంటూ అడిగిన వారితో ఫొటోలు దిగుతూ ఓటు వేసి వచ్చారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ అభిప్రాయాలను తెలపడానికి, ప్రజాస్వామ్యాన్ని చైతన్య పరచడానికి ఓటు ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, దేశ ప్రతిష్ఠకు ఓటు బలంగా పని చేస్తుందని చంద్రబాబు అన్నారు.

తెనాలిలో ఓటేసిన పెమ్మసాని

కృష్ణా గుంటూరు ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానానికి జరిగిన పోలింగ్ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లా తెనాలిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులంతా బిజీ షెడ్యూల్‌లో ఉన్నా, ఓటు ప్రాధాన్యం, అభివృద్ధికి బాటలు వేయాలనే ఆలోచనతోనే ఓటు వేసేందుకు వచ్చానని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రానున్న ఆరేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి ఊతవిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రత్యర్థులు ఎవరైనా పట్టభద్రుల ఓటు ప్రగతికే: ఆలపాటి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థులెవరనేది ఓటర్లు పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతికే ఓటేశారని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. 68 శాతం ఓటింగ్ జరగడంపై హర్షం వెలిబుచ్చారు. చంద్రబాబుది ప్రజాపాలన కాబట్టే పట్టభద్రులు తమకు గెలుపునందించబోతున్నారన్నారు. ఎన్నికల్లో సహకరించిన కూటమి నేతలకు ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

ఓటమి భయంతో కూటమి నేతల అక్రమాలు

- అధికార దుర్వినియోగం, బూత్‌ల ఆక్రమణ
- పలుచోట్ల పీడీఎఫ్ ఏజెంట్లను తరిమేశారు
- భారీగా దొంగ ఓట్లు.. సీఈవోకు ఫిర్యాదు చేస్తాం
- పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించారని, అనేక చోట్ల పీడీఎఫ్ తరఫున ఏజెంట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. గుంటూరు యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లా బెల్లంకొండ, దుర్గి తదితర ప్రాంతాల్లో కూటమి నేతలు పీడీఎఫ్ ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేశారని, కొన్నిచోట్ల ఎదురు కేసులు పెట్టించారని అన్నారు. అధికార పార్టీ నాయకులు ఒక ప్రణాళిక ప్రకారం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఇలాంటి అక్రమాలకు తెరతీశారన్నారు. తెనాలి, పెదకూరపాడు, అమరావతి, తదితర ప్రాంతాల్లో భారీగా ఓటింగ్ జరిగిందని, కొన్నిచోట్ల 90 శాతం ఓటింగ్ నమోదయిందని.. దీనికి కారణం దొంగ ఓట్లు పోల్ కావడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలోని ఆర్‌వీఎస్ స్కూల్ పోలింగ్ బూత్‌లో పీడీఎఫ్ ఏజెంట్‌పై తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేయించారని అన్నారు. కూటమి అభ్యర్థులు పోలింగ్ బూత్‌ల సమీపంలో టెంట్లు వేసుకుని స్లిప్‌లు పంచే నెపంతో వందల సంఖ్యలో చేరి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని, పీడీఎఫ్ తరఫున ఉన్న టెంట్లు తొలగించి దౌర్జన్యం చేశారని లక్ష్మణరావు ఆరోపించారు.




మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ బీ ప్రతినిధులు

నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ

- స్కిల్ బీతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసిస్తున్న వారికి ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ.. స్కిల్ బీ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గురువారం ఈమేరకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జర్మనీలోని ఆసుపత్రులు, వృద్ధుల సంరక్షణకు మూడు లక్షల మంది నర్సింగ్ సిబ్బంది అవసరం ఉందని, ఈ అవకాశాన్ని రాష్ట్ర విద్యార్థులు అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. స్కిల్ బీ ఇండియా వ్యవస్థాపకుడు వింజమూరి రవిచంద్ర గౌతమ్, సీఈవో ఉజ్వల్ చౌహాన్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 10వేల మందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కాలేజీలు, గోదావరి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నాలుగు వేల మందికి జర్మన్ భాషపై శిక్షణ ఇస్తామన్నారు.

గీతం వర్సిటీలో కెరీర్ ఫెయిర్.. 10 వేల కొలువులు



కెరీర్ ఫెయిర్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో మార్చి 5,6 తేదీల్లో నిర్వహించనున్న కెరీర్ ఫెయిర్ పోస్టర్‌ను మంత్రి నారా లోకేశ్ గురువారం మంగళగిరిలో ఆవిష్కరించారు. నాస్కామ్, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నాయి. 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ ఫెయిర్ ద్వారా సుమారు 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పోస్టర్ ఆవిష్కరణలో నాస్కామ్ ప్రతినిధులు ఉష్మిత్‌సింగ్, ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌కుమార్, సునీల్ పాల్గొన్నారు.

వైసీపీకి ప్రతిపక్ష హోదాను ప్రజలే తిరస్కరించారు

- ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం సిగ్గుచేటు: పల్లా

గాజువాక, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పిన మాజీ సీఎం జగన్, కేవలం పది నిమిషాలపాటు అసెంబ్లీలో డ్రామా ఆడి వెళ్లిపోయారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. గాజువాకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతకు, రాజకీయ పక్ష నేతకు కేవలం ప్రొటోకాల్, విమాన టికెట్లలో మాత్రమే తేడా ఉంటుందని, మిగిలినవన్నీ సమానమేనన్నారు. ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా తిరస్కరించారని వ్యాఖ్యానించారు. తప్పు చేస్తే ప్రశ్నించాలే తప్ప ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షం ఉన్నా లేకున్నా అసెంబ్లీని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మంచి జరిగేలా చూస్తామని చెప్పారు. ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నన్ను అరెస్టు చేశారు రాజా...!

- స్టేషన్ ముందు జనాన్ని ఉద్దేశించి పోసాని
- అన్నమయ్య ఎస్పీ పర్యవేక్షణలో ఏడు గంటలపాటు విచారణ
- రైల్వేకోడూరు కోర్టులో హాజరు.. పోసాని తరపున పొన్నవోలు వాదనలు



గురువారం రాత్రి 9 గంటలకు పోసాని కృష్ణమురళిని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

రాయచోటి/రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'నన్ను అరెస్టు చేశారు.. రాజా..!' సినీనటుడు పోసాని కృష్ణమురళి గురువారం ఉదయం అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లోకి వెళుతూ బయట ఉన్న జనంతో అన్న మాటలివీ! వైసీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ సహా అనేకమందిని అసభ్య పదజాలంతో దూషించిన వ్యవహారంలో పోసానిని బుధవారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యల ద్వారా చిత్రపరిశ్రమలో విభేదాలు సృష్టించారంటూ ఆయనపై ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ కోసం ఆయనను హైదరాబాద్ నుంచి ఇక్కడకు తీసుకొస్తున్నారన్న సమాచారంతో, వైసీపీ నాయకులు, కార్యకర్తలే కాకుండా జనం కూడా పెద్ద ఎత్తున పోలీసుస్టేషన్ వద్ద గుమికూడారు. వారిని ఉద్దేశించి పోసాని పై వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ గురుమహేశ్ పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించారు. భుజం నొప్పి, గుండె సంబంధిత సమస్యల కారణంగా మందులు తీసుకుంటున్నట్లు గుర్తించారు. కాగా, పోసానిని బుధవారం అర్ధరాత్రికి కర్నూలులోని బెటాలియన్‌కు తరలించారు.

'నేను చేసింది తప్పే'

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షణలో పోసానిని ఏడు గంటలపాటు విచారించారు. ఎస్పీ నిర్దేశంలో ఇద్దరు సీఐలు ప్రశ్నలవర్షం కురిపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లను ఎందుకు అసభ్యకరంగా తిట్టారు? ఎవరు చెబితే తిట్టారు? ఎవరైనా ముందుగా స్క్రిప్ట్ రాసి ఇచ్చారా? ఇలా తిట్టడం వెనుక.. ఇంకా ఎవరి హస్తం ఉంది.? వంటి అనేక ప్రశ్నలు పోసానిని అడిగినట్లు సమాచారం. ఇందుకు ఆయన స్పందిస్తూ... 'నన్ను ఎవరూ ప్రేరేపించలేదు. ఎవరూ నాకు చెప్పలేదు. నేనే స్వయంగా మాట్లాడాను. అలా మాట్లాడటం తప్పే' అని పోసాని అన్నట్లు తెలిసింది. ఎస్పీ 17 ప్రశ్నలు వేయగా, ఎక్కువగా నాకు తెలియదు.. గుర్తు లేదని తెలిపినట్లు సమాచారం. ఈ సమయంలో అప్పటి వీడియోలు చూపించగా, 'లవ్ యూ రాజా' అంటూ పొంతనలేని వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. విచారణ అనంతరం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పోసానిని రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరచారు. పోసాని తరఫున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా, ప్రజలు, జనసేన కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా నోటికొచ్చినట్లు పోసాని మాట్లాడడం వల్లే ఆయనపై కేసు పెట్టినట్లు ఫిర్యాదుదారు చెన్నరాజుపోడు మాజీ సర్పంచ్ మణి తెలిపారు. టీడీపీ, జనసేన నాయకుల తల్లి, భార్య, బిడ్డల గురించీ ఇష్టమొచ్చినట్లు అసభ్యంగా మాట్లాడారని అన్నారు.



సర్కస్ ఫీట్లు కావు..!

ట్రిపుల్ రైడింగ్‌పై పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.. అంతకు మించి అన్నట్లు ఒక్కో బైకుపై ఐదారుగురు దూసుకుపోతున్నారు!! శివరాత్రి జాగరణ సందర్భంగా స్కూళ్లకు లోకల్ హాలిడే కూడా ప్రకటించడంతో.. గురువారం ఉదయం సముద్ర స్నానాల కోసం విశాఖలో ఇలా పిల్లా పాపలతో ఒక్కో బైక్‌పై ఐదారుగురు ప్రయాణించడం సర్కస్ ఫీట్‌ను తలపించింది. పోలీసులు కూడా.. పోనీలే పాపం అని వదిలేయొచ్చు..!! కానీ.. ఏదైనా ప్రమాదం జరిగితే..??.. ఊహించడానికే గగుర్పాటుగా ఉంది కదూ!!.. ఆర్కే బీచ్‌కు వెళ్లే మార్గంలో సిరిపురం కూడలిలో కనిపించాయీ 'సిత్రాలు'!

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం





'కిడ్నాప్' కార్లు ఎక్కడివి?

- అరెస్టు తర్వాత మీ ఫోన్లు ఎక్కడ?
- వంశీపై పోలీసుల ప్రశ్నలవర్షం
- ముగిసిన మాజీ ఎమ్మెల్యే విచారణ
- మూడు రోజుల్లో 71 ప్రశ్నలు
- కొన్నింటికే జవాబు ఇచ్చిన వంశీ
- అవీ తప్పులేనంటున్న పోలీసులు!
- తిరిగి కస్టడీకి కోరాలని నిర్ణయం

విజయవాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారు ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి కిడ్నాప్ చేసిన కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాత పాటే పాడారు. తనకు ఏమీ తెలియదని, గుర్తులేదని సమాధానాలు ఇచ్చారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు చూపించినా అవే జవాబులు ఇచ్చారు. వంశీతోపాటు మరో ఇద్దరు నిందితులు వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మీపతి మూడు రోజుల కస్టడీ గురువారంతో ముగిసింది. చివరిరోజు విచారణలో భాగంగా విచారణాధికారి దామోదర్ 16 ప్రశ్నలను వంశీకి సంధించారు. సత్యవర్ధన్‌ను విజయవాడ కోర్టుకు తీసుకురావడం, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లడం, హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు తీసుకెళ్లడానికి ఉపయోగించిన కార్లు ఎవరివని పోలీసులు ప్రశ్నించారు. ఆ కారులతో తనకు ఎలాంటి సంబంధం లేదని వంశీ బదులిచ్చారని తెలిసింది. అరెస్టు కావడానికి ముందుదాకా చేతుల్లో ఉన్న ఫోన్లు ఇప్పుడు ఎక్కడున్నాయని అడగగా, ఆయన అవి ఎక్కడ ఉన్నాయో తెలియదు అని ఇప్పటిదాకా చెబుతూ వచ్చారు. అయితే, ఈసారి దానికి భిన్నంగా... 'నా ఫోన్లు పోలీసుల వద్దే ఉన్నాయి. అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులలో ఒకరికి తన ఫోన్ ఇచ్చాను' అని ఆయన చెప్పినట్లు తెలిసింది. కాగా, మూడు రోజుల విచారణలో పోలీసులు మొత్తం 71 ప్రశ్నలు వేశారు. వాటిలో చాలా తక్కువ ప్రశ్నలకు మాత్రమే ఆయన జవాబులు ఇచ్చాడు. అయితే, ఈ జవాబులూ తప్పులేనని విచారణాధికారులు భావిస్తున్నారు. విచారణలో మరో నిందితుడు నిమ్మ లక్ష్మీపతి మాత్రం సత్యవర్ధన్ ఎపిసోడ్‌కు కర్త, కర్మ, క్రియ వంశీయేనని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. 'మీరు చెబితేనే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశా'మని లక్ష్మీపతి అంగీకరించారని వంశీకి చెప్పగా.. లక్ష్మీపతి ఎవరో తనకు తెలియదన్నారు. తాను ఎవరికీ ఎలాంటి ప్రణాళికలు ఇవ్వలేదన్నారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నట్టుగా వివిధ సీసీ కెమెరాల ఫుటేజీలను చూపించి ప్రశ్నించినా, వాటితో తనకు సంబంధం లేదని వంశీ జవాబులు చెప్పారు. దీంతో ఆయనను మరోసారి కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పిటిషన్‌ను పటమట పోలీసులు సిద్ధం చేస్తున్నారు. విచారణ ముగిసిన తర్వాత వంశీతోపాటు ఇద్దరు నిందితులను పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత న్యాయస్థానానికి తీసుకెళ్లారు. ఈ కేసును విచారించే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల న్యాయస్థానం న్యాయాధికారి హిమబిందు సెలవులో ఉండడంతో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో వారిని హాజరుపరిచారు. న్యాయాధికారి సత్యానంద్ విచారణలో ఏమైనా ఇబ్బంది పెట్టారా అని ప్రశ్నించారు. దీనిపై వంశీ స్పందిస్తూ, అర్థంపర్థం లేని ప్రశ్నలు వేసి వేధించారన్నారు. "జైలులో నన్ను ఒంటరిగా ఉంచుతున్నారు. నాకు ఆస్తమా సమస్య ఉంది. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఇబ్బందిగా ఉంటుంది. ఐదు, పదిమంది ఖైదీలు ఉంటే సెల్‌లో పెట్టండి" అని కోరారు. ఆయన తరఫున తానికొండ చిరంజీవి, సత్యశ్రీ వాదనలు వినిపించారు. వంశీని భద్రత దృష్ట్యా ప్రత్యేక సెల్‌లో ఉంచామని పీపీ కల్యాణి వాదించారు. వంశీ సెల్ వద్ద ప్రత్యేకంగా ఒక వార్డెన్‌ను నియమించాలని ఆదేశించారు. సెల్ మార్పాలన్న అంశంపై పిటిషన్‌ను రెగ్యులర్ కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించారు. అనంతరం వంశీని జైలుకు తరలించారు. కాగా, సత్యవర్ధన్ కిడ్నాప్‌లో ఘంటా వీర్రాజు(ఏ4), వేలూరి వంశీబాబు (ఏ10)లను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారిని పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు.



జగన్‌ను వంశీ కలిశారు: విచారణాధికారి

విచారణలో చాలా ప్రశ్నలకు వంశీ సమాధానాలు చెప్పలేదని విచారణాధికారి దామోదర్ చెప్పారు. "సత్యవర్ధన్‌ను బెదిరించి, భయపెట్టి కేసును తారుమారు చేయాలని చూశారు. వంశీ, ఆయన అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్టు ఆధారాలున్నాయి. ఫోన్ గురించి అడిగినా తెలియదన్నారు. ఈ నెల 12న హైదరాబాద్ నుంచి వచ్చి మాజీ సీఎం జగన్‌ను కలిసినట్టు వంశీ అంగీకరించారు. మాకు పూర్తి సమాచారం రావాల్సి ఉంది. మరోసారి వంశీ కస్టడీ కావాలని పిటిషన్ వేస్తాం. ఒంటరి బ్యారక్‌లో కాకుండా, అందరితో కలిపి ఉంచాలని ఆయన అడిగారు. కేసులో ఇతర నిందితుల కస్టడీ కోరుతూ పిటిషన్ వేశాం" అని దామోదర్ తెలిపారు.

నా భర్తను ఇబ్బంది పెట్టారు: పంకజశ్రీ

కోర్టు ఇచ్చిన మూడు రోజుల కస్టడీలో పోలీసులు అర్థంపర్థం లేని ప్రశ్నలతో వంశీని ఇబ్బంది పెట్టారని ఆయన సతీమణి పంకజశ్రీ ఆరోపించారు. పోలీసులు ఆయనను విసిగించారని, జైలులో ఆరోగ్యపరమైన సమస్యలతో వంశీ బాధపడుతున్నారన్నారు. కాగా, కోర్టు వద్ద వంశీని ఆయన కుటుంబ సభ్యులు కలిశారు. భార్య పంకజశ్రీ, కుమారుడు, కుమార్తె ఆయనను కలిసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

5న విచారణకు రండి

- గోరంట్ల మాధవ్‌కు బెజవాడ పోలీసుల నోటీసులు
- పోక్సో కేసులో బాధితుల పేర్లు వెల్లడించారంటూ గత ఏడాది వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు



అనంతపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోక్సో కేసులో బాధితుల వివరాలను మీడియా సమావేశంలో ఆయన బహిరంగంగా వెల్లడించారంటూ రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ గత ఏడాది నవంబరు 2న ఫిర్యాదు చేశారు. దీంతో మాధవ్‌పై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు బీఎన్ఎస్ 72, 79 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి వారు అనంతపురం వచ్చి మాధవ్ నివాసానికి వెళ్లారు. ఈ కేసులో మార్చి 5న విజయవాడలో విచారణకు రావాలని సూచించారు. విజయవాడ పోలీసులు ఆయన ఇంటికి వచ్చారని, అరెస్టు చేయబోతున్నారని ప్రచారం జరగడంతో మాధవ్ అనుచరులు, వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. అయితే పోలీసులు నోటీసులు మాత్రమే ఇచ్చి వెళ్లిపోయారు. కాగా.. పోలీసుల నుంచి నోటీసులు అందుకున్న మాధవ్ మీడియాపై నోటి దురుసు ప్రదర్శించారు. 'పోలీసు ఆఫీసర్‌గా పనిచేశారు కదా..! పోక్సో కేసులో బాధితుల పేర్లు బయటకు చెప్పకూడదనే విషయం తెలియదా..' అని విలేకరులు ప్రశ్నించడంతో ఆయన వారిపై ఆవేశంతో ఊగిపోయారు. 'మీది ఏ టీవీ..? ఏ మీడియా..? ఏ పత్రిక..' అంటూ చిందులు వేశారు. తర్వాత నోటీసులపై స్పందిస్తూ... తన న్యాయవాదులతో చర్చించి.. మార్చి 5న విచారణకు వెళ్లాలో లేదో నిర్ణయించుకుంటానని తెలిపారు. ఆ రోజు తనకెలాంటి కార్యక్రమాలూ లేకపోతే విచారణకు హాజరవుతానని, లేదంటే గడువు కోరతానని చెప్పారు.

బూతులు.. నీతులు!

(మొదటి పేజీ తరువాయి)

ఎంత మందిపై తప్పుడు కేసులు పెట్టారో, ఎన్ని రకాలుగా వేధించారో లెక్కే లేదు! ఇప్పుడు అదే జగన్... అన్ని సాక్ష్యాలు, ఆధారాలు ఉన్న కేసుల్లో ఒకరిద్దరు అది కూడా ఓ మోస్తరు నాయకులను అరెస్టు చేయగానే 'అన్యాయం, అక్రమం' అని వాపోతున్నారు. నిజానికి... వైసీపీ హయాంలో అరాచకాలకు సంబంధించి పెద్ద నాయకులపై చర్యలే తీసుకోలేదు. టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడికి సూత్రధారులుగా పోలీసులు నిర్ధారించిన జోగి రమేశ్, దేవినేని అవినాశ్‌లకు ముందస్తు బెయిలు లభించింది. వైసీపీ హయాంలోలాగా వారిని పోలీసులు అర్ధరాత్రి గోడలు, గేట్లు దూకి అరెస్టు చేసి ఉంటే... ఇలాంటి ఉపశమనం లభించేది కాదేమో! ఇప్పుడు వల్లభనేని వంశీని అరెస్టు చేసింది నియోజకవర్గ పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కాదు! ఆ దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి ఫిర్యాదు వాపసు తీసుకునేలా చేశారనే ఈ అరెస్టు! దీనికి పోలీసులు అన్ని ఆధారాలను సమర్పించారు. సోషల్ మీడియాలో అడ్డదిడ్డంగా బూతులు ప్రయోగించిన వర్రా రవీందర్ రెడ్డి వంటి కొందరిపైనే ఇప్పుడు చర్యలు మొదలయ్యాయి. అసలు వాళ్లను వదిలేసి చోటామోటా వాళ్లను పట్టుకుంటున్నారేంటంటూ టీడీపీ శ్రేణులు ఆక్రోశిస్తున్నా... ప్రభుత్వం తొందరపడి కక్ష సాధింపులకు దిగడంలేదు. అయినా సరే... రెడ్ బుక్ రాజ్యాంగం అని జగన్, ఆయన రోత పత్రిక వాపోతుండటమే విచిత్రం! నంద్యాలలో మైనార్టీ కుటుంబం సామూహిక ఆత్మహత్య నుంచి కాకినాడలో దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేయడం వరకూ... రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అరాచకాలు ఏ 'రాజ్యాంగం' ప్రకారం చెల్లుబాటు అయ్యాయో జగనే చెప్పాలి!

ఇదేమి 'రాజ్యాంగం'?

- విశాఖపట్నంలో విష వాయువులు లీకై పన్నెండు మంది ప్రాణాలు కోల్పోయి, 450మంది అస్వస్థతకు గురైతే ఆవేదనతో తన స్నేహితురాలు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టును గుంటూరుకు చెందిన రంగనాయకమ్మ అనే 66 ఏళ్ల వృద్ధురాలు రీపోస్టు చేశారు. అందులో అసభ్యకరమైన, అభ్యంతరకరమైన అక్షరం ఒక్కటీ లేదు. అయినా...ఆమెపై దేశద్రోహం కేసు పెట్టారు. ఇదేమి రాజ్యాంగమో జగన్ చెప్పాలి కదా!
- కరోనా సమయంలో మాస్కులు, గ్లౌజులు లేవన్న పాపానికి దళితుడైన వైద్యుడు సుధాకర్‌ను నడిరోడ్డుపై రెక్కలు విరిచి, చితకబాది చివరికి ఆయన్ను చావుదాకా తీసుకెళ్లారు.
- గన్నవరం విమానాశ్రయంలో అప్పటి ప్రభుత్వ పెద్దలకు బాగా కావాల్సిన మహిళ వద్ద పట్టుబడిన బంగారం ఒక కీలకమైన వ్యక్తికి చెందినదే అని సోషల్ మీడియాలో వచ్చిన వార్తను పంచుకున్న 75ఏళ్ల సీనియర్ జర్నలిస్టు కొల్లు అంకబాబును అర్ధరాత్రి ఇంటికెళ్లి అరెస్టు చేశారు. ఆపరేషన్ చేయించుకున్నానని వేడుకున్నా వినకుండా లాక్కెళ్లారు.
- జగన్ రెడ్డి పనితీరును ప్రశ్నించిన అప్పటి ఎంపీ రఘురామకృష్ణ రాజును ఆయన పుట్టిన రోజునే హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. కస్టడీలో ఆయనను తీవ్రంగా హింసించినట్లు నిర్ధారణ అయ్యింది.
- ఆపరేషన్ చేయించుకుని, నిజంగా విశ్రాంతి అవసరమైన అచ్చెన్నాయుడును రాష్ట్రానికి ఆ చివర ఉన్న టెక్కలిలో అరెస్టు చేసి... రక్తమోడుతున్నా వదలకుండా వందల కిలోమీటర్ల దూరంలోని గుంటూరుకు రోడ్డు మార్గంలో తరలించారు.
- 'నేను రేపు చంద్రబాబు ఇంటిపై దాడి చేయబోతున్నా' అని ఒక రోజు ముందే సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన జోగి రమేశ్‌ను అడ్డుకున్న పోలీసులే లేరు!
- పట్టపగలు డీజీపీ ఆఫీసు పక్కన టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై వందల మంది విధ్వంసం సృష్టిస్తే కనీసం ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు.

పోసాని రైటు.. పట్టాభి రాంగా?

అప్పట్లో జగన్‌ను టీడీపీ నేత పట్టాభి అనకూడని మాటలు అన్నారంటూ ఆయన ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. మహిళలు, చిన్న పిల్లలను భయభ్రాంతులకు గురి చేశారు. కానీ... అప్పట్లోనే వైసీపీ నాయకుడిగా ఉన్న పోసాని కృష్ణ మురళి జనసేన అధిపతి పవన్ కల్యాణ్‌ను మైకుల ముందే పచ్చిబూతులు తిట్టారు. పట్టాభి ఇంటిపై దాడిని ఎంచక్కా సమర్థించుకున్న జగన్... పోసానిని మాత్రం నిలువరించలేదు. పైగా... 'పోసాని చేసినవి సాధారణ వ్యాఖ్యలు. ఆ మాత్రానికే కేసులు, అరెస్టా' అని జగన్ పత్రిక వాపోవడం విశేషం.

వీళ్లను వదిలేశారు కదా?

- అత్యంత జుగుప్సాకర భాష వాడుతూ ప్రతిపక్ష నేతలను దూషిస్తూ వీడియోలు పోస్టు చేస్తూ.. జగన్‌ను కీర్తించే నటి శ్రీరెడ్డికి ఆయన పూర్తి స్వేచ్ఛనిచ్చారు.
- వైసీపీ సర్కారు అడ్డగోలు నిర్ణయాలకు కోర్టుల్లో చుక్కెదురు అవుతుండటంతో... 'హైకోర్టు న్యాయమూర్తులను కరోనా రోగుల వార్డులో వేయాలి' అని సోషల్ మీడియాలో దూషించిన వాళ్లను, జడ్జిలను వ్యక్తిగతంగా తిట్టిన వాళ్లనూ జగన్ వదిలేశారు. సోషల్ మీడియాలో ఆ పోస్టులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేసినా దిక్కులేదు.
- దేశవ్యాప్తంగా అనేక కేసుల్లో నిందితులకు సీబీఐ చుక్కలు చూపిస్తుండగా... వివేకా హత్య కేసులో దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపైనే కడప జిల్లాలో పోలీసులు కేసులు పెట్టారు.
- హైదరాబాద్‌లో కూర్చుని టీడీపీ, జనసేన నేతలపై ఇష్టానుసారం నోరు పారేసుకున్న సినీ దర్శకుడు ఆర్జీవీని జగన్ 'ప్రత్యేక అతిథి'లా గౌరవించారు. 'వ్యూహం' సినిమాకు సర్కారు డబ్బు దోచిపెట్టారు.

బూతులు మాట్లాడితే సుద్దులంటారా?

- పోసానికి జగన్ మద్దతు.. ఆయన సతీమణికి ఫోన్
- నాడు బాబు, పవన్, లోకేశ్‌పై పోసాని దారుణ తిట్లు
- మహిళలపై హేయమైన వ్యాఖ్యలు
- ఖండించని జగన్.. కానుకగా ఎఫ్‌డీసీ చైర్మన్ పదవి
- నేడు అరెస్ట్ చేయగానే గగ్గోలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఏ పార్టీలోనైనా ఏ కార్యకర్త/నాయకుడైనా మహిళల గురించి అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే వారిస్తారు. హద్దులు దాటిన వారిపై చర్యలు కూడా తీసుకుంటారు. కానీ వైసీపీ అధినేత జగన్ మాత్రం అంతా 'రివర్స్'! ప్రతిపక్ష నాయకులతో పాటు రాజకీయాలతో సంబంధం లేని ఇంట్లో మహిళలను ఆ పార్టీ నేతలు వ్యక్తిత్వ హననం చేసేలా ఎన్ని దూషణలు చేసినా నాడు ఖండించలేదు. పైగా కానుకగా పదవులు కట్టబెట్టి అందలం ఎక్కించారు. ఇప్పుడు వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంటే అక్రమమంటూ ఆక్రోశిస్తున్నారు. పచ్చి బూతులు మాట్లాడిన వారికి మద్దతు ప్రకటించారు. తాజాగా సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఉదంతమే ఇందుకు ఉదాహరణ. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన ఇంట్లోని మహిళల గురించి నాడు పోసాని అనరాని మాటలు అన్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న జగన్ అండతో రెచ్చిపోయి, ప్రెస్‌మీట్లు పెట్టి మరీ దారుణమైన దూషణలు చేశారు. మహిళలపై జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడం తప్పని ఏనాడూ పోసానిని జగన్ మందలించలేదు. ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కానుకగా ఆయనకు ఎఫ్‌డీసీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. తాజాగా అన్నమయ్య జిల్లా పోలీసులు ఇదే కేసులో పోసానిని అరెస్ట్ చేయగానే, 'నేనున్నానంటూ' జగన్ ఆయనకు భరోసా ఇస్తున్నారు. పైగా 'దేవుడు అంతా చూస్తున్నాడు' అని నీతులు చెబుతున్నారు. విలువలు, విశ్వసనీయత అంటూ పెద్ద పెద్ద పదాలు వల్లె వేసే జగన్ దృష్టిలో.. మహిళలను నాగరిక సమాజం వినరాని బూతులు తిట్టడం నైతికతా..? అలాంటి వారిని అరెస్ట్ చేయడం అక్రమమా..? జగన్ తీరుపై మహిళలు, సాధారణ ప్రజలు, రాజకీయ విశ్లేషకులతో పాటు ఆయన పార్టీ శ్రేణులు కూడా విస్తుపోతున్నారు.

నోరు తెరిస్తే బూతులు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోసాని నోరు తెరిస్తే పచ్చి బూతులే. పవన్‌తో పాటు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, లోకేశ్ గురించి పలుమార్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో కూర్చొని పవన్ కల్యాణ్‌పై అత్యంత జుగుప్సాకరంగా బూతులు మాట్లాడారు. పవన్ ఇంట్లో అభం శుభం ఎరుగని మహిళల ఆత్మగౌరవాన్ని మంటగలిపేలా పోసాని మాట్లాడారు. పిల్లల పుట్టుకపైనా అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేశారు.

దేవుడు అంతా చూస్తున్నాడు

- ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం
- పోసాని భార్యకు జగన్ భరోసా

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన ఇంట్లో మహిళలపై అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేసిన కేసులో సినీనటుడు పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేయడాన్ని వైసీపీ అధినేత జగన్ ఖండించారు. 'దేవుడు అంతా చూస్తున్నాడు. ధైర్యంగా ఉండండి. మేం అందరం తోడుగా ఉంటాం' అని పోసాని భార్య కుసుమలతకు ధైర్యం చెప్పారు. గురువారం జగన్ ఆమెకు ఫోన్ చేసి పరామర్శించారు. అడ్వకేట్ పొన్నవోలు సుధాకరరెడ్డి తదితరులను రాజంపేటకు పంపించామని, నాయకులు కోర్టు వద్దకు వస్తారని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన ఎక్కువ రోజులు కొనసాగదన్నారు

ఉదయాన్నే బార్లు బార్లా..!

- కొన్నిచోట్ల 24 గంటలూ అమ్మకాలు
- విచ్చలవిడిగా పనివేళల ఉల్లంఘన
- పట్టించుకోని టాస్క్‌ఫోర్స్ విభాగం
- మద్యం షాపులకు, ప్రభుత్వానికి నష్టం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు నిర్దిష్టమైన పనివేళలు ఉన్నా.. బార్ల యాజమాన్యాలు లెక్కచేయడం లేదు. సమయ నిబంధనలను విచ్చలవిడిగా ఉల్లంఘిస్తున్నాయి. నిబంధనల ప్రకారం బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే తెరిచి ఉంచాలి. కానీ.. అనేక చోట్ల ఉదయాన్నే బార్లు తెరుస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా 24 గంటలూ అమ్ముతున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా ఎక్సైజ్ వర్గాలు పనివేళలపై తనిఖీలు చేశాయి. అయితే దీనిపై నిరంతర నిఘా ఎక్కడా కనిపించడం లేదు. ఇలాంటి ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అటువైపు చూడటం మానేసింది. పైగా ఎక్కడైనా కొందరు అధికారులు కేసులు నమోదుకు ప్రయత్నిస్తే సిండికేట్లు వారిపైనే ఫిర్యాదులు చేస్తామని ఎదురు తిరుగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో బార్ల పనివేళల అంశాన్ని అధికార వర్గాలు చాలావరకు వదిలేశాయి. అనుకున్నంత ఆదాయం రావట్లేదని మద్యం షాపుల లైసెన్సీలు ఆవేదన చెందుతుంటే.. బార్ యాజమాన్యాల తీరుతో వారికి మరింత నష్టం వాటిల్లుతోంది.



ప్రభుత్వ ఆదాయానికి గండి

పనివేళల ఉల్లంఘనలతో పాటు కొన్ని బార్లు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వచ్చే చర్యలకూ పాల్పడుతున్నాయి. నిబంధనల ప్రకారం బార్ లైసెన్సీలు, షాపు లైసెన్సీలు నేరుగా ప్రభుత్వం నుంచే మద్యం కొనుగోలు చేయాలి. అయితే షాపులతో పోలిస్తే బార్ల లైసెన్సీలు 10 నుంచి 13శాతం అదనపు ధరకు మద్యం కొనాలి. అంటే ఏదైనా ఒక సీసాను షాపు లైసెన్సీ రూ.85తో కొంటే.. అదే సీసాను బార్ లైసెన్సీ రూ.98 చెల్లించి కొనాలి. బార్లలో ఎమ్మార్పీ నిబంధనలు ఉండవు కాబట్టి అదనపు ధరలకు ప్రభుత్వం బార్లకు మద్యం సరఫరా చేస్తుంది. అయితే కొందరు ఈ అదనపు ధరలను తప్పించుకోనేందుకు మద్యం షాపుల నుంచి కొంత మద్యాన్ని తీసుకొచ్చి బార్లలో అనధికారికంగా అధిక ధరలకు అమ్ముతున్నారు. దీంతో ప్రభుత్వానికి బార్ల నుంచి అదనపు ఆదాయం తగ్గుతోంది.

చేసిన తప్పులకు మూల్యం తప్పదు: సత్యకుమార్

నందిగామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకొనేలా మాట్లాడి ఇతరుల మనసులను గాయపరిచిన వారు మూల్యం చెల్లించక తప్పదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నందిగామలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్టుపై స్పందించారు. గత ప్రభుత్వ అండతో పోసాని చెలరేగిపోయాడని అన్నారు. బాధితుల ఫిర్యాదుతో ఆయన్ను అరెస్టు చేశారన్నారు. ఇంకా మిగిలిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు.

'నంది' అక్రమాలపై పోసానిని విచారించాలి

- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వ్యవహరిస్తూ, 2023 డిసెంబరులో గుంటూరులో జరిగిన నంది నాటక పోటీల్లో అవకతవకలకు పాల్పడిన పోసాని కృష్ణమురళిపై విచారణ జరిపించాలని కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడారు. తన బంధువులకే పోసాని నంది అవార్డులు ఇప్పించుకున్నారని, ప్రతిభ చూపిన కళాకారులకు మొండిచేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆర్సీ.జి.2.312/2024 **తేది:25-02-2025.**

కలెక్టరు వారి కార్యాలయము, నెల్లూరు

ఫారము-6(ఎ)

2013 వ సంవత్సరము 30వ చట్టం భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టంపరిహారం పొందేహక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2018 లోరూల్-19 సబ్రూల్-(1)ను అనుసరించి.

ప్రాథమిక ప్రకటన

